www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ముఖం చాటేసిన 'నైరుతి'

సగం ముగిసిపోయిన సీజన్

రాష్ట్రంలో సాధారణం కంటే 25% తక్కువ వర్షపాతం నమోదు

సగం మండలాల్లో వర్షాభావం

సీమలో మరింత ఆందోళనకరం

జూలైలో రికార్డు ఉష్ణోగ్రతలు

వేసవిని తలపించే వాతావరణం

ఆశలన్నీ ఆగస్టు, సెప్టెంబరుపైనే

ద్వితీయార్థంలో మంచి వర్షాలు

ఆగస్టులో సాధారణ వర్షపాతం: ఐఎండీ అంచనా 12

సీజన్ తొలి 2 నెలల్లో దేశవ్యాప్తంగా 6.5% ఎక్కువ

శుక్రవారం | 1-8-2025 | పేజీలు: 14 | వెల (Price): Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 146 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షఋతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి పూర్తి, నక్షత్రం: స్వాతి తె.3.40 తదుపరి విశాఖ, వర్జ్యం: ఉ.6.59-8.47, దుర్ముహూర్తం: ఉ.8.31-9.22, మ.12.47-1.38, అమృతఘడియలు: సా.5.46-7.34, రాహుకాలం: ఉ.10.30-12.00, సూర్యోదయం: 5.58, సూర్యాస్తమయం: 6.44 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఇప్పటికి ఇంత..

₹1467 కోట్ల ఇసుక దోచేశారు!

జగన్ హయాంలో నదులన్నీ గుల్ల



ఉపగ్రహ చిత్రాల ఆధారంగా అధ్యయనం

సుప్రీం కోర్టులో సర్కారు అఫిడవిట్

నేడు అక్రమ తవ్వకాల కేసుపై విచారణ

1.22 కోట్ల టన్నుల అక్రమ తవ్వకం లెక్క ఇది

ఇంకా 2.69 కోట్ల టన్నుల సంగతి తేలాలి

అన్నీ కలిపితే అక్రమాల విలువ 4,000 కోట్లపైనే!

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఒకవైపు ఇసుక దోపిడీ... మరోవైపు మద్యం దందా! వైఎస్ జగన్ హయాంలో చోటుచేసుకున్న భారీ 'స్కాము'లివి! లిక్కర్ లెక్కలు 'సిట్' తేలుస్తుండగా... ఇసుక దోపిడీ ఉపగ్రహ చిత్రాల ఆధారంగా బయటపడుతోంది. ఇప్పటిదాకా అంచనా వేసిన ప్రకారం... రూ.1467 కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తవ్వి, అమ్ముకున్నారని ప్రభుత్వం గురువారం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలుచేసింది. ఇది ప్రాథమిక అంచనా మాత్రమే! తుది లెక్కలు తీస్తే... ఈ విలువ రూ.4వేలకోట్లపై మాటే. జగన్ ప్రభుత్వంలో జరిగిన అక్రమ ఇసుక తవ్వకాలపై సుప్రీం కోర్టులో విచారణ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ కేసు శుక్రవారం ధర్మాసనం ముందుకు రానుంది. ఈ సందర్భంగా కోర్టు ఆదేశాల మేరకు

మిగతా 11వ పేజీలో...

మరో 5 కోట్ల గుట్టు రట్టు



రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో మద్యం ముడుపుల పంపిణీ

ఇచ్చింది పంకజ్.. చేరింది సైమన్, వేణుకు.. 25, 30 లక్షల చొప్పున పలుమార్లు అందజేత.. సిట్‌కు వరుణ్ వెల్లడి

అదాన్ అకౌంటెంట్ శ్రీకాంత్ విచారణ 14

డొల్ల కంపెనీల గుట్టు తేల్చేందుకు ముంబైకి సిట్

చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కూ బృందాలు



ఇంకెన్ని బాక్సులు బయటపడతాయో!



పెట్టెల లెక్క జగన్‌కు బాగా తెలుసు

కసిరెడ్డి ఆ డబ్బు తనది కాదంటే అది జగన్‌దే

చట్టం తన పని తాను చేసుకుపోతుంది

జగన్ అరెస్టుపై లోకేశ్ వ్యాఖ్య 13

ఏపీ బ్రాండ్‌ను నాశనం చేశారు

జగన్‌పై లోకేశ్ ఫైర్

ఎమర్జెన్సీ పాలన ఉంటే బయట తిరగ్గలరా?

రాష్ట్రాభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు

మేం అక్కడ ఉండగానే సుస్థిర ప్రభుత్వం లేదంటూ సింగపూర్ ప్రభుత్వానికి మెయిల్లు

పెట్టుబడి పెడితే నష్టపోతారని బెదిరింపులు

పెద్దిరెడ్డి కంపెనీకి చెందిన మురళీకృష్ణతో ఈ-మెయిల్ పంపించారు

అతడిపై కచ్చితంగా చర్యలుంటాయ్

జగన్ తప్పులు దిద్దడానికే సింగపూర్‌కు

వచ్చే ఐదేళ్లలో ఆ ప్రభుత్వం నుంచి 45 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయ్

ఇది జగన్‌కు బ్యాడ్ న్యూస్.. యువతకు గుడ్‌న్యూస్: మంత్రి లోకేశ్

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ అంటే ఒక బ్రాండ్ అని.. దానిని 2019-24 మధ్య ఐదేళ్లపాటు జగన్ నాశనం చేశారని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సింగపూర్ పర్యటనను ముగించుకుని వచ్చిన ఆయన గురువారం ఉండవల్లి నివాసంలో మీడియాతో మాట్లాడారు. జగన్ నిర్వాకాలు, పెట్టుబడులు రాకుండా అడ్డుకోవడానికి జరుగుతున్న కుట్రలు, మద్యం స్కాం, పోలవరం-బనకచర్ల పథకం.. ఇలా పలు అంశాలను ప్రధానంగా ప్రస్తావించారు. 'విద్యుత్ కొనుగోలు ఒప్పందా(పీపీఏ)లను

మిగతా 13వ పేజీలో...

అనుమతులు తీసుకుని

కాళేశ్వరం కట్టారా?

తెలంగాణకో నీతి.. మాకో నీతా?

సముద్రంలో కలిసే వృథా జలాలను బనకచర్లకు వాడుకుంటే తప్పేంటి?

తెలంగాణకు వచ్చే నష్టమేంటి?

బనకచర్లపై లోకేశ్ ప్రశ్న

భారత్, రష్యా.. మృత ఆర్థిక వ్యవస్థలు



ఇరు దేశాలూ కలిసి మరింత దిగజార్చుకుంటాయి

అమెరికాకు భారత్ మిత్ర దేశమే.. కానీ..

వాణిజ్య విధానాలు సమస్యగా మారాయి

మరోసారి నోరు పారేసుకున్న ట్రంప్

ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ భారతే: పీయూష్ గోయల్

ట్రంప్ చెప్పింది వాస్తవమే.. ఆర్థిక వ్యవస్థను ప్రధాని మోదీ 'చంపేశారు': రాహుల్ గాంధీ

ట్రంప్ 'డెడ్ హ్యాండ్'ను గుర్తుచేసుకోవాలి..

రష్యా మాజీ అధ్యక్షుడు మెద్వెదేవ్ పరోక్ష హెచ్చరిక

వాషింగ్టన్, జూలై 31: భారత్, రష్యాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి నోరుపారేసుకున్నారు. ఇరుదేశాల మధ్య వాణిజ్యాన్ని తప్పుపడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత్, రష్యాలవి మృత ఆర్థిక వ్యవస్థ (డెడ్ ఎకానమీ)లుగా అభివర్ణించారు. ఇరుదేశాలూ కలిసి ఆర్థిక వ్యవస్థలను మరింత దిగజార్చుకుంటాయని వ్యాఖ్యానించారు. రష్యాతో భారీగా వాణిజ్య సంబంధాల నేపథ్యంలో భారత్‌పై 25శాతం సుంకాలతోపాటు జరిమానాలు కూడా విధిస్తున్నట్టుగా ప్రకటించిన ట్రంప్.. కొన్ని గంటల్లోనే ఈ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం. దీనికి సంబంధించి ఆయన గురువారం తన సొంత సోషల్ మీడియా 'ట్రూత్'లో

మిగతా 2వ పేజీలో...

పాక్‌తో అమెరికా చమురు ఒప్పందం

నిల్వలపై కలిసి పనిచేస్తాం

వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన ట్రంప్

భవిష్యత్తులో భారత్‌కే పాక్ చమురు విక్రయించవచ్చని జోస్యం

ఇది చరిత్రాత్మక ఒప్పందం అంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పొగడ్తలు

అమెరికా ఊహ ఆసక్తిని కలిగిస్తోంది

వ్యంగ్యాస్త్రాలు సంధించిన శశిథరూర్



అన్నదాత-సుఖీభవ పథకం అమలుపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు


'అన్నదాత సుఖీభవ' జమ రేపే

46,85,838 రైతు కుటుంబాలకు లబ్ధి

తొలి విడత 5 వేలు.. పీఎం కిసాన్‌తో కలిపి మొత్తం జమ 7 వేలు

ప్రకాశం జిల్లా వీరాయపాలెంలో ప్రారంభం

సందేహాల నివృత్తికి 155251 నంబరు



సాగునీరు, ఎరువుల కొరత రానీయొద్దు

రైతులకు సాయం భారం కాదు.. బాధ్యత

ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం

చేసిన మంచిని ప్రజలకు చెప్పాలి

కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగంగా 'అన్నదాత సుఖీభవ' పథకాన్ని శనివారం (2వ తేదీ) నుంచి అమలు చేయనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రకాశం జిల్లా దర్శి మండలం వీరాయపాలెంలో ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 రైతు కుటుంబాలు లబ్ధి పొందుతాయని చెప్పారు. మొదటి విడతలో రాష్ట్ర వాటాగా ఒక్కో రైతుకు రూ.5 వేల చొప్పున

మిగతా 3వ పేజీలో...

మాలేగావ్ పేలుళ్ల కేసు..

ఏడుగురు నిందితులూ

నిర్దోషులే

వారికి వ్యతిరేకంగా నమ్మదగ్గ సాక్ష్యాల్లేవు

పేలుళ్లకు వాడిన బైక్ ప్రజ్ఞాదేనని నిరూపించలేకపోయారు

ఈ కేసులో 'ఉపా' వర్తించదు

ముంబై ప్రత్యేక కోర్టు జడ్జి లహోటీ

ఈ విజయం మా ఒక్కరిదే కాదు..

కాషాయ విజయం కూడా: ప్రజ్ఞా

'కాషాయ ఉగ్రవాదం' అన్న కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలి: బీజేపీ 2



బారికేడ్లను తోసేసి, పోలీసును కిందకు నెట్టేసి కార్యకర్తలతో కలిసి ముందుకు వెళుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

జనం తక్కువ.. ఆర్భాటం ఎక్కువ!

జగన్ నెల్లూరు పర్యటనలో హడావుడి.. భారీగా జన సమీకరణకు ప్రయత్నాలు

అయినా కదిలిరాని పార్టీ శ్రేణులు.. రోడ్డుపై బైఠాయించి ప్రసన్న హంగామా

బారికేడ్లను, పోలీసులను తోసేసి ముందుకు.. హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు 13

విచిత్రాల జగన్!

నెల్లూరులో కట్టు కథలు, వింత వ్యాఖ్యలు

పెద్దిరెడ్డిపై పగతోనే మిథున్ అరెస్టట!

చంద్రగిరి చేజారిందని చెవిరెడ్డిపై కేసులట

కాకాణిపై ఉన్నవి చిన్నచిన్న కేసులేనని చిట్టా

అసలు కేసులు చెప్పకుండా అమాయకత్వం

మూడు వారాల్లోగా

లొంగిపోండి

ఐపీఎస్ సంజయ్‌కు సుప్రీం షాక్.. ముందస్తు బెయిల్ రద్దు





ప్రతి కేంద్రంలో 350 మందే ఎలా వస్తారు?

ఆ మేరకు ఇన్‌వాయి‌స్‌లను ఎలా ఇస్తారు?

భోజనాలు, వసతి అధికారులే చూశారు కదా?

కీలక బాధ్యతల్లో ఉంటే అన్నీ చూసుకోవద్దా?

ఇష్టానుసారం చేస్తామంటే ఎలా?

నాడు అగ్ని, సీఐడీ విభాగాల అధిపతిగా సంజయ్ తీరుపై సుప్రీంకోర్టు ప్రశ్నలు 14

కస్టడీ పిటిషన్ దాఖలుకు ఏసీబీకి అవకాశం

సరికొత్త బ్లడ్ గ్రూప్ 'క్రిబ్'

ప్రపంచంలోనే తొలిసారిగా కర్ణాటక మహిళలో గుర్తింపు

రూ. 17.46 కోట్లు కట్టండి

విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి జరిమానా 12

బీచ్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారంలో విధింపునకు సిఫారసు

నేడు కొత్తగా లక్ష మందికి వితంతు పింఛన్లు 12

బడి దూరం.. భారం కాకుండా.. విద్యార్థులకు రవాణా భత్యం

రాష్ట్రంలో 79,860 మంది అర్హుల గుర్తింపు

నెలకు 600 చొప్పున మూడు నెలలకోసారి 1,800

నేరుగా తల్లుల ఖాతాల్లోకే టీసీ జమ.. 'సమగ్రశిక్ష' ఉత్తర్వులు జారీ 12

నీటి పన్ను బకాయిలపై 85 కోట్ల వడ్డీ మాఫీ



తిరుమలలో రీల్స్ చేస్తే కేసులు: టీటీడీ 3

ఫీజు కడితేనే సర్టిఫికెట్!

విద్యార్థుల జీవితాలతో వర్సిటీల చెలగాటం.. ప్రభుత్వం వద్దే రీయింబర్స్‌మెంట్ పెండింగ్ 11

రూ.4 వేల కోట్లకు పైగా పేరుకున్న బకాయిలు.. అయినా సొంత డబ్బు కట్టి తీసుకోవాలని పట్టు

ఇటీవల ఐసెట్ కౌన్సెలింగ్‌కు విద్యార్థులు దూరం.. ఇప్పుడు పీజీఈసెట్‌లో సీట్లు కోల్పోయే పరిస్థితి

సర్టిఫికెట్ల పరిశీలనకు ఆగస్టు 2 వరకు గడువు.. వర్సిటీలు ప్రైవేట్ సంస్థల్లా మారాయని ఆరోపణలు

పీఎంకేఎస్‌వైకు మరో రూ.4600 కోట్లు!

దేశవ్యాప్తంగా 50 ఆహార వికిరణ కేంద్రాలు, 100 ఆహార తనిఖీ ల్యాబ్‌ల ఏర్పాటుకు వినియోగం

- జాతీయ సహకార అభివృద్ధి సంస్థకు రూ.2 వేల కోట్లు
- కేంద్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు


న్యూఢిల్లీ, జూలై 31: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రధాన మంత్రి కిసాన్ సంపద యోజన (పీఎంకేఎస్‌వై)కు బడ్జెట్ కేటాయింపులు పెంచింది. ఆహారశుద్ధి రంగం కోసం ప్రవేశపెట్టిన ఈ పథకానికి రూ.1920 కోట్లు కేటాయించగా.. ప్రస్తుతం దాన్ని రూ.6520 కోట్లకు పెంచింది. పెంచిన రూ.4600 కోట్లను ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే మంజూరు చేయాలని గురువారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం నిర్ణయించింది. పీఎంకేఎస్‌వైకు పెంచిన నిధులను 50 బహుళ ఉత్పత్తుల ఆహార వికిరణ కేంద్రాలు, 100 ఆహార పదార్థాలను పరీక్షించే ల్యాబ్‌ల ఏర్పాటుకు వినియోగించనున్నట్లు క్యాబినెట్ సమావేశం అనంతరం కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులకు తెలిపారు. 50 ఆహార వికిరణ కేంద్రాల ఏర్పాటు ద్వారా దేశంలో ఏటా వివిధ రకాల ఆహార ఉత్పత్తుల నిల్వ/సంరక్షణ సామర్థ్యం 20-30 లక్షల టన్నుల మే రకు పెరగనుందన్నారు. దేశవ్యాప్తంగా ప్రైవేటు రంగంలో ఎన్ఏబీఎల్ గుర్తింపుతో 100 ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసే ల్యాబ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా అత్యాధునిక పరికరాలతో ఆహార నమూనాలను పరీక్షించవచ్చని తెలిపారు. జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ)కు రూ.2 వేల కోట్ల ఆర్థిక సాయం చేసేందుకు కూడా క్యాబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.

743 మంది హైకోర్టు జడ్జీల్లో
93 మందే ఓబీసీలు

న్యూఢిల్లీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వివిధ హైకోర్టులలో 2018 నుంచి 2025 జూలై వరకు న్యాయమూర్తులుగా నియమితులైన 743 మందిలె కేవలం 93 మంది ఓబీసీలు(12.5శాతం), 23 మంది ఎస్సీలు (3శాతం), 17 మంది ఎస్టీలు (2.2శాతం) మాత్రమే ఉన్నారని కేంద్రప్రభుత్వం తెలిపింది. 743 మంది న్యాయమూర్తులలో 105 (14శాతం) మంది మహిళ న్యాయమూర్తులు ఉన్నారని తెలిపింది. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు ఉన్నత న్యాయవ్యవస్థలో ప్రాతినిధ్యంపై టీడీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు గురువారం రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర న్యాయ మంత్రి రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

లోకం తీరు

భారీ చమురు నిల్వల వెలికితీత కోసం పాక్‌లో ట్రంప్ ఒప్పందం



పాక్‌తో అమెరికా చమురు ఒప్పందం

- చమురు నిల్వలపై కలిసి పనిచేస్తాం
- వాణిజ్య ఒప్పందాన్ని ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్

న్యూయార్క్/ఇస్లామాబాద్, జూలై 31: పాకిస్థాన్‌తో చమురు నిల్వలపై వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. చమురు నిల్వల పెంపునకు ఇరు దేశాలు కలిసి పనిచేస్తాయని, భవిష్యత్‌తో భారత్‌కు పాకిస్థాన్ చమురు విక్రయించవచ్చని జోస్యం చెప్పారు. భారత్‌పై 25% సుంకాలు విధిస్తున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం..! పాక్‌తో వాణిజ్య ఒప్పందం గురించి ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్‌లో పోస్టులు పెట్టారు. పాకిస్థాన్‌తో ముడి చమురు నిల్వల వెలికితీతకు ఒక మంచి ఆయిల్ కంపెనీని ఎంచుకునే ప్రక్రియలో ఉన్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో భారత్‌కు కూడా చమురు విక్రయించేంతగా అపారమైన నిల్వలు పాక్ వద్ద ఉంటాయని వ్యాఖ్యానించారు. మరోవైపు పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కూడా ఈ ఒప్పందంపై సోషల్ మీడియాలో స్పందించారు. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో ఇరు దేశాల భాగస్వామ్యం మరింత బలంగా కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. రేడియో పాకిస్థాన్ కూడా ఈ ఒప్పందంపై ప్రముఖంగా కథనాలను ప్రసారం చేసింది. ఈ ఒప్పందం కోసం వాషింగ్టన్‌లో జరిగిన సమావేశంలో పాక్ ఆర్థిక మంత్రి ఔరంగజేబు, అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవర్డ్ లూట్నిక్, వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రియర్ పాల్గొన్నట్లు తెలిపింది. కాగా, పాక్‌తో అమెరికా కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందంలో తమ ప్రాంతంలోని చమురు క్షేత్రాల అన్వేషణ అంశాన్ని చేర్చడం పట్ల బలూచీ జాతీయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను పాక్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్ తప్పుదోవ పట్టించినట్లు కనిపిస్తోందని బలూచ్ జాతీయవాద నాయకుడు మీర్ యార్ బలూచ్ 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. చమురు నిల్వలు పాక్‌లోని పంజాబ్‌లో లేవని, పాక్ ఆక్రమిత బలూచ్ భూభాగంలో ఉన్నాయని ఆయన తెలిపారు.

శశి థరూర్ వ్యంగ్యాస్త్రాలు

పాకిస్థాన్‌తో చమురు ఒప్పందంపై ట్రంప్ చేసిన ప్రకటనపై కాంగ్రెస్ నేత శశిథరూర్ వ్యంగ్యంగా స్పందించారు. "పాకిస్థాన్‌లో చమురు కనిపిస్తుందని అమెరికా ఊహించుకోవడం ఆసక్తిని కలిగిస్తోంది. ఈ ఒప్పందంపై వాళ్లకు(అమెరికా-పాక్) శుభాకాంక్షలు! పాకిస్థాన్‌లో చమురు ఉందని నేనైతే వినలేదు. కానీ, వెతికే హక్కు అమెరికాకు ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. ట్రంప్ భారత్‌ను ఉద్దేశించి చేసిన 'మృత ఆర్థిక వ్యవస్థలు' అనే వ్యాఖ్యను ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా సుంకాలు చిన్న విషయమేమి కాదని.. ఆ దేశంతో భారత్ వాణిజ్యాన్ని తుడిచిపెట్టే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

భారత్, రష్యాలవి మృత ఆర్థిక వ్యవస్థలు

(మొదటిపేజీ తరువాయి)

పోస్టు పెట్టారు. "రష్యాతో భారత్ ఎలాంటి సంబంధాలు కొనసాగిస్తున్నదో నాకు అనవసరం. ఆ దేశాలు వాళ్ల మృత ఆర్థిక వ్యవస్థలను మరింతగా దిగజార్చుకోవచ్చు. భారత్‌తో మేం చాలా తక్కువ వాణిజ్యం చేస్తున్నాం. ప్రపంచంలోనే అతిఎక్కువగా భారత్ టారిఫ్‌లు ఉన్నాయి. రష్యాతో యూఎస్ఏ దాదాపుగా ఎలాంటి వాణిజ్యం చేయడం లేదు. దాన్ని అలాగే ఉంచేద్దాం. తనను తాను ఇంకా అధ్యక్షుడినేమో అనుకుంటున్న రష్యా మాజీ విఫల అధ్యక్షుడు మెద్వెదేవ్ నోటిని అదుపులో ఉంచుకోవాలి. ఆయన ప్రమాదకర అంశంలో కల్పించుకుంటున్నారు.." అని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికాకు భారత్ మిత్రదేశమే అయినా.. భారత వాణిజ్య విధానాలు సమస్యగా మారాయని వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌ను అంతం చేయకుండా రష్యాను నిలువరించాలని అంతా భావిస్తుంటే.. భారత్ మాత్రం రష్యా నుంచి చమురు, ఆయుధాలు కొనుగోలు చేసిందని ఆరోపించారు.

వాణిజ్య ఒప్పందంపై ఒత్తిడి పెంచేందుకే!

భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందానికి సంబంధించి కొన్ని నెలలుగా చర్చలు సాగుతున్నాయి. ఇప్పటికే భారత బృందాలు పలుమార్లు వాషింగ్టన్‌కు వెళ్లి చర్చలు జరిపాయి. వ్యవసాయ, పాడి ఉత్పత్తులు సహా కొన్ని అంశాలపై పీటముడి కొనసాగుతోంది. ఆగస్టు 25న అమెరికా వాణిజ్య చర్చల బృందం భారత్‌కు రానుంది. ఈ క్రమంలో అమెరికా అనుకూల అంశాలతో ఒప్పందం కుదుర్చుకునే దిశగా ఒత్తిడి పెంచేందుకు ట్రంప్ ప్రయత్నిస్తున్నారని.. 25 శాతం సుంకాలు, జరిమానాల విధింపు, 'మృత ఆర్థిక వ్యవస్థలు' వంటి వ్యాఖ్యలు అందులో భాగమేనని నిపుణులు పేర్కొంటున్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్‌దే..

'భారత్‌ది మృత ఆర్థిక వ్యవస్థ' అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ స్పందించారు. ప్రపంచంలో శరవే



గంగా అభివృద్ధి చెందుతున్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ భారత్‌దేనని, కొన్నేళ్లలో ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ ఎదగనుందని స్పష్టం చేశారు. ప్రపంచ ఆర్థిక సంస్థలు, వ్యవస్థలు ఇప్పుడు భారత్‌వైపే చూస్తున్నాయని చెప్పారు. అమెరికా సుంకాలు, వాణిజ్య ఒప్పందం అంశానికి సంబంధించి భారత్ తన ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవహరిస్తుందని ఆయన పార్లమెంటు ఉభయ సభల్లో గురువారం ప్రకటించారు. అమెరికా సుంకాల ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలపై వాణిజ్య సంస్థలు, ఎగుమతిదారులు, ఇతర భాగస్వాములతో కేంద్ర వాణిజ్య శాఖ చర్చలు జరుపుతోందన్నారు.

రాహుల్ వ్యాఖ్యలు దేశాన్ని అవమానించడమే: బీజేపీ

ట్రంప్ వ్యాఖ్యలను రాహుల్ గాంధీ సమర్థించడం దేశ ప్రజలను అవమానించడమేనని బీజేపీ మండిపడింది."రాహుల్ గాంధీ పూర్తిగా దిగజారిపోయారు. ట్రంప్ వ్యాఖ్యలను ఆయన సమర్థించడం 140 కోట్ల మంది దేశ ప్రజలను అవమానించడమే. నిజానికి చనిపోయినది ఆర్థిక వ్యవస్థ కాదు.. రాహుల్ ఘన వారసత్వం, ఆయనపై ప్రజల నమ్మకం చనిపోయాయి" అని బీజేపీ ఐటీ సెల్ చీఫ్ అమిత్ మాలవీయ విమర్శించారు. రాహుల్ గాంధీకి భారత వ్యతిరేక మనస్తత్వం అలవడిపోయిందని బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ విమర్శించారు.

ఆరు భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు

ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న ఇరాన్‌తో వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయంటూ ఆరు భారతీయ కంపెనీలు సహా 20 సంస్థలపై అమెరికా తాజాగా ఆంక్షలు విధించింది. ఇరాన్ నుంచి పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న ఈ కంపెనీలేవీ.. అమెరికాతో, అమెరికన్ సంస్థలతో ఎలాంటి లావాదేవీలు విధించడానికి వీల్లేదని పేర్కొంది. ఈ జాబితాలో భారత్‌కు చెందిన కంచన్ పాలిమర్స్, ఆల్కెమికల్ సొల్యూషన్స్, రమ్నిక్‌లాల్ ఎస్ గొసాలియా అండ్ కంపెనీ, జుపిటర్ డై కెమ్ ప్రైవేట్ లిమిటెడ్, గ్లోబల్ ఇండస్ట్రియల్ కెమికల్స్, పెర్సిస్టెన్స్ పెట్రోకెమ్ సంస్థలు ఉన్నాయి.

ట్రంప్ 'డెడ్ హ్యాండ్'ను గుర్తు చేసుకోవాలి: మెద్వెదేవ్

'భారత్, రష్యా మృత ఆర్థిక వ్యవస్థలు', 'ప్రమాదకర అంశంలోకి వస్తున్నారు' అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రష్యా మాజీ అధ్యక్షుడు దిమిత్రి మెద్వెదేవ్ మండిపడ్డారు. "ట్రంప్‌కు చాలా ఇష్టమైన రక్తపిశాచాల (జాంబీ)ల సినిమాలు ఆయనను ఇంకా భయపెడుతున్నట్లు ఉన్నాయి. ట్రంప్ 'వాకింగ్ డెడ్' వంటి సినిమాలతోపాటు భయంకరమైన 'డెడ్ హ్యాండ్'ను కూడా గుర్తుకు తెచ్చుకోవాలి" అని మెద్వెదేవ్ పేర్కొన్నారు. 'డెడ్ హ్యాండ్' అనేది ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఆటోమేటిక్ అణ్వస్త్ర నియంత్రణ వ్యవస్థ. దేశానికి చెందిన కీలక నేతలు అంతా చనిపోయినా కూడా శత్రుదేశంపై అణ్వస్త్రాలను ప్రయోగించి నాశనం చేస్తుందని చెబుతారు. అప్పట్లో సోవియట్ యూనియన్ 'డెడ్ హ్యాండ్'ను సిద్ధం చేసిందనే ప్రచారం సాగింది. ఇప్పుడు మెద్వెదేవ్ 'డెడ్ హ్యాండ్'ను ప్రస్తావించడం ద్వారా అవసరమైతే అణు దాడికి కూడా సిద్ధమనే హెచ్చరికలు చేశారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ట్రంప్ చెప్పింది వాస్తవమే..

- దేశ ఆర్థిక వ్యవస్థ 'చనిపోయిందని' అందరికీ తెలుసు!: రాహుల్‌గాంధీ



బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం మన దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థలను, విదేశాంగ విధానాన్ని నాశనం చేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. అదానీకి సాయం చేసేందుకే భారత ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని, దేశాన్ని పాతాళానికి తీసుకెళ్తున్నారని విమర్శించారు. పార్లమెంటు ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. "అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పినది వాస్తవమే. భారత ఆర్థిక వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని ప్రధాన మంత్రికి, ఆర్థిక మంత్రికి తప్ప అందరికీ తెలుసు. ట్రంప్ ఈ వాస్తవం చెప్పినందుకు ధన్యవాదాలు. మన విదేశాంగ విధానం అద్భుతమంటూ విదేశాంగ మంత్రి ప్రసంగాలు చేస్తుంటారు. మరోవైపు అమెరికా మన దేశాన్ని కించపర్చేలా మాట్లాడుతుంది. చైనా కూడా అలాగే చేస్తుంది. పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా ప్రపంచ దేశాలకు ప్రతినిధి బృందాలను పంపుతారు. కానీ ఒక్కదేశమూ పాకిస్థాన్‌ను తప్పుపట్టదు. దేశాన్ని ఇలా ఎలా నడిపిస్తున్నారు. వీళ్లకు అసలు దేశాన్ని పాలించడమే రాదు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. ట్రంప్ చెప్పినట్టుగా మోదీ ఆడుతున్నారని విమర్శించారు. అనంతరం 'ఎక్స్'లో పోస్టు పెడుతూ.. "భారత ఆర్థిక వ్యవస్థ చనిపోయిందని, మోదీయే చంపేశారని ఆరోపించారు. కాగా యుద్ధాన్ని ఆపాలంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై స్పందించకుండా పార్లమెంటులో మోదీ మౌన వ్రతం పాటించారని.. ఇప్పుడు మృత ఆర్థిక వ్యవస్థ అంటూ ట్రంప్ చేసిన వ్యాఖ్యలపైనా మౌనంగానే ఉంటారా? అని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు.

మాలేగావ్ పేలుళ్ల కేసు.. ఏడుగురు నిందితులూ నిర్దోషులే



ప్రజ్ఞా ఠాకూర్



సమీర్ కులకర్ణి, మేజర్ రమేశ్ ఉపాధ్యాయ (రిటైర్డ్), ప్రసాద్ పురోహిత్



అజయ్ రహీర్కర్ సుధాకర్ చతుర్వేది సుధాకర్ ద్వివేది

ముంబై, హైదరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పదిహేడేళ్లనాటి మాలేగావ్ పేలుళ్ల కేసుపై ముంబై ప్రత్యేక కోర్టు గురువారం తీర్పునిచ్చింది. బీజేపీ మాజీ ఎంపీ ప్రజ్ఞా సింగ్ ఠాకూర్, లెఫ్టినెంట్ కర్నల్ ప్రసాద్ పురోహిత్ సహా ఈ కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏడుగురినీ నిర్దోషులుగా ప్రకటించింది. వారికి వ్యతిరేకంగా ఈ కేసులో ఎలాంటి బలమైన, నమ్మదగ్గ సాక్ష్యాలేవీ లేవని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. పేలుళ్లకు ఉపయోగించిన బైక్ ప్రజ్ఞా ఠాకూర్‌దేనని, ఆ బైక్ ఆమె పేరిటే రిజిస్టర్ అయ్యిందని నిరూపించడంలో ప్రాసిక్యూషన్ విఫలమైందని... ఆ బైక్‌పైనే బాంబు పెట్టి పేల్చారన్న విషయాన్ని నిర్ధారించలేకపోయిందని.. కేవలం అనుమానంతో ఎవరినీ దోషులుగా ప్రకటించలేమని వ్యాఖ్యానించింది. ఉగ్రవాదానికి మతం లేదని.. ఈ కేసును విచారించిన ప్రత్యేక జడ్జి ఏకే లహోటీ పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో పలు లోపాలు ఉన్నాయన్న ఆయన.. నిందితులపై ఆరోపణలు పూర్తిగా నిరూపించలేకపోయినందున వారికి బెనిఫిట్ ఆఫ్ డౌట్ ఇవ్వడం సముచితమని అభిప్రాయపడ్డారు. అంతేకాదు.. ఈ కేసులో ఉపా (చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం) నిబంధనలు వర్తించవని తేల్చిచెప్పారు. ఈ పేలుళ్లలో చనిపోయిన ఆరుగురి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున.. గాయపడ్డ 101 మందికి రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాల్సిందిగా ఆదేశించారు. ఈ తీర్పు వినగానే.. ఏడుగురు నిందితుల (ప్రజ్ఞా ఠాకూర్, ప్రసాద్ పురోహిత్, మేజర్ రమేశ్ ఉపాధ్యాయ (రిటైర్డ్), అజయ్ రహీర్కర్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణి) ముఖాలపై చిరునవ్వు మెరిసింది. ఈ తీర్పు పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు. తీర్పు ఇచ్చిన న్యాయమూర్తికి, తమ న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది కేవలం తమ విజయం మాత్రమే కాదని.. కాషాయ విజయం అని ప్రజ్ఞా ఠాకూర్ వ్యాఖ్యానించారు. ఈ కేసు కారణంగా తన జీవితం 17 సంవత్సరాలుగా నాశనమైందని.. కాషాయ ధ్వజాన్ని అవమానించడానికి ప్రయత్నించినవారిని దేవుడు శిక్షిస్తాడని అన్నారు. బీజేపీ సైతం కోర్టు తీర్పును స్వాగతించింది. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు.. నాటి గుజరాత్ ముఖ్యమంత్రి మోదీ ఎదుగుదలను అడ్డుకోవడానికి, ముస్లిం ఓటర్లను బుజ్జగించడానికి 'హిందూ ఉగ్రవాదం' అనే సిద్ధాంతాన్ని తెరపైకి తెచ్చిందని దుయ్యబట్టింది. కాషాయ ఉగ్రవాదం ఎప్పుడూ లేదని.. ఎప్పటికీ ఉండబోదని బీజేపీ సీనియర్ నేత, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. కాషాయ ఉగ్రవాదం అంటూ విష ప్రచారం చేసి సనాతన ధర్మాన్ని అప్రతిష్ఠపాలు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేతలు సోనియా, రాహుల్ తదితరులు ఇప్పుడు హిందువులకు క్షమాపణ చెప్పాలని బీజేపీ ఐటీ విభాగాధిపతి అమిత్ మాలవీయ డిమాండ్ చేశారు. 'కాషాయ ఉగ్రవాదం' అనే మాటను విస్తృతంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలని శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే వ్యాఖ్యానించారు. ఇక.. ఉగ్రవాదాన్ని ఏ మతంతోనూ ముడిపెట్టకూడదని.. ఏ మతమూ హింసను ప్రోత్సహించదని కాంగ్రెస్ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ అన్నారు. కాగా.. కోర్టు తీర్పును రాష్ట్ర సర్కారు ఉన్నత న్యాయస్థానంలో సవాల్ చేయాలని మహారాష్ట్రకు చెందిన ఎంఐఎం నేత ఇంతియాజ్ జలీల్ డిమాండ్ చేశారు. ఆ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ.. ఈ కేసులో కోర్టు తీర్పు తమకు తీవ్ర నిరాశ కలిగించిందని వ్యాఖ్యానించారు. మతాన్ని లక్ష్యంగా చేసుకుని జరిగిన దాడి కేసు దర్యాప్తులో, ప్రాసిక్యూషన్‌లో ఉదాసీనత ప్రదర్శించడం వల్లే నిందితులు నిర్దోషులుగా విడుదలయ్యారని పేర్కొన్నారు. ముంబై ట్రైన్ బ్లాస్ కేసులో నిందితుల విడుదలపై తక్షణమే స్టే కోరిన మహారాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నాయని ఆయన నిలదీశారు.

ఇదీ కేసు నేపథ్యం..

2008 సెప్టెంబరు 29న.. మహారాష్ట్రలోని మాలేగావ్‌లో రెండుచోట్ల జరిగిన పేలుళ్లలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా గాయపడిన సంగతి తెలిసిందే. తొలుత మహారాష్ట్ర యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ ఈ కేసు దర్యాప్తును చేపట్టింది. ప్రజ్ఞాఠాకూర్ సహా 16 మందిని నిందితులుగా పేర్కొంటూ ఎంకోకా (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్) కింద అభియోగాలు నమోదు చేసింది. 2011లో ఈ కేసు దర్యాప్తు ఎన్ఐఏ చేతికి వచ్చింది. ఈ కేసులో సాక్షులందరినీ విచారించిన ఎన్ఐఏ.. ప్రజ్ఞా ఠాకూర్ సహా మరికొందరికి 2016లో క్లీన్‌చిట్ ఇచ్చింది. అయితే, అదే ఎన్ఐఏ యూటర్న్ తీసుకుని ప్రజ్ఞాఠాకూర్ సహా ఈ కేసులో ఏడుగురు నిందితులకూ ఉరిశిక్ష విధించాలని ఈ ఏడాది ఏప్రిల్‌లో కోర్టుకు విజ్ఞప్తి చేసింది. కానీ, కోర్టు ఆ విజ్ఞప్తిని తోసిపుచ్చి.. ఆ ఏడుగురినీ నిర్దోషులుగా ప్రకటించింది. దర్యాప్తు సంస్థలు మారడమే కాదు.. 17 ఏళ్లపాటు సుదీర్ఘంగా కొనసాగిన ఈ కేసుపై ఐదుగురు జడ్జిలు విచారణ జరపడం గమనార్హం.

నగదు డిపాజిట్ చేయించి బెయిల్ ఇవ్వకూడదు

- నిందితుడి హామీని నమ్మకూడదు
- న్యాయస్థానాలకు సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ, జూలై 31: నిందితుడు ఇచ్చిన హామీని పరిగణనలోకి తీసుకొని బెయిల్ మంజూరు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నగదు డిపాజిట్‌గా తీసుకొని బెయిల్ ఇవ్వకూడదని పేర్కొంది. కేవలం కేసులోని విషయం ఆధారంగానే ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ తీర్పును అన్ని హైకోర్టులు, ట్రయల్ కోర్టులకు పంపించాలని రిజిస్ట్రీని ఆదేశించింది. రూ.1.6 కోట్లను దుర్వినియోగం చేశారన్న కేసులో గజానన్ దత్తాత్రేయ గోరే అనే వ్యక్తి బెయిల్ కోసం బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. రూ.25 లక్షలను డిపాజిట్ చేస్తానని అతడు హామీ ఇవ్వడంతో బెయిల్ మంజూరు చేసింది. విడుదలయిన తరువాత అతడు ఆ సొమ్మును డిపాజిట్ చేయకపోవడంతో హైకోర్టు బెయిల్‌ను రద్దు చేసింది. దీన్ని సవాలు చేస్తూ అతడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. విచారణ జరిపిన ధర్మాసనం హైకోర్టు నిర్ణయాన్ని సమర్థించింది.

యూపీలో మత మార్పిళ్ల కోసం చెన్నై నుంచి నగదు

- ఓ పాస్టర్ ఖాతాలో భారీగా జమ

చెన్నై, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్‌లో గ్రామీణ ప్రజలను మతం మార్పించేందుకు తమిళనాడులోని చెన్నై నుంచి భారీగా నగదు పంపినట్లు ఆ రాష్ట్ర పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. యూపీలోని లఖింపూర్ ఖేరీ ప్రాంతంలో కుగ్రామాలకు చెందిన నిరుపేదలను బలవంతంగా క్రైస్తవ మతంలోకి మార్చారనే ఆరోపణలపై మతపెద్ద (పాస్టర్) వినోద్‌పాల్ సింగ్, ఆయన భార్య జ్యోతి, సహాయకులు అనంత రామ్, శుభకరన్, రమిత్‌లను పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. వినోద్‌పాల్ సింగ్‌ను విచారించగా.. పేదలను మతం మార్చేందుకు, క్రైస్తవ సభలు జరిపేందుకు అతని బ్యాంకు ఖాతాల్లో చెన్నై నుంచి భారీ ఎత్తున నగదు జమ అయినట్లు తేలింది.

రోహింగ్యాలు శరణార్థులా? చొరబాటుదార్లా?

- తేల్చాల్సిన ప్రధాన సమస్య ఇదే: సుప్రీంకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 31: రోహింగ్యాలు శరణార్థులా? లేదంటే దేశంలో అక్రమంగా ప్రవేశించిన చొరబాటుదార్లా అన్నదే ప్రధాన సమస్య అని, దీన్ని మొదట తేల్చాల్సి ఉందని గురువారం సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. ఇది తేలితే ఇతర సమస్యలను పరిష్కరించడం తేలికవుతుందని తెలిపింది. దేశంలోని రోహింగ్యాలపై దాఖలైన పలు పిటిషన్లపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. మయన్మార్, బంగ్లాదేశ్‌ల నుంచి వచ్చిన రోహింగ్యాలను శరణార్థులుగా ప్రకటించవచ్చా? ఒకవేళ అలాంటి గుర్తింపు ఇస్తే వారికి కలిగే హక్కులు, సౌకర్యాలు, రక్షణలు ఏమిటని ప్రశ్నించింది. ఒకవేళ అక్రమ చొరబాటుదార్లుగా గుర్తిస్తే వారిని తిప్పిపంపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సమర్థనీయమేనా అని అడిగింది. అక్రమ చొరబాటుదార్లే అయితే వారిని చిరకాలం పాటు నిర్బంధంలో ఉంచవచ్చా? బెయిల్‌పై విడుదల చేస్తే ఎలాంటి షరతులు విధించాలి? అన్న ప్రశ్నలు తలెత్తుతాయని తెలిపింది. ఈ సమస్యల ఆధారంగా చేసుకొని దాఖలైన పిటిషన్లను మూడు వర్గాలుగా విభజించి ప్రతి బుధవారం విచారణ జరపనున్నట్లు పేర్కొంది.

ధర్మస్థలలో ఆరో చోట కనిపించిన అస్థిపంజరం

బెంగళూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని ధర్మస్థలలో మృతదేహాల ఆనవాళ్ల కోసం సిట్ జరుపుతున్న తవ్వకాల్లో మూడో రోజు ఓ అస్థిపంజరం బయటపడింది. ధర్మస్థలలో వందలాది మృతదేహాలను పూడ్చినట్లు నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. తొలి రెండు రోజులు ఐదు ప్రాంతాల్లో జరిపిన తవ్వకాల్లో మృతదేహాల ఆనవాళ్లేమీ లభించలేదు. మూడో రోజు గురువారం నేత్రావతి నది సమీపంలోని అటవీ ప్రాంతంలో సిట్ అధికారులు, దక్షిణ కన్నడ జిల్లా పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల సమక్షంలో తవ్వకాలు కొనసాగాయి. మాజీ పౌర కార్మికుడు చూపించిన ఆరో ప్రాంతంలో అస్థిపంజరం లభించింది. కొన్ని ఎముకలు, పగిలినట్లు ఉన్న పుర్రె బయటపడ్డాయి. ఫోరెన్సిక్ నిపుణుల బృందాలు అక్కడే ఉంటూ పర్యవేక్షిస్తున్నాయి. అస్థిపంజరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని నిర్ణయించారు. అది పురుషుడిదని ప్రాథమికంగా గుర్తించారు. ఎస్పీ జితేంద్రకుమార్ దయా, పుత్తూరు ఏసీపీ స్టెల్లావర్గీస్ తవ్వకాలను పర్యవేక్షించారు. అస్థిపంజరం లభించిందనే సమాచారం తెలియగానే సిట్ కార్యాలయం నుంచి చీఫ్ ప్రణవ్ మొహంతీ, డీఐజీ ఎంఎన్ అనుచేత్ ఆ ప్రాంతానికి వచ్చారు.

జగన్ లక్కీ నంబరు 11: బుద్దా వెంకన్న



విజయవాడ (వన్‌టౌన్), జూలై 31 (ఆంధ్రజ్యోతి): జగన్మోహన్ రెడ్డి లక్కీ నంబరు 11 అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఎద్దేవా చేశారు. కృష్ణా జిల్లాలో ఆకు రౌడీలు కొడాలి నాని, వల్లభనేని వంశీ, దేవినేని అవినాష్, జోగి రమేష్‌ల వద్ద పేర్ని నాని ప్రతి నెలా పేమెంట్‌లు తీసుకుని మాట్లాడుతున్నాడని విమర్శించారు. పేర్ని నానికి దమ్మూ ధైర్యం ఉంటే బియ్యం స్కామ్‌పై చర్చకు రావాలని సవాల్ విసిరారు. గురువారం మంగళగిరిలోని టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజల కష్టాలు తెలుసుకోవడానికి ఒక యాప్ ప్రారంభిస్తామని జగన్‌చెబుతున్నారని, అయితే కూటమి ప్రభుత్వంలో ఎవరూ కష్టాలు పడటం లేదని చెప్పారు. కానీ, జగన్ రెడ్డి వైసీపీ పాలనలో కల్తీ మద్యం వల్ల ఎంత మంది చనిపోయారు, ఎన్ని తాళిబొట్లు తెగిపోయాయి, ఇంకా జరిగిన దౌర్జన్యాలు, అక్రమాలను తెలుసుకోవటానికి యాప్‌ను జగన్ ప్రారంభిస్తే మంచిదని ఎద్దేవా చేశారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసిన వైసీపీకి గత ఎన్నికల్లో 11 సీట్లు ప్రజలు కట్టబెట్టారని, హైదరాబాద్‌లో లిక్కర్ స్కామ్‌లో మొదట దొరికిన డబ్బులు 11 కోట్లు కాబట్టి జగన్మోహన్ రెడ్డి లక్కీ నంబరు 11 అని ఆయన ఎద్దేవా చేశారు. ఇక నుంచి జగన్‌ను 11 అంటామని తెలిపారు.

ఎస్ఐఆర్‌పై చర్చించాల్సిందే

- కొనసాగిన ప్రతిపక్షాల ఆందోళనలు
- పార్లమెంటు ఉభయసభల వాయిదా

న్యూఢిల్లీ, జూలై 31: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్- ఎస్ఐఆర్)పై చర్చకు పట్టుబడుతూ విపక్షాలు చేపట్టిన ఆందోళనలతో పార్లమెంట్ ఉభయసభలు గురువారం స్తంభించిపోయాయి. పలుమార్లు వాయిదాలు పడుతూ కొనసాగిన సభలు ఎలాంటి చర్చలు లేకుండానే శుక్రవారానికి వాయిదా పడ్డాయి. ఇస్రో, నాసా సంయుక్తంగా నైసార్ ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టడంతో ఆయా శాస్త్రవేత్తలకు పార్లమెంట్ ఉభయసభలు శుభాకాంక్షలు తెలియజేశాయి. మరోవక్క, రాజ్యసభలోనూ తీవ్ర గందరగోళం కొనసాగింది. ఎస్ఐఆర్ అంశంతోపాటు ఆపరేషన్ సిందూర్‌పై ప్రధాని మోదీ రాజ్యసభకు బదులివ్వలేదంటూ ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశాయి. నినాదాలతో సభను హోరెత్తించాయి. ప్రధాని మోదీ సభకు వచ్చి మాట్లాడాలని పట్టుబట్టాయి. ఆందోళనలు కొనసాగుతుండడంతో రాజ్యసభను కూడా శుక్రవారానికి వాయిదా వేశారు.

సరికొత్త బ్లడ్ గ్రూప్ 'క్రిబ్'

- ప్రపంచంలోనే మొట్టమొదటి సారిగా కర్ణాటక మహిళలో గుర్తింపు



బెంగళూరు, జూలై 31: ప్రపంచంలో ఇంతకు ముందెన్నడూ లేని ప్రత్యేక బ్లడ్ గ్రూప్‌ను కర్ణాటకకు చెందిన ఓ మహిళలో గుర్తించారు. ఈ గ్రూప్‌నకు శాస్త్రవేత్తలు సీఆర్ఐబీ (క్రిబ్) అని నామకరణం చేశారు. భారత్, బ్రిటన్‌లకు చెంది న శాస్త్రవేత్తలు పది నెలల సుదీర్ఘ పరిశోధన అనంతరం అత్యంత అరుదైన ఈ బ్లడ్ గ్రూప్‌ను ఆవిష్కరించారు. ఇప్పటి వరకు ఈ తరహా బ్లడ్ గ్రూప్ ఈ మహిళలో మాత్రమే ఉందని పేర్కొన్నారు. 38 ఏళ్ల మహిళ గుండె సంబంధిత వ్యాధితో గతేడాది కోలారులోని ఆర్ఎల్ జాలప్ప ఆస్పత్రిలో చేరారు. ఆమెకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు నిర్ణయించారు. ఆమెది ఓ-పాజిటివ్ వర్గానికి చెందిన రక్తం కావడంతో శస్త్రచికిత్సకు రక్తమార్పిడి కోసం శాంపిళ్లను పరీక్షించారు. అయితే డాక్టర్లను ఆశ్చర్యపరుస్తూ అన్ని శాంపిళ్లలో రియాక్షన్ వచ్చింది. పేషెంట్ కుటుంబంలోని 20 మంది శాంపిళ్లు ప్రయత్నించినా ఏదీ మ్యాచ్ కాలేదు. ఆమె రక్తంలో గుర్తు తెలియని, గతంలో ఎన్నడూ చూడని యాంటిజెన్ ఉండటం వల్ల ఇలా జరుగుతోందని గుర్తించారు. చివరకు రక్తమార్పిడి చేయకుండానే శస్త్రచికిత్స పూర్తి చేశారు. అయితే ఆమె రక్తనమూనాలను బ్రిటన్‌లోని బ్రిస్టల్‌లో ఉన్న అంతర్జాతీయ బ్లడ్ గ్రూప్ రిఫరెన్స్ ల్యాబొరేటరీకి పంపారు. అక్కడ 10 నెలల పరిశోధన అనంతరం క్రోమర్ వ్యవస్థలో సరికొత్త యాంటిజెన్‌ను గుర్తించారు. దీంతో ఈ బ్లడ్ గ్రూప్‌నకు సీఆర్ఐబీగా నామకరణం చేశారు. సీఆర్ అంటే క్రోమర్ అని, ఐబీ అంటే ఇండియా బెంగళూరు అని అర్థం వచ్చేటట్లుగా పేరు పెట్టారు. ఈ రక్తవర్గం ప్రపంచంలోనే మొట్టమొదటిగా ప్రకటించారు. కాగా, ఐఎస్‌బీటీ మార్గదర్శకాల ప్రకారం కూడా ఆమెను మొట్టమొదటి క్రిబ్ బ్లడ్ గ్రూప్ ఉన్న వ్యక్తిగా ప్రకటించారు.



బళ్లారిలో ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నందమూరి రామకృష్ణ, టీడీ జనార్దన్ తదితరులు

ఎన్టీఆర్ జనం గుండెల్లో ఉంటారు

- నందమూరి రామకృష్ణ, టీడీ జనార్దన్
- బళ్లారిలో అన్న క్యాంటీన్ సేవలకు అభినందనలు

బళ్లారి, జూలై 31(ఆంధ్రజ్యోతి): సూర్యచంద్రులు, రామాయణ, మహాభారతాలు ఉన్నంతకాలం దివంగత నందమూరి తారక రామారావు జనం గుండెల్లో సజీవంగానే ఉంటారని ఆయన తనయుడు నందమూరి రామకృష్ణ అన్నారు. బళ్లారి కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ సేవలను గుర్తించి, అభినందించేందుకు గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆ సంఘం బళ్లారి జిల్లా అధ్యక్షుడు ముండ్లూరు అనూప్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో టీడీపీ కృష్ణా జిల్లా సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ప్రపంచ దేశాల్లో ఏ నటుడూ నటించలేనన్ని పాత్రలను ఎన్టీఆర్ నటించారని, రాజకీయాల్లో తనదైన పాలనతో చరిత్ర సృష్టించారని, తెలుగు బాషను విశ్వవ్యాప్తం చేశారని, పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని రామకృష్ణ పేర్కొన్నారు. బళ్లారిలో ఎన్టీఆర్ పేరుతో నిత్యాన్నదానం చేయడం సంతోషకరమని టీడీ జనార్దన్ అన్నారు. కార్యక్రమంలో కమ్మ మహాజన సంఘం నాయకుడు కొత్తపల్లి తిమ్మరాజులు, పలువురు టీడీపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'మడ'తేశారు!




అక్రమంగా తవ్విన రొయ్యల చెరువు, నరికి వేసిన మడ చెట్ల కొమ్మలు

పీడబ్ల్యూడీ భూముల్లోని మడచెట్లు కొట్టి అడ్డగోలుగా రొయ్యల చెరువుల తవ్వకం

- కృష్ణాలో అక్రమార్కులకు రెవెన్యూ అండ
- 200 ఎకరాల ఆక్రమణ.. పట్టాలు.. రిజిస్ట్రేషన్
- మౌనంగా అటవీ, సాగునీటి శాఖలు
- రొయ్యల చెరువులతో పొలాలు నాశనం
- ఆందోళనలో పట్టాభూముల రైతులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

సముద్రతీర ప్రాంతాలకు రక్షణ కల్పించే ఎంతో విలువైన మడ చెట్లు రెవెన్యూ అధికారుల నిర్వాకంతో కనుమరుగైపోతున్నాయి. కృష్ణాజిల్లా పెడన జింజేరులో లజ్జబండ కాల్వ వెంబడి ఆక్వా సాగు కోసం అక్రమార్కులు విచ్చలవిడిగా మడ చెట్లను నరికేస్తున్నారు. పీడబ్ల్యూడీ భూములుగా ఉన్న వాటికి కూడా పట్టాలు ఇచ్చి, రెవెన్యూ రికార్డుల్లోకి ఎక్కిస్తూ పెడన రెవెన్యూ అధికారులు అడ్డగోలుగా ఈ అక్రమాలకు సహకరిస్తున్నారు. మడచెట్లను యథేచ్ఛగా నరికేస్తుండటంతో సముద్రపు ఆటుపోట్ల కారణంగా ఎగదన్నే ఉప్పునీటితో పంట పొలాలు చౌడుబారిపోతున్నాయి. మడ చెట్లు కొట్టేస్తుంటే అటవీశాఖ, పీడబ్ల్యూడీ భూములను కొల్లగొడుతుంటే ఇరిగేషన్ శాఖ ఏం చేస్తున్నాయనేది పెద్ద ప్రశ్న! వివరాల్లోకి వెళితే...పెడన మండలంలో సముద్రతీర ప్రాంతమైన జింజేరు మీదుగా లజ్జబండ డ్రెయిన్ ప్రవహిస్తోంది. డ్రెయిన్ ఎగువన గుడివాడ నుంచి వచ్చి, జింజేరు దిగువన పెదపట్నం దగ్గర సముద్రంలో కలుస్తుంది. ఈ డ్రెయిన్‌కు రెండు వైపులా ఒక్క జింజేరు (2) ప్రాంతంలోనే 200 ఎకరాల పీడబ్ల్యూడీ భూములున్నాయి. ఈ భూముల్లో ఇప్పటి వరకు 125 ఎకరాలను అక్రమార్కులు ఆక్రమించుకుని ఆక్వా సాగు చేస్తున్నారు. తాజాగా మిగిలిన 75 ఎకరాల పీడబ్ల్యూడీ భూముల పరిధిలో కూడా లజ్జబండ డ్రెయిన్‌కు రెండు వైపులా మడచెట్లను నరికి భూములను ఆక్రమిస్తున్నారు. ఇలా ఆక్రమించిన భూములలో యుద్ధ ప్రాతిపదికన ప్రొక్లయినర్లను తెప్పించి రాత్రికి రాత్రే చెరువులు తవ్విస్తున్నారు. కృష్ణాజిల్లా అచ్చయ్యవారి పాలెం గ్రామం పరిధిలోని జింజేరు (2)లో సర్వే నంబర్ 16/1, 21/1, 21/2, 21/3, 23/3 లలో అడ్డగోలుగా మడచెట్లను నరికి చేపల చెరువులు తవ్వారు. తమ భూముల వెంబడి ఆయా సర్వే నంబర్ల పరిధిలో జరుగుతున్న మడచెట్ల నరికివేత, అక్రమ చెరువుల తవ్వకంపై స్థానిక రైతులు రెవెన్యూ అధికారులు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. స్థానిక రెవెన్యూ అధికారి దృష్టికి ఎన్ని సార్లు తీసుకు వెళ్ళినా పట్టించుకోవటం లేదని, అక్రమ తవ్వకాలన్నీ మండల రెవెన్యూ అధికారుల కనుసన్నలలో జరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. రొయ్యల చెరువులను ఏర్పాటు చేసుకోవటానికి పంట చేల నుంచి మురుగుపోయే కాల్వలు కూడా పూడ్చేస్తున్నారు. సాగు నీటి కాలువలను కూడా పూడ్చివేస్తున్నారు. దీంతో రైతులు చాలా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోంది.



సముద్రతీర ప్రాంతం పెడన జింజేరులోని పీడబ్ల్యూడీ భూముల్లో మడ చెట్లు నరికి అక్రమంగా తవ్విన రొయ్యల చెరువులు(శాటిలైట్ చిత్రం)

పట్టాలెలా ఇస్తారు?

పీడబ్ల్యూడీ భూములనేవి నిషేధిత భూములు. వీటికి కూడా స్థానిక రెవెన్యూ అధికారులు పట్టాలు ఇస్తున్న తీరు చర్చనీయాంశంగా మారింది. సర్వే నెంబర్ 21/1 , 21/2 లలో పీడబ్ల్యూడీ భూములను ఆక్రమించుకున్న వారి పేర్లను అడంగల్ 1బీలో పేర్లను నమోదు చేశారు. ఇది ముమ్మాటికీ తప్పు. కానీ ఈ పని రెవెన్యూ అధికారులు ఇంత ధైర్యంగా ఎలా చేశారన్నది తేలాల్సి ఉంది. పీడబ్ల్యూడీ భూములలో రొయ్యల సాగు చేస్తున్న వారిలో కొందరు ఆ భూములను విక్రయిస్తున్నారు కూడా. అడంగల్ 1బీలో అధికారులు నమోదుచేసిన పేర్లను అడ్డం పెట్టుకుని అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. అత్యంత విలువైన మడచెట్లను దారుణంగా నరికివేస్తుంటే అటవీ శాఖ అధికారులు ఏం చేస్తున్నారో తెలియటం లేదు. లజ్జబండ డ్రెయిన్ వెంబడి ఉన్న పీడబ్ల్యూడీ భూములను ఆక్రమిస్తుంటే ఇరిగేషన్ శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారు.

తిరుమలలో రీల్స్ చేస్తే కేసులు: టీటీడీ

తిరుమల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా రీల్స్, షార్ట్స్ చేసే వ్యక్తులపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ మరోమారు స్పష్టం చేసింది. తిరుమల శ్రీవారి ఆలయం ముందు, మాడవీధుల్లో ఇటీవల కొంత మంది వెకిలి చేష్టలు చేస్తూ, నృత్యాలు చేస్తూ వీడియోలు చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేస్తున్నారని తెలిపింది. తిరుమలలాంటి ఆధ్యాత్మిక క్షేత్రంలో ఇలాంటి అభ్యంతరకర, అసభ్యకర చర్యలు అనుచితమని పేర్కొంది. భక్తుల మనోభావాలు దెబ్బతీసే ఈ తరహా చర్యలు ఆధ్యాత్మిక వాతావరణానికి విఘాతం కలిగిస్తున్నాయని, తిరుమల క్షేత్రం భక్తి, ఆరాధనలకు నిలయమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని తెలిపింది. ఇలాంటి వీడియోలు చిత్రీకరించేవారిని టీటీడీ విజిలెన్స్, సెక్యూరిటీ సిబ్బంది గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటుందని టీటీడీ గురువారం ఓ ప్రకటన ద్వారా హెచ్చరించింది.



శ్రీవారి ఆలయం ముందు నృత్యం చేస్తూ సోషల్ మీడియాలో పెట్టిన ఒక పోస్టు

మానవత్వం చాటుకున్న మంత్రి జనార్దన్ రెడ్డి

డోర్నిపాడు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితుడిని రక్షించి వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. గురువారం నంద్యాల జిల్లా డోర్నిపాడులో జాతీయ రహదారిపై ద్విచక్రవాహనంపై వెళ్తున్న పడకండ్ల గ్రామానికి చెందిన ఓబులేసు అనే యువకుడు ప్రమాదవశాత్తు అదుపు తప్పి కిందపడ్డాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వెంటనే కారు దిగి, తీవ్రంగా గాయపడ్డ ఓబులేసును తన సిబ్బంది సహాయంతో ఓ వాహనంలో ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యులతో మాట్లాడి బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.



రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని వైద్యశాలకు తరలిస్తున్న మంత్రి జనార్దన్ రెడ్డి

హజ్ యాత్ర దరఖాస్తు గడువు పెంపు: మంత్రి ఫరూక్

అమరావతి/విజయవాడ సిటీ, జూలై 31(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్ర కోసం హజ్ కమిటీ ఆఫ్ ఇండియా హజ్-2026కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు గడువును ఈ నెల 7వ తేదీ వరకు పొడిగించినట్లు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. దరఖాస్తు చేసేటపుడు మొదటి ప్రాధాన్యతగా విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్‌ను ఎంచుకోవాలని గురువారం ఒక ప్రకటనలో సూచించారు. విజయవాడ ఎంబార్కేషన్ సెంటర్ నుంచి హజ్ యాత్రకు వెళ్లే ముస్లింలకు కూటమి ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తుందని వివరించారు.

జగన్‌ను వెంటాడుతున్న 'పదకొండు'!

- ఎన్నికల్లో 11 సీట్లు.. మద్యం స్కాంలో దొరికింది రూ.11 కోట్లు: సీపీఐ రామకృష్ణ

అనంతపురం రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్‌ను 'పదకొండు' వెంటాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చమత్కరించారు. వైసీపీకి ఎన్నికల్లో వచ్చింది 11 సీట్లు అని, ఇప్పుడు మద్యం స్కాంలో దొరికింది కూడా రూ.11 కోట్లేనని అన్నారు. అనంతపురం జిల్లా కందుకూరులో జరిగిన సీపీఐ రాప్తాడు నియోజకవర్గ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పెద్దలు చెబుతున్నట్లుగా మద్యం స్కామ్‌కు సంబంధించిన రూ.3,500 కోట్లను పట్టుకొని, ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎన్నో ఆశలతో కూటమికి అధికారం ఇచ్చారని, అయితే గతంలో సీఎంగా అమలు చేసిన విధానాలనే చంద్రబాబు ఇప్పుడూ అమలు చేస్తున్నారని రామకృష్ణ విమర్శించారు. ప్రభుత్వం కళ్లు తెరిపించేలా ఈ నెల 5న రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కార్యాలయాలను బంద్ చేయిస్తామని అన్నారు.

షార్ డైరెక్టర్‌గా పద్మకుమార్



పద్మకుమార్

సూళ్లూరుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ డైరెక్టర్‌గా డాక్టర్ ఈఎస్ పద్మకుమార్ నియమితులయ్యారు. తిరువనంతపురంలోని ఐఐఎస్‌యూ డైరెక్టర్‌గా ఉన్న పద్మకుమార్‌ను షార్ డైరెక్టర్‌గా నియమిస్తూ ఇస్రో ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో ఆయన శుక్రవారం షార్‌కు వచ్చి బాధ్యతలు తీసుకోనున్నారు. ఇప్పటివరకు ఇక్కడ డైరెక్టర్‌గా ఉన్న ఆర్ముగం రాజరాజన్ విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్ (ఈఎస్ఎస్‌సీ)గా బదిలీ అయ్యారు.

తహసీల్దార్ నగ్న వీడియోలు వైరల్!

- లైంగికంగా వేధించారని వీఆర్వో ఫిర్యాదు
- రూ.కోటి ఇవ్వాలని ఇద్దరు విలేకర్లతో కలిసి వీఆర్వో బ్లాక్ మెయిల్ చేశారన్న తహసీల్దార్
- వాకాడు తహసీల్దార్ సస్పెన్షన్.. విచారణకు ఆదేశం

తిరుపతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో మహిళా వీఆర్వోను లైంగికంగా వేధించారంటూ సోషల్ మీడియాలో వీడియోలు వైరల్ కావడంతో వాకాడు తహసీల్దారు రామయ్యను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సస్పెండ్ చేశారు. ఈ వ్యవహారంపై గురువారం ఆయన విచారణకు ఆదేశించారు. ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోజ్‌మాండ్‌ను విచారణాధికారిగా నియమించారు. జూలై 24న జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు గ్రామ వీఆర్వో కళ్యాణి నాయుడుపేటలో నివాసముంటున్నారు. 24న ఆమె ఇంట్లో వాకాడు తహసీల్దారు రామయ్య నగ్నంగా ఉన్న దృశ్యాలు, వీఆర్వో తల్లి అతన్ని కొడుతున్న దృశ్యాలు గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. తనను వాకాడు తహసీల్దారు రామయ్య లైంగికంగా వేధిస్తున్నాడంటూ కళ్యాణి గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టరును కలిసి మౌఖికంగా ఫిర్యాదుచేశారు. అయితే బుధవారం రాత్రే తహసీల్దారు రామయ్య కూడా కలెక్టరును కలిసి తనను ఇద్దరు విలేకర్లతో కలిసి వీఆర్వో బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. గురువారం సాయంత్రం ఆయన జిల్లా ఎస్పీని కలిసి విలేకరులు తనను రూ.కోటి ఇవ్వాలని బ్లాక్ మెయిల్ చేసిన ఆధారాలను కూడా ఫిర్యాదుతోపాటు సమర్పించినట్లు తెలిసింది.

త్వరలోనే బయటకు లిక్కర్ స్కాం తిమింగలాలు

- మద్యం వ్యాపారాన్ని దోపిడీకి చిరునామాగా మార్చారు
- వైసీపీ హయాంలో అడ్డంగా దోచుకున్నారు
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్

పుట్టపర్తి రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ప్రజల సొమ్మును అడ్డంగా దోచుకున్నారని, మద్యం వ్యాపారాన్ని ఆర్థిక దోపిడీకి చిరునామాగా మార్చారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ మండిపడ్డారు. లిక్కర్ స్కాంలో ఉన్న పెద్ద తిమింగలాలు కూడా త్వరలోనే బయటపడతాయని చెప్పారు. చట్టం ఎవ్వరినీ ఉపేక్షించదని, తప్పు చేసినవారికి శిక్ష తప్పదని అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం పుట్టపర్తిలో గురువారం జరిగిన శోభాయాత్ర, పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో కుగ్రామం నుంచి రాష్ట్ర రాజధాని వరకూ మద్యం స్కాం జరిగిందని పేర్కొన్నారు. ఈ దోపిడీపై సీబీఐ, సీబీసీఐడీతో ప్రత్యేక దర్యాప్తు చేయించాల్సిన అవసరం లేదని అన్నారు. దోచుకున్న వైసీపీ నాయకులు అడ్డంగా దొరికిపోయారని చెప్పారు. మద్యం అమ్మకాల్లో డిజిటల్ లావాదేవీలు లేకుండా, నగదు లావాదేవీలు నిర్వహించి నాటి వైసీపీ ప్రభుత్వ నేతలు అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. వారిని చట్టం తప్పకుండా శిక్షిస్తుందని అన్నారు. సత్యసాయి శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తమవంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పుట్టపర్తిలో జరిగిన శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి తదితరులు

నీ అంతు చూస్తా!

డీటీసీపీ విద్యుల్లతపై విశాఖ మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వీరంగం

విశాఖలో తన అపార్ట్‌మెంట్‌కు అనుమతులివ్వనందుకు బెదిరింపులు

- కేసులు పెట్టి కోర్టుకు లాగుతా.. నీకు రూ.50 లక్షలు లంచమిచ్చామని చెబుతా
- మంగళగిరి కార్యాలయంలో.. అనుచరుడితో కలిసి అసభ్య దూషణలు
- మంత్రి, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన విద్యుల్లత
- ఆలస్యంగా వెలుగులోకి

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ) కార్యాలయంలో వైసీపీకి చెందిన విశాఖపట్నం మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ వీరంగం సృష్టించిన ఉదంతం ఆలస్యం వెలుగులోకి వచ్చింది. గత గురువారం (జూలై 24న) మంగళగిరిలోని డీటీసీపీ కార్యాలయంలోకి వచ్చిన మాజీ ఎంపీ, ఆయన అనుచరుడు కుమార్ డీటీసీపీ విద్యుల్లతను మహిళ అనే విచక్షణ కూడా లేకుండా దుర్భాషలాడినట్లు తెలుస్తోంది. విశాఖలో ఆయన నిర్మిస్తున్న భవనానికి సంబంధించిన స్థలం చర్చికి చెందినది కావడం, కోర్టు కేసులు అడ్డంకిగా ఉన్నందున డీటీసీపీ అనుమతులు నిరాకరించారు. దీంతో ఎంవీవీ మంగళగిరి వచ్చి రెచ్చిపోయారు. 'నీ అంతు చూస్తా.. పర్సనల్ కేసులు పెట్టి కోర్టుకు లాగుతా.. నీకు రూ.50 లక్షలు లంచం ఇచ్చామని చెబుతా' అని ఎస్సీ మహిళా అధికారి అయిన విద్యుల్లతపై విరుచుకుపడ్డారు. గట్టిగా అరుపులు, కేకలతో కార్యాలయంలో నానా హంగామా సృష్టించారు. మాజీ ఎంపీ వెంట ఉన్న కుమార్ అనే వ్యక్తి మరింత ముందుకెళ్లి.. అధికారి అని కూడా చూడకుండా పరుష పదజాలంతో రెచ్చిపోయారు. దీంతో డీటీసీపీ తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఈ విషయాన్ని ఆమె అప్పుడే మంత్రి పి.నారాయణ, ముఖ్యకార్యదర్శి సురేశ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. సింగపూర్ పర్యటనకు వెళ్లే హడావుడిలో.. తర్వాత చూద్దామని వారు చెప్పడంతో ఈ అంశం అప్పుడు వెలుగులోకి రాలేదు. ఇప్పుడు బయటపడింది.

ఇదీ అసలు కథ..

విశాఖ సిరిపురం జంక్షన్‌లో ఎంవీవీ 'పీక్స్' అనే అపార్ట్‌మెంట్ నిర్మాణం ప్రారంభించారు. ఆ నిర్మాణ స్థలానికి సంబంధించి గతంలోనే కోర్టు వివాదముంది. ఇటీవల భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ కొత్త మార్గదర్శకాలు రూపొందించింది. వీటి ప్రకారం 12 అంతస్తులకు పైబడిన భవనాలకు డీటీసీపీ నుంచి నిర్మాణ అనుమతి తీసుకోవాలి. ఈ క్రమంలో ఎంవీవీ 'పీక్స్'కు అనుమతి కోసం ఆన్‌లైన్‌లో అభ్యర్థన పంపారు. కోర్టులో వివాదం నడుస్తున్నందున పర్మిషన్ ఇవ్వడం కుదరదని డీటీసీపీ తిరస్కరించారు. దీనిని మాజీ ఎంపీ జీర్ణించుకోలేక ఏకంగా.. మంగళగిరి డీటీసీపీ కార్యాలయానికి వచ్చి పూనకం వచ్చిన వాడిలాగా ఊగిపోయారని ఆ సన్నివేశం చూసిన ఉద్యోగులు పేర్కొంటున్నారు. అరుపులు, కేకలతో అధికారులను, తమను బెంబేలెత్తించారని వాపోయారు. ఆ భవనానికి సంబంధించి మాజీ ఎంపీ గానీ, ఆయనతో వచ్చిన కుమార్ గానీ దరఖాస్తుదారులు కాదని.. అయినా నానా రకాలుగా దుర్భాషలాడడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యానని విద్యుల్లత 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. ఒక ఎస్సీ మహిళా అధికారి పట్ల మాజీ ఎంపీ ఇలా ప్రవర్తించడం తనను కలచివేసిందన్నారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనుమతులకు సంబంధించి రూల్స్ ప్రకారమే చేస్తామని ఎన్నిసార్లు చెప్పినా ఆయన వినిపించుకోలేదని, తనపై అసభ్య పదజాలం వాడారని చెప్పారు. రూ.50 లక్షలు లంచమిచ్చినట్లు చెబుతానని బెదిరించారని, రోడ్డు మీదకు లాగుతానంటూ ఆవేశంతో మాట్లాడారని ఆమె తెలిపారు.

'అన్నదాత సుఖీభవ' జమ రేపే

(మొదటి పేజీ తరువాయి)

మొత్తం రూ.2,342.92 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కేంద్ర వాటాతో కలిపి మొత్తం రూ.7వేలు అందిస్తామన్నారు. 'అన్నదాత సుఖీభవ' అమలు సన్నద్ధతపై రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక, రెవెన్యూ వ్యవసాయ, జలవనరుశాఖల ఉన్నతాధికారులతో సీఎం గురువారం సమీక్ష నిర్వహించారు. జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు పలు సూచనలు, కొన్ని ఆదేశాలు జారీచేశారు. 'రాష్ట్రంలో అర్హులైన ప్రతి రైతుకూ అన్నదాత సుఖీభవ పథకం లబ్ధి అందాలని, రైతులకు చేయూతనివ్వడం భారం కాదు.. బాధ్యత అని గుర్తెరగాలి. రైతులకు నిధులే కాదు.. నీళ్లూ ఇస్తున్నాం. ఈనెల 2న అన్నదాత సుఖీభవ పథకం అమలు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలి. గ్రామ సచివాలయాలు, పంచాయతీలు, మండల, నియోజకవర్గ కేంద్రాల స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించాలి. ఒక్కో రైతు కుటుంబానికి కేంద్రం సాయంతో కలిపి ఏడాదికి రూ.20 వేలు అందిస్తామన్న కూటమి హామీని 'అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్'తో నెరవేర్చినట్లయింది. ఏడాదికి కేంద్రం ఇచ్చే రూ.6 వేల సాయంతో కలిపి, రాష్ట్రప్రభుత్వం మరో రూ.14 వేలు ఇవ్వనుంది. మొదటి, రెండో విడతల్లో రూ.ఐదేసి వేలు చొప్పున, మూడో విడత రూ.4వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. తొలివిడతలో కేంద్రం రూ.2వేలు చొప్పున రూ.831.51కోట్లు విడుదల చేయనుంది. దీంతో ఆగస్టు 2న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఒక్కో రైతుకు రూ.7వేలు జమ చేస్తాయి. మరోవైపు 'అన్నదాత సుఖీభవ'కు సంబంధించి 59,750 గ్రీవెన్సులు నమోదు కాగా... 58,464 దరఖాస్తులను పరిష్కరించాం. ఈ పథకంపై సందేహాల నివృత్తి కోసం 155251 టోల్‌ఫ్రీ నంబరును అందుబాటులో ఉంచాం' అని చంద్రబాబు చెప్పారు.

చేసి చూపిస్తున్నాం..

రైతులకు హామీ ఇచ్చినట్టుగానే 'అన్నదాత సుఖీభవ' పథకం అమలు చేసి చూపిస్తూ, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకున్నామని.. చేసిన మంచిని ప్రజలకు చెప్పాలని కలెక్టర్లకు సీఎం చంద్రబాబు సూచించారు. "అన్నదాత సుఖీభవ అందుకునే రైతుల సెల్‌ఫోన్లకు ఒక రోజు ముందే 'మనమిత్ర' ద్వారా సందేశాలు వెళ్లాలి. రైతులు తమ ఖాతాలను యాక్టివేట్ చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలి" అని తెలిపారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని సీఎం నిర్దేశించారు. ఇప్పటి వరకు రైతులకు ప్రభుత్వం అందించిన సాయం, ఇతర వివరాలతో కరపత్రం రూపొందించి, క్షేత్రస్థాయిలో పంచాలని కలెక్టర్లకు సూచించారు.

కలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి

భారత్‌పై అమెరికా 25శాతం సుంకాలు విధించిన నేపథ్యంలో వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతుల్ని దృష్టిలో పెట్టుకుని ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. 'ఎరువుల విషయంలో కలెక్టర్లు బాధ్యతగా వ్యవహరించాలి. ఎక్కడా కొరత రానీయొద్దు. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. గండికోట, బ్రహ్మంసాగర్, సోమశిల, కండలేరు ప్రాజెక్టులను వంద శాతం నీటితో నింపాలి. బొప్పాయి ధర తగ్గుదలపై సమీక్ష చేసి రైతులకు న్యాయం చేయాలి' అని ఆదేశించారు. సమీక్షలో సీఎస్ విజయానంద్, స్పెషల్ సీఎస్‌లు రాజశేఖర్, జయలక్ష్మి, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్, వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మాలేగావ్ మిథ్య...!

ఆ ఆరుగురినీ ఎవరు చంపారు? సమాధానం దొరకని ప్రశ్న ఇది. మాలేగావ్ పేలుళ్ళ ఘటనకు సంబంధించి నేషనల్ ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీ (ఎన్ఐఏ)కోర్టు గురువారం వెలువరించిన తీర్పు ఊహకు అందనిదేమీ కాదు. బీజేపీ నాయకురాలు, మాజీ ఎంపీ ప్రజ్ఞాఠాకూర్, లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ పురోహిత్ సహా మొత్తం ఏడుగురు నిందితులనూ న్యాయస్థానం నిర్దోషులుగా వదిలేసింది. బెనిఫిట్ ఆఫ్ డౌట్ తప్ప, ఎలాంటి బలమైన ఆధారాలు లేవు అని తేల్చేసింది న్యాయస్థానం. తీర్పు ఇలా ఉన్నప్పుడు, న్యాయస్థానం ప్రకటించిన నష్ట పరిహారం మృతుల కుటుంబాలకు ఉపశమనాన్ని ఇచ్చే అవకాశం లేదు.

రంజాన్ మాసంలో, ప్రార్థనలు జరుగుతున్న ఒక మసీదుముందు పేలుడు సంభవించి ఆరుగురు మరణానికీ, వందకుపైగా గాయపడటానికి కారకులెవ్వరూ లేరనీ, ఎవరూ బాధ్యులు కారనీ చివరకు ఇలా తేలిందన్నమాట. పేలుడుకు వినియోగించిన మోటార్‌బైక్ ప్రజ్ఞాఠాకూర్‌కు చెందినదేనని అనడానికి ఆధారాలు లేవన్నారు న్యాయమూర్తి. ఆ వాహనానికి అమర్చిన బాంబువల్లే పేలుడు సంభవించిందని కూడా నిరూపించలేకపోయారట. కల్నల్ పురోహిత్ కశ్మీర్‌నుంచి మిలటరీ గ్రేడ్ ఆర్డీఎక్స్ తెచ్చి, తానే బాంబు తయారుచేశారనీ చెప్పలేమట. ఈయనకు మరోనిందితుడు డబ్బు సమకూర్చిపెట్టినప్పటికీ, ఈ ఘాతుకం కోసమే ఆ ఆర్థికసాయం జరిగిందని ప్రాసిక్యూషన్ నిరూపించలేకపోయిందట. చివరకు, నిందితులంతా కలసిపన్నిన కుట్ర సిద్ధాంతాన్నే న్యాయస్థానం ఆమోదించనప్పుడు తీర్పు ఇలా ఉండడంలో ఆశ్చర్యమేమీ లేదు.

మొదట్లో ఈ కేసు దర్యాప్తు చేపట్టిన మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ (ఏటీఎస్) తన చార్జిషీటులో అభినవ భారత్ వ్యవస్థాపకులైన ప్రజ్ఞాఠాకూర్, కల్నల్ పురోహిత్ కుట్రను వివరిస్తూ, తీవ్ర ఆరోపణలే చేసింది. ఏటీఎస్‌నుంచి ఈ కేసు చేతిలోకి తీసుకున్న ఎన్ఐఏ ఐదేళ్ళపాటు నిందితులెవ్వరికీ వీసమెత్తు మినహాయింపులు దక్కనివ్వలేదు. కానీ, 2016లో అనుబంధ చార్జిషీటుదాఖలు చేస్తూ, తగిన ఆధారాలు లేనందున ప్రజ్ఞాఠాకూర్ మీద ఆరోపణలు ఉపసంహరించుకోవడమే కాక, నిందితులమీద మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్డ్ క్రైమ్ యాక్ట్ (ఎంసీఓసీఏ) ఎత్తివేయాలని సూచించింది. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అవినాష్ రసాల్‌కు తెలియకుండా పైనుంచి వచ్చిన ఆదేశాలమేరకు ఎన్ఐఏ ఈ పని చేసిందని అప్పట్లో వార్తలు వచ్చాయి. దీనికి ఇంకాముందే, ఈ కేసులో నిందితులపట్ల మెతకగా, సానుభూతితో వ్యవహరించమంటూ తనను ఎన్ఐఏ ఒత్తిడిచేస్తున్నదని ఆరోపిస్తూ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రోహిణీ సాలియన్ పక్కకు తప్పుకున్నారు.

ఈ కేసు వల్లనే పదిహేడేళ్ళపాటు తన జీవితం నాశనమైందనీ, తనను క్షోభ పెట్టినవారందరినీ దేవుడు శిక్షిస్తాడని ప్రజ్ఞాఠాకూర్ ఇప్పుడు శాపాలు పెడుతున్నారు. కానీ, ఈ కేసును ఏటీఎస్ నుంచి ఎన్ఐఏ స్వాధీనం చేసుకున్నాక ఆమెకు చాలా ఉపశమనాలు దక్కాయి. ఆమెను వదిలేయమని ఎన్ఐఏ కోరినప్పటికీ, గతంలో ఏటీఎస్ ఇచ్చిన ఆధారాలమేరకు ఎన్ఐఏ కోర్టు ఇంతవరకూ విచారణలో కొనసాగించడమే ఈ ఆగ్రహానికి కారణం కావచ్చు. ఇందుకు ప్రధాన కారకుడు, మాలేగావ్ కుట్రను శోధించి, ఛేదించిన హేమంత్ కర్కరేను ఆమె గతంలోనే శపించారు. ఆమెమీద ఒకపక్క ఇంకా కేసు ఉండగానే, 2019లోక్‌సభ ఎన్నికల్లో భోపాల్‌నుంచి బీజేపీ ఆమెను నిలబెడితే, తన శాపం వల్లనే ముంబై ఉగ్రదాడిలో పాక్ టెర్రరిస్టుల చేతుల్లో కర్కరే హతమైపోయారని ఎన్నికల ప్రచారసభలో వ్యాఖ్యానించారు ఆమె.

ఏటీఎస్ సేకరించిన సాక్ష్యాలూ, వాంగ్మూలాలు శుద్ధతప్పని అంటూ ఎన్ఐఏ మళ్ళీ అంతా కొత్తగా ఆరంభించినప్పుడే ఈ తీర్పుకు పునాది పడింది. మళ్ళీ రికార్డుచేసినప్పుడు 164మంది వాంగ్మూలాలు గతానికి భిన్నంగా మారిపోయాయి. ఈ తరహా మారణకాండలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తులూ విచారణలూ సుదీర్ఘకాలం సాగి, తీర్పులు చివరకు ఇలా తేలిపోవడం విషాదం. రెండుదశాబ్దాల నాటి ముంబై రైలు పేలుళ్ళకేసులో నిందితులుగా ఉన్న 12మందిని బాంబే హైకోర్టు ఇటీవల నిర్దోషులుగా ప్రకటిస్తే, అదేరోజున మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించి స్టే సాధించింది. మాలేగావ్ కేసులోనూ ఇదేరీతిలో పై కోర్టుకు అప్పీలుకు వెడతారా, లేక నిందితుల మతాలూ మా అభిమతాలూ ఇక్కడ పూర్తిగా వేరు అంటారా?.. అంతా తెలిసికూడా కొందరు మేధావులు అమాయకంగా వేస్తున్న ప్రశ్న ఇది.

కులం.. బలం.. ఇంధనమై కాంగ్రెస్ పయనం!

కాంగ్రెస్ పార్టీ భవిత గురించి ఇప్పటికే చాలా విశ్లేషణలు వచ్చాయి. ఆశల కంటే వాటిల్లో నిరాశలే ఎక్కువ! 1989 నుంచి 2014 వరకూ దేశ రాజకీయాలను నిశితంగా పరిశీలించిన వారిలో ఎక్కువమంది ఒక పార్టీ స్వంత ఆధిక్యతతో కేంద్రంలో సమీప భవిష్యత్తులో అధికారంలోకి వచ్చే అవకాశం లేదని భావించారు. దేశంలో సంకీర్ణ రాజకీయాల యుగం మొదలైందనీ, నిజమైన సమాఖ్య స్థాపనకూ, రాష్ట్రాలతో సంప్రదింపులతో కూడిన విధానాలకు అది దోహదం చేస్తుందనీ ఊహించారు. 2014 వచ్చేసరికి పరిస్థితి మారిపోయింది. పదేళ్లపాటు బీజేపీకి సంపూర్ణ ఆధిక్యత లభించింది. కిందటి ఎన్నికల్లో ఆ ఆధిక్యతకు మళ్లీ గండిపడింది. అయినా ఎన్డీయే కూటమిగా బీజేపీ అధికారాన్ని దక్కించుకుంది. ప్రస్తుతానికి కూటమిలో లుకలుకలు లేవు. బీజేపీదే సర్వాధికారం అన్నట్లుగా పాలన సాగుతోంది. హిందీ భాషపై రేగిన వివాదంలో కానీ, జమిలి ఎన్నికల విషయంలో కానీ ఎన్డీయే భాగస్వామ్య పక్షాలు బీజేపీని పూర్తిగా సమర్థిస్తూ మాట్లాడుతున్నాయి.

2024 లోక్‌సభ ఎన్నికల్లో గెలుపుకోసం కాంగ్రెస్ చాలా గట్టిగా ప్రయత్నించింది. ముఖ్యంగా కులగణనను చేపట్టి విద్య, ఉద్యోగాలు, పదవుల్లో కులాల జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచుతామని వాగ్దానం (జిత్నీ ఆబాదీ ఉత్నా హక్) చేసింది. ప్రధాని మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాల్లో బీజేపీని గెలిపిస్తే రాజ్యాంగాన్ని సవరించి మొత్తం రిజర్వేషన్లనే రద్దుచేస్తారని ఉధృతంగా ప్రచారమూ చేసింది. అయినా కాంగ్రెస్ 100 మార్క్‌ను దాటలేదు. కులగణన, రిజర్వేషన్ల పెంపు అస్త్రాన్ని కాంగ్రెస్ గరిష్ఠ స్థాయిలో ఉపయోగించింది. నిజానికి భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ కులగణనకు కొంత ఊపును తీసుకొచ్చారు. వెనుకబడిన కులాలను (బీసీలు) రాజకీయంగా ఆకర్షించటానికి కాంగ్రెస్ పార్టీకి ఒక బ్రహ్మాస్త్రం లభించిన భావన సైతం అప్పుడు నెలకొంది. ఎంతో కీలకమైన లోక్‌సభ ఎన్నికల్లోనూ, అంతకు కొద్దిగా ముందూ వెనుకా జరిగిన మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ అస్త్రం ఆశించిన ఫలితాలను సాధించి పెట్టలేదు. కర్ణాటక, తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలుపులో కులగణన అంశం ప్రభావం దాదాపుగా లేదనే చెప్పొచ్చు.

సామాజిక, ఆర్థిక మార్పులు వేగంగా వస్తున్న నేపథ్యంలో కులగణన–రిజర్వేషన్ల నినాదంపై ఆధారపడి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ విజయం సాధించగలదా? అన్నదే ఆ పార్టీ ముందున్న కీలక సవాల్‌గా మారింది. కులాల లెక్కలు తీయటం కష్టం కాదు. ప్రతి కులంలోనూ ఒక కుటుంబం సామాజిక ఆర్థిక పరిస్థితిని మదింపువేసి, ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవటమే కష్టం. బీసీల్లోనే కాదు.. ఎస్సీ, ఎస్టీల్లో కూడా ఆర్థిక అంతరాలను పరిగణనలోకి తీసుకుని రిజర్వేషన్ల విధానాల్లో మార్పులు తీసుకు రావటం సవాళ్లతో కూడుకున్న పని. వివిధ కులాల్లో సంపన్న శ్రేణులను గుర్తించాలని అనేక సందర్భాల్లో కోర్టులు చెబుతున్న విషయాన్ని విస్మరించలేని పరిస్థితులే ఉన్నాయి. కులాల్లోని పేద, మధ్య, ధనిక వర్గాలను పరిగణనలోకి తీసుకుని కొత్త విధానాలు రూపొందించకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీల్లో కూడా నాలుగైదు కులాల ఆధిపత్యమే కొనసాగే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే ఆ తరహా ఆధిపత్య ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయి.

కులగణన సర్వే తీరు గురించి ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎంత గొప్పగా చెప్పుకొన్నా దానికి పరిమితులు చాలానే ఉన్నాయి. బీహార్ అయినా, తెలంగాణ అయినా దీనికి మినహాయింపు కాదు. కులం, మతం గురించి ఉన్నది ఉన్నట్లుగా చెప్పేవారు ఆర్థిక పరిస్థితి వచ్చేటప్పటికి అర్ధసత్యాలే చెబుతారు. ఆస్తులు వెల్లడించటం స్వచ్ఛందం కాబట్టి రికార్డుల్లోకి ఎక్కినవి.. ముఖ్యంగా పట్టణ, నగర ప్రాంతాల్లో తక్కువగానే ఉంటాయి.



బీసీ రిజర్వేషన్ల అంశం ఉత్తరప్రదేశ్, బిహార్‌లో మాత్రమే రాజకీయాలను గణనీయంగా మార్చగలిగింది. మిగతా చోట్ల అంత ప్రభావం చూపలేదు. 2010 నాటికి ఆ రెండు రాష్ట్రాల్లోనూ పరిస్థితి మారిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఆ రిజర్వేషన్ల ఆధారంగా రాజకీయాలు నడపటం కత్తిమీద సామే! ఇందులో తేడావస్తే ఒక అస్త్రం నిర్వీర్యమైపోతుంది. కాంగ్రెస్‌లో సైద్ధాంతిక శూన్యత ఏర్పడుతుంది! నెహ్రూ మార్గం నుంచి వైదొలగి రామమనోహర్ లోహియా దారిలో నడుస్తున్న కాంగ్రెస్‌కు అప్పుడు మరో అన్వేషణ తప్పదు!

ఇళ్లస్థలాలు, వాహనాలు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్, బంగారం లాంటివి ఆ కోవలోకే వస్తాయి. ఆస్తులు, సంపదలపై అసలు సమాచారం లేకుండా కులగణన వల్ల ఆశించిన ప్రయోజనం కలగదు. సర్వేల పరిమితులు రాజకీయ నాయకత్వాలకు స్పష్టంగా తెలుసు. రాజకీయాలు మాట్లాడనీయవు అంతే!

ఈ పరిమితులు ఎన్ని ఉన్నప్పటికీ తెలంగాణలో చేపట్టిన కులగణననూ, దాని ఆధారంగా పెంచిన రిజర్వేషన్లను ఒక నమూనాగా దేశం ముందుపెట్టి, వచ్చే సాధారణ ఎన్నికల్లో కొట్లాడాలని కాంగ్రెస్ పార్టీ గట్టి నిర్ణయం తీసుకుంది. తెలంగాణ సర్వే ఆదర్శ నమూనాగా నిలవాలంటే అందులో నమోదైన కీలక విషయాలు వెల్లడి కావాలి. ఇప్పటిదాకా ప్రభుత్వం వెల్లడించిన విషయాలు సాధారణమైనవి. పెద్దగా వివాదాస్పదం కానివి. కానీ వాటిల్లో కూడా ఒక విషయం వివాదాస్పదం అయింది. ముస్లింల్లోని 10.8 శాతం మందిని బీసీల జాబితాలో చూపించటమే దీనికి కారణం. బీసీ ఈ–కేటగిరిలో ఉన్న ముస్లిం కులాలను సర్వే సందర్భంగా ఆ కేటగిరీలోనే నమోదుచేసి లెక్కించారు. హిందూ బీసీల్లోని 46.25 శాతానికి దాన్ని కలిపి లెక్కించి మొత్తంగా బీసీల సంఖ్యను 56.30 శాతంగా తేల్చారు. బిహార్‌లోనూ అలాగే చేశారు. మండల్ కమిషన్ కూడా ముస్లింల్లోని వెనుకబడిన సమూహాలను బీసీలుగానే పరిగణించింది. ముస్లింల జనాభా 16.16 శాతం ఉంటే అందులో 8.40 శాతం మందిని బీసీలుగా లెక్క వేసింది. హిందూ బీసీలను 43.70 శాతంగా అంచనా కట్టింది. రెండు వర్గాల్లో కలిపి మొత్తంగా బీసీలు 52 శాతం ఉంటారని పేర్కొంటూ 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసింది. మండల్ కమిషన్ సిఫార్సులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో సైతం ముస్లింలను బీసీల్లో కలపటాన్ని తప్పుపట్టలేదు. దేశంలో ఎక్కడా లేనట్లుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే కొత్తగా ముస్లింలను బీసీలుగా లెక్కించిందనే విమర్శ వాస్తవాల ముందు నిలబడదు. ముస్లింలకు సంబంధించి మరో వింత వాదన కూడా విపరీత ప్రచారాన్ని పొందుతోంది. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు కల్పించిన (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్లలో ముస్లింలు లబ్ధిపొందుతున్నారు కాబట్టి.. మళ్లీ రాష్ట్ర బీసీ జాబితాలో వాళ్లను ఎందుకు చేర్చారన్న వాదన అలాంటిదే. ఈడబ్ల్యూఎస్ ద్వారా లబ్ధి పొందేవారు ఇప్పటికే అమల్లో ఉన్న రిజర్వేషన్ల పరిధిలో లేని వారై ఉండాలన్న నిబంధన స్పష్టంగా ఉంది. అందువల్ల రెండు కేటగిరీల్లో ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారన్న ప్రశ్నే ఉత్పన్నం కాదు.

సమగ్ర కులగణనలో లభ్యమైన వ్యక్తిగత సమాచారం ఇవ్వాలని ఎవరూ అడగటం లేదు. వ్యక్తుల సమాచార గోప్యతకు భంగం కలిగించే విషయాలను వెల్లడించాలనీ ఆశించటం లేదు. మరోవైపు సర్వే ఫలితాలను విశ్లేషించటానికి నియమించిన జస్టిస్ సుదర్శనరెడ్డి నేతృత్వంలోని నిపుణుల కమిటీ సిఫార్సులు కూడా వచ్చేశాయి. వివిధ కులాల వెనుకబాటుతనాన్ని 42 అంశాల ఆధారంగా నిర్ధారించి నిర్దిష్ట నివారణా చర్యలనూ కమిషన్ సూచించి ఉండొచ్చు. ప్రభుత్వ విధానాలను అవి ప్రభావితమూ చేయొచ్చు. కానీ కులగణనలో తేలిన అసలు సమాచార వెల్లడికీ నిపుణుల కమిటీ సిఫార్సులకూ సంబంధం లేదు. సమాచారాన్ని వెల్లడించకపోవటం వల్ల ప్రభుత్వం ఏదో దాస్తోందన్న అభిప్రాయమే తప్ప లాభం ఏమీ ఉండదు. మండల్ కమిషన్ బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేయటానికి ప్రాతిపదికగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో వారెంత శాతం ఉన్నారో స్పష్టంగా పేర్కొంది. మొత్తం ఉద్యోగుల్లో 12.55% మంది బీసీలు మాత్రమే ఉన్నారని తేల్చింది. హోదాల వారీగా లెక్కలనూ ఇచ్చింది. అప్పటికే సుప్రీంకోర్టు నిర్దేశించిన 50% (రిజర్వేషన్ల) పరిమితిని దృష్టిలో ఉంచుకుని 27 శాతం రిజర్వేషన్లను సిఫార్సు చేసింది.

బీసీలకు ఉద్యోగ, విద్య, రాజకీయ రిజర్వేషన్లను 42% పెంచటానికి ఉద్దేశించిన రెండు బిల్లులను తెలంగాణ శాసన సభ ఆమోదించింది. వాటిని రాజ్యాంగం 9వ షెడ్యూలులో చేర్చడానికి రాష్ట్రపతికీ పంపారు. కానీ ఇప్పటికీ ఉద్యోగుల్లో బీసీలు ఎంతమంది ఉన్నారో తెలిపే సమాచారం లేదు. ఇంజనీరింగు, వైద్య కాలేజీల్లో వాళ్లకు ప్రాతినిధ్యం ఎంతో వెల్లడి కావటం లేదు. నిజానికి వీటిని వెల్లడించినప్పటికీ కులగణనకు సంపూర్ణ సార్థకత రాదు. ప్రతికులానికి చెందిన వారు ఉద్యోగ, విద్య, రాజకీయ పదవుల్లో ఎంతమంది ఉన్నారో వెల్లడించగలగాలి. 134 బీసీ కులాల జనాభా కూడా విడివిడిగా ఎంతమంది ఉన్నారో తెలపగలగాలి. రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారమే బీసీ రిజర్వేషన్లను 42 శాతంగా నిర్ధారించారు. కానీ ఆ వర్గాల జనాభా 56% ఉన్నారని లెక్కలు చెబుతున్నప్పుడు రిజర్వేషన్లు 42 శాతానికే ఎందుకు ఆగాయన్న ప్రశ్నా తలెత్తుతుంది. బీసీ కమిషన్ కూడా 42% సరిపోతుందనీ చెబితే అందుకు శాస్త్రీయ ప్రాతిపదికా వెల్లడి కావాలి. 'జిత్నీ ఆబాదీ ఉత్నా హక్' విధానమైనప్పుడు 42 శాతానికి తర్కమేమిటో తెలపాల్సి వస్తుంది.



■ రాహుల్ కుమార్

తెలంగాణ నమూనాతో దేశ ప్రజలను ఆకర్షించాలంటే దానిపై చర్చను వచ్చే ఎన్నికల వరకూ కాంగ్రెస్ రాజకీయంగా సజీవంగా ఉంచగలగాలి. బహుశా అందుకనే 42 శాతం రిజర్వేషన్లు కల్పించే చట్టాలను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో ప్రవేశపెట్టే విధంగా బీజేపీ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటానికి ఢిల్లీ కేంద్రంగా కార్యాచరణకు పదును పెడుతోంది. జంతర్ మంతర్ వద్ద ధర్నా, రాష్ట్రపతితో భేటీ అందులో భాగాలే. ఇక కులగణన, రిజర్వేషన్ల పెంపు ఆధారంగా కాంగ్రెస్‌కు ప్రజాబిమానం పెరిగే ఏ అవకాశాన్నీ బీజేపీ తేలికగా తీసుకోవటం లేదు. కులాలవారీ జనాభాగణనకు ఆదేశాలు జారీచేయటమే దానికి నిదర్శనం. కిందటి లోక్‌సభ ఎన్నికల ప్రణాళికలో కులగణన గురించి బీజేపీ ఒక్క మాటను కూడా ప్రస్తావించలేదు. కనీసం కాంగ్రెస్‌పై, ఆ విషయమై విమర్శ కూడా లేకుండా అందులో జాగ్రత్తలు తీసుకుంది.

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారమే బీసీ రిజర్వేషన్లను 42 శాతంగా నిర్ధారించారు. కానీ ఆ వర్గాల జనాభా 56% ఉన్నారని లెక్కలు చెబుతున్నప్పుడు రిజర్వేషన్లు 42 శాతానికే ఎందుకు ఆగాయన్న ప్రశ్నా తలెత్తుతుంది. బీసీ కమిషన్ కూడా 42% సరిపోతుందని చెబితే అందుకు శాస్త్రీయ ప్రాతిపదికా వెల్లడి కావాలి. 'జిత్నీ ఆబాదీ ఉత్నా హక్' విధానమైనప్పుడు 42 శాతానికి తర్కమేమిటో తెలపాల్సి వస్తుంది.

అసెంబ్లీలు ఎన్ని చట్టాలు చేసినా సుప్రీంకోర్టు కుల ఆధారిత రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేస్తే తప్ప అడుగులు ముందుకు పడవు. మండల్ సిఫార్సుల సందర్భంగా ఇచ్చిన తీర్పును తోసిపుచ్చే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. కానీ అంతవరకే చేయగలదు. న్యాయసమీక్ష పేరిట సుప్రీంకోర్టు దాన్ని కొట్టేస్తే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుంది. ఈడబ్ల్యూఎస్ తీర్పు సందర్భంగా 50% రిజర్వేషన్ల పరిమితిని సుప్రీంకోర్టు తొలగించిందని రాజకీయంగా వాదించొచ్చు. కుల ఆధారిత రిజర్వేషన్లకు 50% పరిమితి యథాతథంగా కొనసాగుతుందని ఈడబ్ల్యూఎస్ తీర్పులో స్పష్టంగా ఉంది. బీసీ రిజర్వేషన్ల అంశం ఉత్తరప్రదేశ్, బిహార్‌లో మాత్రమే రాజకీయాలను గణనీయంగా మార్చగలిగింది. మిగతా చోట్ల అంత ప్రభావం చూపలేదు. 2010 నాటికి ఆ రెండు రాష్ట్రాల్లోనూ పరిస్థితి మారిపోయింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌కు ఆ రిజర్వేషన్ల ఆధారంగా రాజకీయాలు నడపటం కత్తిమీద సామే! ఇందులో తేడావస్తే ఒక అస్త్రం నిర్వీర్యమైపోతుంది. కాంగ్రెస్‌లో సైద్ధాంతిక శూన్యత ఏర్పడుతుంది! నెహ్రూ మార్గం నుంచి వైదొలగి రాంమనోహర్ లోహియా దారిలో నడుస్తున్న కాంగ్రెస్‌కు అప్పుడు మరో అన్వేషణ తప్పదు!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

దళిత సాహిత్య వైతాళికుడు

ఆధిపత్య వర్గాల ధోరణి బహుజనులను విద్యకు దూరం చేయడంతో దేశ స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తరువాత ఎంతో మంది అక్షర జ్ఞానానికి దూరమయ్యారు. అయినా, జ్యోతిబా ఫూలే, బి.ఆర్. అంబేడ్కర్ వంటి ఎందరో మహనీయులు విద్యావంతులుగా మారి సమాజానికి వెలుగులు పంచారు. వీరిలో అన్నాభావు సాఠె ఒకరు. అందరిలా బడికి వెళ్లి చదువుకునే అవకాశం లేకపోయినా, జీవితమనే పాఠశాలలో విద్యార్థిగా చేరి 'విద్యా జ్ఞానం అన్ని సమస్యలకు దివ్య ఔషధం' అనే ముక్తా సాల్వే మాటలను ప్రేరణగా తీసుకుని, అక్షర జ్ఞానియై సాహిత్య సమ్రాట్‌గా ప్రసిద్ధిచెందారు. దేశ విదేశీయులతో 'అన్నా' అని పిలుపునందుకున్న మొదటి భారతీయుడు అన్నాభావు సాఠె.

ఆయన అసలు పేరు 'తుకారాం భావురావ్ సాఠె'. మహారాష్ట్ర వాటేగావ్ గ్రామంలో ఉన్న మాంగ్ వాడాలో 1920 ఆగస్టు 1న జన్మించారు. అన్నా చిన్నప్పుడు అభంగ్స్ (భక్తి పాటలు)ను లయబద్ధంగా పాడేవారు. వంశపారంపర్యంగా బంధువులు నిర్వహించే 'తమాషా' ప్రదర్శనలలో చురుకుగా పాల్గొని, జానపద వాయిద్యాలు వాయించడం, పాటలు పాడటం నేర్చుకున్నారు. కత్తి, ఈటె, బాకు, దాండ్ పట్టా, కర్రసాము యుద్ధ కళను తమాషాలకు జోడించి, బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో విశేషకృషి చేశారు.



పదేళ్ళ వయస్సులో స్వాతంత్ర్యోద్యమంలో కూడా పాల్గొన్నాడు.

బతుకుతెరువు కోసం కుటుంబం బొంబాయికి వలస వచ్చినపుడు ఒక సినిమా థియేటర్‌లో డోర్ కీపర్‌గా పని చేయడం అన్నా జీవితాన్ని మార్చేసింది. సినిమాల ప్రభావంతో దుకాణాలు, హోటళ్లు, సినిమా పోస్టర్లపై ఉన్న అక్షరాలను చదవడానికి యత్నిస్తూ చదవడం, రాయడం నేర్చుకున్నారు. మొదట్లో విలేకరిగా పనిచేస్తూ స్వీయ అనుభవాలు, నిజ ఘటనల ఆధారంగా కథలు రాసేవారు. సాంస్కృతిక చైతన్యం ద్వారా స్వాతంత్ర్యోద్యమంలో సామాన్య ప్రజలను భాగస్వాములను చేసేందుకు 1943లో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ ఏర్పాటులో ముఖ్యపాత్ర వహించిన అన్నా, తన ఇద్దరు సహచరులతో 1944లో 'రెడ్ ఫ్లాగ్ కల్చరల్ స్క్వాడ్' అనే కొత్త తమాషా బృందాన్ని ఏర్పాటు చేసి, హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. తన పాటలు, మాటలతో ప్రజలను ఉర్రూతలూగించడంతో, ప్రజలు ఆయనను 'లోక్ షాహిర్' అని పిలిచేవారు. కొంతకాలం తర్వాత ప్రభుత్వం తమాషాలను నిషేధించింది. లాల్ బావతా కళాపథక్ కోసం రాసిన నాటకాలను 'లావని' (మహారాష్ట్రలో ప్రసిద్ధిగాంచిన సంగీత నృత్య ప్రదర్శన), 'పోవాడా' (జానపద పాటలు) రూపంలోకి మార్చారు.

రష్యా విప్లవం విజయగాథను వివరిస్తూ 'స్టాలిన్ గ్రాడ్' నాటకాన్ని రాయగా, అది రష్యన్ భాషలోకి అనువాదమైంది. అన్నా 1961లో రష్యాను సందర్శించారు. ఆ ప్రయాణ అనుభవాలను 'మాజా రష్యా చా ప్రవాస్' రూపంలో గ్రంథస్తం చేసిన మొదటి వ్యక్తిగా ఆశ్రితవర్గాల నుంచి చరిత్రకెక్కారు. తన జీవితకాలంలో నవలలు, చిన్న కథల సంకలనాలు, నాటకాలు వంటి 100కు పైగా రచనలు చేశారు. ఇవి రష్యన్, ఫ్రెంచ్, జర్మన్, చెక్, ఇంగ్లీష్, స్పానిష్ మొదలైన 27 అంతర్జాతీయ భాషల్లోకి అనువాదమై, ఆయన కీర్తిప్రతిష్ఠలు విదేశాలలో కూడా ప్రజ్వరిల్లాయి.

బాబాసాహెబ్ భావజాలం వైపు మొగ్గు చూపి, బడుగు బలహీన కార్మిక వర్గాలను చైతన్యపరిచే రచనలు చేశారు. 'ఫకీరా' నవలను బాబాసాహెబ్‌కు అంకితం చేశారు అన్నా. రష్యాలో సినిమా నటుడు రాజ్‌కపూర్‌తో పాటు విపరీతమైన అభిమానులు కలిగిన మరొక భారతీయుడు అన్నా భావు సాఠె అని తెలుసుకొని అప్పటి భారత ప్రధాని నెహ్రూ ఆశ్చర్యానికి గురయ్యారు. 1958లో బొంబాయిలో తన అధ్యక్షతన నిర్వహించిన 'మొదటి దళిత సాహిత్య సమ్మేళనం' ప్రారంభ ప్రసంగంలో "ఈ భూమి శేష్‌నాగ్ అని పిలిచే పాము తలపై కాకుండా దళిత, బహుజన వర్గాల శ్రమ శక్తి మీద సమతుల్యతతో నిలిచివుంది" అని ప్రకటించారు. అన్నాభావు రచించిన అనేక నవలలు, కథల ఆధారంగా అనేక చలన చిత్రాలు నిర్మించారు, ఇంకా నిర్మిస్తూనే ఉన్నారు.

రష్యాలో అన్నా పేరుమీద స్కాలర్‌షిప్ ఇవ్వడం మామూలు విషయం కాదు. కవి, రచయిత, విలేకరి, కార్మికుడు, నటుడు, దర్శకుడు, స్క్రీన్‌ప్లే రచయిత ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన అన్నా సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఆయన జ్ఞాపకార్థం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. మహారాష్ట్ర ప్రభుత్వం వివిధ కట్టడాలకు, సంస్థలకు ఆయన పేరు పెట్టి గౌరవించింది. ఇటీవల మహాత్మా గాంధీ మెమోరియల్ విశ్వవిద్యాలయం మరణానంతరం అన్నా భావు సాఠెకు 'డాక్టరేట్'ను ప్రదానం చేసింది. రష్యా రాజధాని 'మాస్కో'లో అన్నా విగ్రహాన్ని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

పాఠశాలలో విద్యాభ్యాసం చేయకుండానే తన రచనల ద్వారా గ్రామీణ వ్యవస్థ, బడుగు బలహీన, మహిళా, కార్మిక వర్గాల స్థితిని కళ్ళకు కట్టినట్టు బహిర్గతం చేసి ప్రపంచ దృష్టిని ఆకర్షించారు. దళిత సాహిత్య పితామహుడిగా, సాహిత్య సమ్రాట్‌గా ప్రసిద్ధి చెందిన అన్నాకు 'భారతరత్న' ఇవ్వాలని ఆయన అభిమానులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే అధికారికంగా ఆయన జయంతిని జరపాలని కోరుతున్నారు.

● **గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్**
మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు

'చరిత్ర'తో నరేంద్ర మోదీ పోటీ!



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

భారత్ భావనపై ప్రభావశీల నెహ్రూవియన్ ఏకస్వామ్యాన్ని బద్దలు గొట్టేందుకు నెహ్రూ కీర్తికాయాన్ని కూల్చివేయాల్సిన అవసరం మోదీకి ఉన్నది. అందుకు ఏకైక మార్గం విదేశాంగ విధానం నుంచి దేశీయ వ్యవహారాల దాకా నెహ్రూ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించడమే. వ్యక్తిగా, పాలకుడుగా నెహ్రూ లోపాలను ఎత్తి చూపడం ద్వారా చరిత్రలో ఆయన సమున్నత స్థానాన్ని తక్కువ స్థాయికి కుదించివేయడమే ప్రధాని మోదీ ప్రధానలక్ష్యంగా ఉన్నది.

నరేంద్ర మోదీ సదా ఒక పరిపూర్ణ ప్రదర్శనకారుడు. ఆయనకు ఒక వేదిక, ఒక మైక్ ఇవ్వండి. ఆయన ఉపన్యాసానికి సభికులు మంత్రముగ్ధులైపోతారు. మోదీ మాటలకు తరచు కరతాళ ధ్వనులు మిన్నంటుతాయి. ఆయన సభలలో సాధారణంగా కనిపించే దృశ్యమిది. ఈ వారం లోక్‌సభలో ప్రధాని మోదీ 102 నిమిషాల పాటు ప్రసంగించారు. కాంగ్రెస్‌పై కఠోర విమర్శలు గుప్పించారు. తన పాలనా ఘనతను చాటుకోవడం, కాంగ్రెస్‌పై దాడిచేయడం ఆయన ఎంతగానో ఇష్టపడే, ఆనందించే విషయాలు. లోక్‌సభలో ఆయన ప్రసంగం కొంచెం ఎక్కువగానే సాగింది. అయితే పార్లమెంటులో మోదీ ప్రసంగించడం చాలా చాలా అరుదు గనుక ఆయన సుదీర్ఘ ప్రసంగం పట్ల ఎవరూ అసంతృప్తి చెందలేదు. ఆపరేషన్ సిందూర్ సందర్భంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరును తీవ్రంగా ఆక్షేపించిన వారిపై మోదీ నిర్దయగా తీవ్ర విమర్శలు చేశారు. విశేషమేమిటంటే ఆయన ప్రసంగంలో, సమస్త భారతీయులకు సుపరిచితమైన ఒక పేరు పదే పదే ప్రస్తావితమయింది. తన కంటే ముందు ప్రధానమంత్రిగా ఉన్న వారిలో ఒకరైన జవహర్ లాల్ నెహ్రూ గురించి మొత్తం 14 సార్లు పేర్కొన్నారు. ప్రతిసారీ దేశ పాలకుడుగా నెహ్రూ 'అపరాధాల'ను మోదీ ప్రస్తావించారు. మోదీ మనసులో నెహ్రూ పట్ల వ్యతిరేకత అంతగా ఎందుకు గూడుకట్టుకుపోయింది? ఆయన ఆలోచనలు నిరంతరం నెహ్రూ పట్ల ఒక తిరస్కారభావంతో ఎందుకు నిమగ్నమవుతున్నాయి? ఇందుకు కారణాలేమిటో చూద్దాం.

నెహ్రూ 1964లో కీర్తిశేషుడు అయ్యారు. మోదీ నవ యవ్వనంలో ఉన్న కాలమది. నెహ్రూ తరవాత, మోదీతో సహా 13 మంది భారత ప్రధానమంత్రి పదవిని అధిష్టించారు. ఇందిరాగాంధీ హయాంలో మోదీ రాజకీయాలలోకి వచ్చారు. 1975లో విద్యార్థి క్రియాశీలిగా ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాటంలో పాల్గొనడం ద్వారా మోదీ రాజకీయ జీవితం ప్రారంభమయింది. ఏ ఒక్క ప్రధానమంత్రి వల్లనైనా మోదీ నష్టపోవడం జరిగి ఉంటే ఆ ప్రధాని ఇందిరే కావచ్చు. ఎందుకంటే మోదీతో సహా వందలాది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కార్యకర్తలను ఆమె అరెస్ట్ చేయించారు. అయినా ప్రధాని మోదీ హేళనకు గురయ్యే గత ప్రధానమంత్రులలో ఇందిర చాలా అరుదుగా ప్రస్తావితమవుతారు. ఆయన ఎప్పుడూ అపహసించేది జవహర్ లాల్ నెహ్రూనే.

తొలుత ఒక విషయాన్ని నొక్కి వక్కాణించవలసి ఉన్నది. నెహ్రూ నిస్సందేహంగా నికార్సయిన లౌకికవాది. దేశ ప్రధానమంత్రిగా జాతి జీవనంలో లౌకిక విలువలు వర్ధిల్లేందుకు ఆయన అంకిత భావంతో కృషి చేశారు. భారత్ ఎట్టి పరిస్థితులలోను ఒక 'హిందూ రాష్ట్ర' లేదా ఒక 'హిందూ పాకిస్థాన్'గా పరిణమించకూడదని నెహ్రూ మనఃపూర్వకంగా విశ్వసించారు, ఆకాంక్షించారు. ఈ కారణంగానే ఆయన తరచు హిందుత్వ శక్తులతో ఘర్షించేవారు. భారతీయ సమాజంలో వారి ప్రభావాన్ని తగ్గించేందుకు, సామాజికంగా బహిష్కరించేందుకు ఆయన ఎన్నో విధాలుగా కృషి చేశారు. మహాత్మా గాంధీని హిందూ మత దురభిమాని ఒకడు హత మార్చడం నెహ్రూను కలచివేసింది. హిందూ మతతత్వ శక్తులను సవాల్ చేయాలని నెహ్రూ దృఢంగా సంకల్పించుకున్నారు. బహుళ మత సమాజంగా భారత్ వర్ధిల్లాలని ఆయన ప్రగాఢంగా ఆశించారు. హిందూ మతతత్వం తన రాజకీయ దృక్పథానికి పూర్తిగా విరుద్ధం గనుక ఆయన తుదకంటా దానిపై రాజీలేని పోరాటం చేశారు. మరి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌కు నెహ్రూ ప్రధాన 'శత్రువు' కావడంలో ఆశ్చర్యమేమీ లేదు సంఘీయులు ఆయన్ని సైద్ధాంతికంగాను, రాజకీయంగానూ తీవ్రంగా వ్యతిరేకించారు, విద్వేషించారు.



ఆరెస్సెస్ సైద్ధాంతిక శిక్షణతో జీవితంలోకి ప్రవేశించిన వ్యక్తి నరేంద్ర మోదీ. సంఘ్‌ను, ఇతర హిందుత్వ సంస్థల ప్రభావాన్ని కట్టడి చేసేందుకు ప్రయత్నించిన నెహ్రూను ఆయన సదా ఒక దుష్ట స్వభావుడుగానే చూశారు. మోదీ రాజకీయ విశ్వాసాలను మౌలికంగా ప్రభావితం చేసిన వ్యక్తి, సంఘ్‌కు సుదీర్ఘకాలం సర్ సంఘ్ చాలక్‌గా ఉన్న గురూజీగా సుప్రసిద్ధుడు అయిన ఎమ్ఎస్ గోల్వాల్కర్. 1940 నుంచి 1973 దాకా సంఘ్ అధినేతగా ఉన్న గోల్వాల్కర్, నెహ్రూను తన ప్రధాన ప్రత్యర్థిగా పరిగణించారు. ప్రథమ ప్రధానమంత్రి పట్ల గోల్వాల్కర్‌కు అటువంటి అభిప్రాయం ఉన్నప్పుడు ఆయన ప్రచండ శిష్యుడైన మోదీ, నెహ్రూను వ్యతిరేకించడంలో ఎందుకు వెనుకబడి ఉంటారు?


నెహ్రూ పట్ల మోదీ తీవ్ర వ్యతిరేకతకు రెండో కారణం కాంగ్రెస్ పార్టీ తీరుతెన్నులే. నెహ్రూ మరణానంతరం కాంగ్రెస్ పార్టీ ఆయన్ని ఒక దైవాంశ సంభూతుడుగా ఆరాధించింది. స్వతంత్ర భారతదేశానికి నెహ్రూ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన నాయకుడు అన్న వాస్తవాన్ని అలక్ష్యం చేసింది. ప్రధానమంత్రిగా 17 ఏళ్ల పాలనలో నెహ్రూ సాఫల్య వైఫల్యాలపై నిష్పాక్షిక చర్చను ప్రోత్సహించలేదు. నెహ్రూ సామ్యవాద విధానాలపై విమర్శలను సహించలేదు. ఆయన అనుసరించిన కశ్మీర్, చైనా విధానాలు సరైనవేనని సమర్థించింది. భారతీయ జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత నెహ్రూ విధానాల ప్రభావాన్ని, చారిత్రక వారసత్వాన్ని రూపుమాపేందుకు అనేక విధాలుగా ప్రయత్నిస్తూ వస్తోంది.

ఇది మూడో వివాదాస్పద విషయాన్ని ప్రస్తావించడాన్ని అనివార్యం చేస్తుంది. దేశ రాజకీయాలలో నెహ్రూ – గాంధీ కుటుంబ ఆధిపత్యమే ఆ అంశం. నెహ్రూ అనంతర కాంగ్రెస్ పార్టీ ప్రస్థానం వంశ పారంపర్య రాజకీయాల ప్రాబల్యంతో ప్రధానంగా ప్రభావితమయింది. కాంగ్రెస్‌ను ఒక కుటుంబ జాగీరుగా మార్చి వేసింది ఇందిరాగాంధీయే అయినప్పటికీ 'వంశ పారంపర్య' రాజకీయాలకు ఆద్యుడుగా నెహ్రూను తప్పుపడుతున్నారు. ప్రధానమంత్రి పదవిలో ఆయన వారసుడుగా లాల్ బహదూర్ శాస్త్రి ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయ్యారన్న వాస్తవాన్ని నెహ్రూను విమర్శిస్తున్నవారు విస్మరిస్తున్నారు. 'నెహ్రూ వారసుల చర్యలు ఆయన పేరు ప్రతిష్ఠలకు తీరని నష్టాన్ని కలిగించాయని' చరిత్రకారుడు రామచంద్ర గుహ అన్నారు. ఇది పూర్తిగా నిజం.

నెహ్రూ పట్ల మోదీ వ్యతిరేకతకు కారణమైన మరో ప్రధాన విషయాన్ని పేర్కొంటాను. నరేంద్ర మోదీ అసాధారణంగా ఆకట్టుకునే వ్యక్తి అనడంలో ఎవరికీ రెండో అభిప్రాయం లేదు. మోదీ గత ఏడాది తనను తాను 'జైవికంగా జన్మించని అవతారపురుషుడు'గా అభివర్ణించుకున్నారు. అటువంటి తనకు, భారతదేశ మహోన్నత ప్రధానమంత్రిగా గుర్తింపు పొందాలన్న తన ఆకాంక్షకు మధ్య అడ్డుగా ఉన్న ఏకైక వ్యక్తి నెహ్రూయే అని మోదీ భావిస్తున్నారు. భారత ప్రధానమంత్రి పదవిలో సుదీర్ఘకాలం కొనసాగిన నేతగా మోదీ ఇటీవలే ఇందిరాగాంధీ రికార్డును అధిగమించారు. ఇప్పుడు తనకు, శాశ్వత ప్రభావదాయక గణాంక మైలురాయికి మధ్య నెహ్రూ మాత్రమే అడ్డుగా ఉన్నారు. అయితే ఇది కేవలం ఒక రికార్డు బద్దలుగొట్టే అంకెల క్రీడ కాదు. నెహ్రూవియన్ భారత్ భావనను పూర్తిగా విడనాడి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రబోధాల ప్రాతిపదికన ఒక 'కొత్త' భారతదేశాన్ని నిర్మిస్తున్న ప్రప్రథమ ప్రధానమంత్రిని తానేనన్న భావన తన అనుయాయుల మనసుల్లో సుస్థిరంగా నెలకొల్పేందుకు నెహ్రూపై తన దృష్టిని నిరంతరాయంగా కేంద్రీకరించవలసిన అవసరం మోదీకి ఉన్నది. ఒక పురాతన నాగరికత వైభవాన్ని, ప్రాచీన హిందూ మత గ్రంథాల స్ఫూర్తిని ఆరెస్సెస్ కీర్తిస్తుండగా వైజ్ఞానిక దృక్పథం, నవీన సాంకేతికతల ఆలంబనతో ఒక ఆధునిక సమాజాన్ని నిర్మించేందుకు నెహ్రూ కృషి చేశారు. భారత్ భావనపై ప్రభావశీల నెహ్రూవియన్ ఏకస్వామ్యాన్ని బద్దలు గొట్టేందుకు నెహ్రూ కీర్తికాయాన్ని కూల్చివేయాల్సిన అవసరం మోదీకి ఉన్నది. అందుకు ఏకైక మార్గం విదేశాంగ విధానం నుంచి దేశీయ వ్యవహారాల దాకా నెహ్రూ తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించడమే. వ్యక్తిగా, పాలకుడుగా నెహ్రూ లోపాలను ఎత్తి చూపడం ద్వారా చరిత్రలో ఆయన సమున్నత స్థానాన్ని తక్కువ స్థాయికి కుదించివేయడమే ప్రధాని మోదీ ప్రధానలక్ష్యంగా ఉన్నది. ఈ లక్ష్య సాధనలో మోదీ, ఆయన మద్దతుదారులు ఒక మౌలిక తప్పు చేస్తున్నారు: అర్ధ సత్యాలు, అబద్ధాలతో నెహ్రూ ఘనతను కళంకితం చేయడానికి ఎంతగా ప్రయత్నిస్తున్నారో అంతకంటే మరెంతో ఎక్కువగా ఆయన శతాధిక కోట్ల భారతీయుల మనసుల్లో సజీవంగా వెలుగొందుతున్నారు.

తాజా కలం: ఉన్నత పదవుల్లో ఉన్న నాయకులు 75 సంవత్సరాల వయస్సు వచ్చిన తరువాత విధిగా పదవీ బాధ్యతల నుంచి వైదొలగాలన్న సంచలనాత్మక ప్రతిపాదనపై ఇటీవల తీవ్ర చర్చ జరుగుతున్న సమయంలో 'పదవి నుంచి వైదొలిగే విషయాన్ని ప్రధాని మోదీ పరిశీలనలోకి తీసుకుంటారా?' అని బీజేపీ నాయకుడు ఒకరిని ప్రశ్నించాను. 'కనీసం 2031 దాకా మోదీ అటువంటి ఆలోచన చేయరు' అని ఆ నేత బదులిచ్చారు. కారణమేమిటని ప్రశ్నించగా 'భారత ప్రధానమంత్రిగా సుదీర్ఘకాలం కొనసాగడంలో నెహ్రూ రికార్డును మోదీ ఆ ఏడాది అధిగమిస్తారని' ఆ నాయకుడు వివరించారు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)



సొసైటీలో..
రూ.43.59 లక్షలు స్వాహా

◆ భారతీనగర్ పీఏసీఎస్‌పై విచారణ పూర్తి
◆ విశ్రాంత, ప్రస్తుత సీఈవో, జీడీసీసీ మేనేజర్‌పై కేసు



భారతీనగర్ సొసైటీ భవనం

పొన్నూరుటౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపాలెంలోని భారతీనగర్ పీఏసీఎస్ సొసైటీలో రూ.43,59,256 మేర అక్రమాలు జరిగినట్లు అధికారుల విచారణలో తేలింది. సొసైటీలోని అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డివిజనల్ కోఆపరేటివ్ ఆఫీసర్ రామారావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ గండు కిరణ్ తెలిపారు. సొసైటీ విశ్రాంత సీఈవో కాట్రగడ్డ నాగేశ్వరరావు, ప్రస్తుత సీఈవో కాట్రగడ్డ రామకృష్ణ, జీడీసీసీ బ్యాంకు ఇన్‌చార్జి మేనేజర్ కొడాలి మహేష్‌లపై కేసు నమోదు చేశామన్నారు. అంతర్గత విచారణ జరిపిన అధికారులు సొసైటీలో అక్రమాలు నిజమేనని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందచేశారు. దివంగత అధ్యక్షుడైన తాడిశెట్టి యతిరాజులు సహకారంతో అధికారులు అక్రమాలకు పాల్పడినట్లు నివేదికలో పొందుపరిచారు. రూ.43,59,256 నగదుకు సంబంధించి మోసం, నమ్మకద్రోహం జరిగినట్లు విచారణ అధికారులు నివేదికను కలెక్టర్‌కు అందజేశారు. వైసీపీ హయాంలో సొసైటీల్లో అక్రమాలపై కూడా సమగ్రంగా విచారణ జరపాలని పలువురు రైతులు డిమాండ్ చేస్తున్నారు.

అక్రమాలు ఇలా..

- రుణాలకు సంబంధించి రైతులు చెల్లించిన రూ.20 లక్షలు జమ చేయకుండా స్వాహా చేశారు.
- నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగ విరమణ చేసిన కాట్రగడ్డ నాగేశ్వరరావును తిరిగి సీఈవోగా నియమించారు. దీంతో ఆయన ఏడేళ్లలో రూ.16 లక్షలు వేతనంగా పొందారు.
- కాంట్రాక్టు డైలీవేజ్‌గా నాగేశ్వరరావు తన బంధువులను సొసైటీలో నియమించుకుని రూ.1.88 లక్షలు తీసుకున్నాడు.
- 60 ఏళ్లు దాటిన వ్యక్తిని స్వీపర్‌గా నియమించుకుని రూ.1.02 లక్షలు వేతనంగా అందించారు.
- సొంత భవనం ఉన్నా అద్దె భవనం తీసుకున్నట్లు రికార్డులో పొందుపరిచి రూ.40 వేలు డ్రా చేశారు.
- నాగేశ్వరరావు రెండు సార్లు ఉద్యోగ విరమణ ప్రోత్సాహకాలు తీసుకున్నారు.



డెంగీ మాసోత్సవ ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డెంగీ మాసోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో విజయలక్ష్మి

మంగళగిరి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో విజయలక్ష్మి తెలిపారు. జాతీయ డెంగీ మాసోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం మంగళగిరిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ర్యాలీని డీఎంహెచ్‌వో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్ గున్యా వంటి వైరల్ ఫీవర్లు ప్రబలే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది డెంగీ కేసులు తక్కువగానే ఉన్నాయని, అయినా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి టీఎంకే సుబ్బరాయణం, ఏఎంవో రాజు నాయక్, వైద్యాధికారులు డాక్టర్ పీ.అనూష, డాక్టర్ సతీశ్, కే.రామరాజు, సుధీర్, సూపర్‌వైజర్లు సాగర్, సైదులు, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నరేష్‌బాబు పాల్గొన్నారు.

అమృత్.. మళ్లీ వాయిదా

- అమృత్ అమల్లో తీవ్ర జాప్యం
- ఏడాదిగా టెండర్ ప్రక్రియలోనే పనులు
- అమృత్ 2.0 పనుల అంచనాల్లో మార్పులు
- రూ.1092.60 కోట్ల నుంచి రూ.1,136 కోట్లకు పెరుగుదల

మున్సిపల్ పట్టణాల్లో అమృత్ అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందని ద్రాక్ష చందాన మారాయి. గత వైసీపీ ప్రభుత్వం నిలిపేసిన అమృత్ 2.0ను కూటమి ప్రభుత్వం పట్టాలెక్కిం చేందుకు ప్రయత్నిస్తున్నా పనులు ముందుకు సాగడంలేదు. అభివృద్ధి పనులు టెండర్ల దశ దాటనంటున్నాయి. వాయిదాలకే టెండర్లు పరిమితమవుతున్నాయి. ఏడాదిగా పనులు టెండర్ ప్రక్రియలోనే ఉన్నాయి. గుంటూరు నగర పాలక సంస్థ సహా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో అమృత్ 2.0 పథకం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందాన మారింది. పీపీపీ తరహాలో పనులకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా టెండర్ నిర్వహణ మళ్లీ వాయిదా పడింది. జూలై 24 నుంచి ఆగస్టు 7కు వాయిదా పడిన టెండర్లు మళ్లీ వాయిదా పడ్డాయి.



అమృత్ పథకంలో రూ.5.60 కోట్లతో అభివృద్ధి చేయనున్న నరసరావుపేట కత్తవ చెరువు

(తెనాలి, ఆంధ్రజ్యోతి)

గుంటూరు నగర పాలక సంస్థ సహా పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలోని మున్సిపాలిటీల్లో పీపీపీ తరహా విధానంలో అమృత్ 2.0 ప్రగతి పనుల టెండర్‌ను ఇటీవల ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ పిలిచింది. నీటి పథకాల విస్తరణ, చెరువుల ఆధునికీకరణ, మురుగునీటి శుద్ధి ప్లాంట్ల పనులకు రూ.1092.40 కోట్ల అంచనా వేసి ప్రజారోగ్యం, మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖ టెండర్లు ఆహ్వానించింది. అయితే కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో జూలై 24న ముగియాల్సిన టెండర్‌ను ఆగస్టు 7 వరకు పొడిగించారు. సిమెంటు, స్టీలు, కార్మికుల కూలి మెటీరియల్ ప్రామాణిక రేట్లు(ఎస్‌ఓఆర్)ను (మిగతా 6లో)



తనిఖీలు తాయిలాలు

- బీఈడీ కళాశాలల అఫిలియేషన్‌లో అక్రమాలు
- అధ్యాపకులు, విద్యార్థులు లేకుండానే అనుమతి
- అడిగినవన్నీ సమకూరిస్తేనే తనిఖీలని వేధింపులు
- ఏఎన్‌యూ అధికారుల తీరుపై మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదులు

గుంటూరు(విద్య), జూలై 31 (ఆంధ్రజ్యోతి): భవనాలు లేవు..విద్యార్థులు ఉండరు.. బోధన చేసే అధ్యాపకులు ఉండరు.. అయినా ఆచార్య నాగార్జున వర్సిటీ పరిధిలో బీఈడీ కళాశాలలు కొనసాగుతున్నాయి. కళాశాలల అనుమతులు, గుర్తింపునకు సంబంధించి ఏటా జరిగే తనిఖీలు కేవలం తూతూమంత్రంగా జరుగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్సిటీ నుంచి తనిఖీలకు వచ్చే అధికారులు, ఆచార్యులను సంతృప్తి పరిస్తే నిబంధనలు అమలు చేయకున్నా ఆ రెండేళ్లకు అనుమతులు వచ్చేస్తాయి. ఇలా వచ్చే అనుమతులతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో పలు బీఈడీ కళాశాలలు కొనసాగుతున్నాయి. బీఈడీ కళాశాలకు సంబంధించి 2025-27 విద్యా సంవత్సరానికి జూలై 30 లోపు గుర్తింపు కోసం(అఫిలియేషన్) తనిఖీలు జరపాలి. అయితే తనిఖీలు అస్తవ్యస్తంగా జరిగాయని (మిగతా 6లో)

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

నంబూరు ఎస్టీలకు కలెక్టర్ నాగలక్ష్మి హామీ



నంబూరులో పర్యటిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

పెదకాకాని, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆదుకునేందుకు ఎవరు లేరని అధైర్యపడొద్దు.. అభ్యున్నతికి.. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయి.. అని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఎస్టీలకు హామీ ఇచ్చారు. పెదకాకాని మండలం నంబూరులోని ఎస్టీ(యానాది) కాలనీని గురువారం కలెక్టర్ సందర్శించి వారి సమస్యలు ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విలేజి రీ కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్(జేఎంజే) ఆధ్వర్యంలో టార్పాలిన్ పట్టాలను కలెక్టర్ పంపిణీ చేశారు. కాలనీవాసుల్లో పలువురికి ఇళ్ల స్థలాలు లేవని, కనీస సౌకర్యాలు అందుకోలేకపోతున్నామని, వర్షం పడినప్పుడు ఇళ్లల్లోకి నీరుచేరుతుందని కాలనీవాసులు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అమలు చేయాలంటే ఆధార్, రేషన్ కార్డులు కావాలని వాటిని ముందుగా ఇప్పిస్తానని చెప్పారు. తదుపరి పింఛన్లు, తల్లికి వందనం, ఆరోగ్యసేవలు అందేలా చూస్తామన్నారు. నీటి సదుపాయం, డ్రెయినేజీ, పారిశుధ్య సమస్యలను పరిష్కరించాలని అధికారులను పరిశీలించాలని ఆదేశించారు. పట్టాలు పొందిన వారి ఇళ్ల నిర్మాణానికి వీఆర్వో సంస్థ అధ్యక్షుడు వేకంగినిరాజు హామీ ఇచ్చారని కలెక్టర్ కాలనీవాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ ప్రసాద్, ఏఈ రమేష్, డీఎస్‌డబ్ల్యూ ఎస్ మోహన్, ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు కృష్ణకాంత్, పంచాయతీ సెక్రటరి శ్రీనివాసరావు, జేఎంజే సంస్థ మేరీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు.. మొదటి వ్యాక్సిన్!

- నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు



నేటి నుంచి దీపం-2 ఉచిత సిలిండర్ల బుకింగ్స్ ప్రారంభం



- ఏప్రిల్ - జూలై వరకు 10.94 లక్షల మందికి సబ్సిడీ విడుదల
- రూ. 89.57 కోట్ల నగదు బ్యాంకు ఖాతాల్లో జమ

సునామీ సన్నద్ధతపై మాక్ ఎక్సర్‌సైజ్

ఓవరాల్ చాంపియన్‌గా కడప క్లస్టర్ విద్యార్థులు

- ముగిసిన నవోదయ విద్యార్థుల యోగా పోటీలు

8

గంజాయి ముఠా అరెస్టు

- తెనాలిలో 5.200 కేజీల స్వాధీనం.. 13మంది అరెస్టు

కూతురితో అసభ్యంగా ప్రవర్తించిన.. తండ్రికి పదేళ్ల జైలు

మ్యాజిక్ డ్రెయిన్లపై దృష్టి పెట్టండి

- పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ

6

గాలి.. ఊపిరి తీస్తోంది

- పీల్చే గాలిలో కాలుష్య కారకాలు
- నగరంలో నానాటికీ తగ్గుతోన్న నాణ్యత
- ఎంటీబీ, ఆటోనగర్ వద్ద అత్యధిక కాలుష్యం
- గత ఏడాది 63.. నేడు 68.5 మైక్రోగ్రాములకు పెరుగుదల

గాలిలో కాలుష్యం ఇలా..

ఎంటీబీ	: 70 నుంచి 74 మైక్రోగ్రాములు
ఆటోనగర్	: 74 నుంచి 76 మైక్రోగ్రాములు
జీజీహెచ్	: 62 నుంచి 66 మైక్రోగ్రాములు
నవభారతీనగర్	: 62 నుంచి 63 మైక్రోగ్రాములు

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజలు పీల్చే గాలిలో నానాటికీ నాణ్యత తగ్గిపోతున్నది. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కాలుష్య కారకాలు గాలిలో విపరీతంగా కలుస్తున్నాయి. దీంతో గాలిలో స్వచ్ఛత కరువై ప్రజల ఊపిరితీస్తోంది. గుంటూరులో 2024-25లో 10 మైక్రోమీటర్ల వ్యాసార్థంలో 63 మైక్రోగ్రాముల కాలుష్య కారకాలు నమోదయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో 68.75, మేలో 67.5, జూన్‌లో 69.25 మైక్రోగ్రాముల కాలుష్యకారకాలు నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు తాజాగా నివేదించింది. మున్సిపల్ ట్రావెలర్స్ బంగ్లా(ఎంటీబీ), ఆటోనగర్ ప్రాంతాలు కాలుష్య కారకాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా యంత్రాంగం కారకాలను తగ్గించేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించింది. డస్టు కంట్రోల్ చేయడానికి రోడ్డు ఇంప్రూవ్‌మెంట్ వర్కులు చేపట్టాలని ఆదేశించింది. పచ్చదనం పెంపొందించడం, యంత్రాల ద్వారా రోడ్లపై దుమ్ము, ధూళి ఊడ్చడం చేయాలని సూచించింది. ట్రాఫిక్ జంక్షన్లు విస్తరించి అక్కడ వాహనాలు ఎక్కువసేపు ఆగకుండా చూడటం. శ్మశాన వాటికల్లో గాలి కాలుష్యం తగ్గించాలని నిర్ణయించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గుంటూరుకి రూ.12.69 కోట్లను ఎన్‌సీఏపీ కింద కేంద్రం కేటాయించింది. ప్రోత్సాహకంగా మరో రూ.3.56 కోట్లు కేటాయించింది. ప్రజలు పీల్చే గాలిలో నాణ్యత పెంచడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసినా గుంటూరులో ఆశించిన ఫలితం కనిపించడం లేదు.





సాగర్ వద్ద యువత సెల్ఫీలు

కృష్ణమ్మ పరవళ్లు

2,43,829 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి గురువారం 2,82,609 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ప్రాజెక్టు అధికారులు 26 క్రస్ట్ గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,96,742 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా 29,273, కుడి కాల్వ ద్వారా 8604, ఎడమ కాల్వ ద్వారా 7110, ఎస్‌ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్‌ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కుల చొప్పున ఔట్‌ఫ్లోగా 2,43,829 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయంలో ప్రస్తుతం 585.10 అడుగుల్లో నీరు ఉంది.

- సత్రశాలలోని టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి 14 క్రస్టు గేట్ల ద్వారా 2 లక్షల 32 వేల క్యూసెక్కుల నీ టిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 74.28(6.280 టీఎంసీలు) మీటర్లు అంటే 244 అడుగల నీరు ఉంది. సాగర్ నుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు.
- పులిచింతలకు ఎగువ నుంచి 2,24,403 క్యూసెక్కులు వస్తుండగా 2,04,904 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



కొల్లిపరలో లంక గ్రామాల నుంచి పడవ ద్వారా వస్తున్న రైతులు

- నదిలో గట్లను అనుకుని ప్రవాహం
- జలాశయాలకు కొనసాగుతున్న వరద
- సాగర్‌లో 26 క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజి నుంచి 2.51 లక్షల క్యూసెక్కులు..
- పెసర్లంక గండి నుంచి కరకట్ట వైపు వరద ప్రవాహం

తాడేపల్లిటౌన్, దుగ్గిరాల, విజయపురి సౌత్, రెంటచింతల, అచ్చంపేట, కొల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉరకలెత్తుతూ వస్తోన్న కృష్ణమ్మతో జలాశయాలు నిండిపోతున్నాయి. దీంతో వచ్చిన వరదను వచ్చినట్లుగానే దిగువకు విడుదల చేస్తున్నారు. కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నాగార్జునసాగర్ దిగువ నుంచి రేపల్లెలోని తీర ప్రాంతం వరకు నదిలో నీరు గట్లను తాకుతూ ప్రవహిస్తోంది. నదీతీర గ్రామాలైన పొందుగల, రామాపురం, భట్రుపాలెం, కాట్రపాడు, తంగెడ రేవుల వద్ద ఉన్న పుష్కర ఘాట్లు నీటితో నిండిపోయాయి. ప్రమాదకర సంఘటనలకు తావు లేకుండా ఆయా శాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. రాత్రి వేళ గస్తీని ఏర్పాటు చేశారు. ప్రవాహం పెరిగినా ఒడ్డున జీవనం సాగించే వారికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా హెచ్చరికలు చేస్తున్నారు. పల్లెకార్లు నదిలో (మిగతా 6లో)

మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఇద్దరి ఎంపిక



పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులతో లిఫ్టర్లు కాంతా కుమారి, జ్యోతి వర్మ

మంగళగిరి సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేరళలోని కొజికోడ్‌లో శనివారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జరుగనున్న నేషనల్ మాస్టర్స్ క్లాసిక్ అండ్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టుకు గుంటూరు జిల్లా నుంచి ఇద్దరు మహిళా లిఫ్టర్లు ఎంపికైనట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మూరు విజయభాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. కాంతా కుమారి మాస్టర్స్-1 క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ 76 కిలోల విభాగంలో, జ్యోతి వర్మ మాస్టర్స్-2 క్లాసిక్ అండ్ ఎక్విప్డ్ 69 కిలోల విభాగంలో పాల్గొంటారని చెప్పారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన పవర్ లిఫ్టర్లను ఏపీ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు మద్ది ప్రభాకర్‌రావు, అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ సకల కోటేశ్వరరావు, జిల్లా వైస్‌చైర్మన్ ఆర్‌ఎస్ వంశీకృష్ణ, కోశాధికారి గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు అభినందించారు.

భోజనంలో బల్లి పడిన మాట నిజమే

● ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రమాదం లేదు ● డీఈవో రేణుక



మాట్లాడుతున్న డీఈవో రేణుక

తెనాలి అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ శిక్షణలో ఉన్న వారికి వడ్డించిన భోజనంలో బల్లి పడిన మాట వాస్తవమేనని కానీ, ఎవరికీ.. ఎలాంటి ప్రమాదం లేదని జిల్లా విద్యా శాఖాధికారి సి.వి రేణుక తెలిపారు. జేఎంజే మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. రాష్ట్రంలోని పలు జిల్లాలకు చెందిన కేజీబీవీల్లో పని చేస్తున్న పీజీటీలకు జేఎంజే మహిళా కళాశాలలో ఆరు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ సోమవారం ప్రారంభమైందన్నారు. బుధవారం రాత్రి భోజనం చేస్తున్న వారికి కూరలో బల్లి కనబడిందని, కానీ, అది కూరలో ఉడకలేదని చెప్పారు. దీని వల్ల ముందుగా భోజనం చేసిన 40 మంది ఉపాధ్యాయుల్లో నలుగురు ప్యానిక్ కావడం వల్ల అస్వస్థతకు లోనయ్యారని పేర్కొన్నారు. వారిని ప్రకాశం రోడ్డులోని హెల్త్ హాస్పిటల్‌లో ముందు జాగ్రత్త నిమిత్తం చేర్పామని, ఎలాంటి సమస్య లేకపోవడంతో మధ్యాహ్నం డిశ్చార్జ్ కూడా అయ్యారని డీఈఓ వెల్లడించారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల భోజనం సరఫరా చేసిన వెండర్‌ను తొలగించి, మరొకరిని ఎంపిక చేయడం జరిగిందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ శాంత మాట్లాడుతూ, శిక్షణ వేదిక మాత్రమే ఇచ్చామని, ఉపాధ్యాయులకు అల్పాహారం, భోజనం సరఫరా తమది కాదని దీనిపై తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఉమామహేశ్వరి, అనిత, అరుణ, మేరికుమారి పాల్గొన్నారు.

వరికపూడిశల ప్రకాశం, పల్నాడుకు వరం

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్



కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజలకు వరికపూడిశల ప్రాజెక్టు ఒక వరం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీ శాఖకు రూ.14.81 కోట్లు ఇచ్చి వరికపూడిశల ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు తీసుకెళ్లడం ఎంతో సంతోషకరమన్నారు. వరికపూడిశల ప్రాజెక్టు ద్వారా పల్నాడు జిల్లా మచర్ల, వినుకొండ, ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో 1,00, 114 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. నిధులు జమ కావడం, అటవీశాఖ నుంచి అడ్డంకి తొలగిపోవడంతో తొలి, రెండవ దశల నిర్మాణలకు అవకాశం ఏర్పడిందన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చొరవ చూపడంతో నిధుల సమస్య పరిష్కారమైందని పేర్కొన్నారు. ఏడు దశాబ్దాల తమ కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నెరవేర్చటంతో అటు ప్రకాశం, ఇటు పల్నాడు జిల్లా రైతులు సంతోష పడుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌కు పల్నాడు, ప్రకాశం జిల్లాల ప్రజల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

కూతురితో అసభ్యంగా ప్రవర్తించిన..
తండ్రికి పదేళ్ల జైలు

నరసరావుపేట లీగల్, జూలై 31, (ఆంధ్రజ్యోతి): ఐదవ తరగతి చదువుతున్న పట్టణానికి చెందిన ఓ చిన్నారి పట్ల తండ్రే అసభ్యంగా ప్రవర్తించినట్లు నేరం రుజువు కావడంతో.. నిందితుడికి పదేళ్ల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధిస్తూ గుంటూరు పోక్సో కోర్టు న్యాయ అధికారి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం గురువారం తీర్పునిచ్చారు. వివరాల మేరకు.. పట్టణానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ వివాదాల నేపథ్యంలో తన భార్యకు దూరంగా ఉంటున్నాడు. నిందితుడికి ముగ్గురు ఆడ పిల్లలు సంతానం. చివరి కుమార్తె తండ్రి వద్ద ఉంటోంది. 2024 సెప్టెంబర్ 7న రాత్రి 9 గంటల సమయంలో నిందితుడు మద్యం సేవించి వచ్చి.. కూతురితో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో ఆ చిన్నారి ఇంటి పక్కన వారికి చెప్పడంతో.. వారు స్వచ్ఛంద సేవా సంస్థకు సమాచారం ఇచ్చారు. సదరు సంస్థ వారు ఐసీడీఎస్‌కు సమాచారం అందించారు. వారు రెండవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేసి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు అవడంతో పై విధంగా కోర్టు తీర్పు ఇచ్చింది. కేసును రెండో పట్టణ సీఐ హైమారావు దర్యాప్తు చేయగా, ఏపీపీ బర్కత్ అలీ ఖాన్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

గంజాయి విక్రయ ముఠా అరెస్టు

● 5.200 కేజీల గంజాయి స్వాధీనం, 13మంది అరెస్టు
● గంజాయిపై ఉక్కుపాదం, నిరంతర నిఘా
● వివరాలు వెల్లడించిన డీఎస్పీ జనార్దన్‌రావు



నిందితులను చూపున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్, జూలై31 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహితంగా తెనాలి సబ్ డివిజన్‌ను తీర్చిదిద్దేలా నిరంతరం పోలీసుల నిఘాతో విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నామని డీఎస్పీ జనార్దన్‌రావు పేర్కొన్నారు. బుధవారం కొల్లిపర మండలం బొమ్మువానిపాలెం మాల డొంక దిగువన గంజాయి విక్రయం, సేవిస్తున్నారని పక్కా సమాచారంతో తెనాలి రూరల్, కొల్లిపర పోలీసులు సంయుక్తంగా చేసిన దాడుల్లో 13 మందిని అరెస్ట్ చేసి, 5,200 గ్రాముల గంజాయినీ స్వాధీనం చేసుకున్నారు. గురువారం తెనాలి రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న గంజాయితో పాటు నిందితులను చూపుతూ డీఎస్పీ జనార్దనరావు కేసు వివరాలను వెల్లడించారు. గంజాయికి బానిసలుగా మారిన కొల్లిపరకు చెందిన మల్లోల శక్షభస్‌బాబు, మండ్రురాజ్‌కుమార్, ఆరే ఆదిత్య, అమిరే ఆనంద్‌కిషోర్, వల్లభాపురానికి చెందిన పాముల రుషిబాబు, మంగళగిరి మండలం కాజకు చెందిన కారంకి నిఖిల్‌కుమార్, అత్తోటకు చెందిన యర్ర శశికుమార్ గంజాయికి బానిసలై వైజాగ్ ఏజెన్సీలోని పాడేరు సమీపంలోని కించముండలో నివాసం ఉండే పరమేశ్వర్ వద్ద గంజాయి కొనుగోలు చేసి తీసుకు వచ్చి సేవిస్తున్నారని తెలిపారు. గంజాయిని చిన్న ప్యాకెట్లుగా తెనాలి, కొల్లిపర పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్నారన్నారు. వీరి వద్దకు గంజాయికి బానిసలైన కొల్లిపర గ్రామానికి చెందిన పోకూరి శ్రీను, గరిక గోపీనాథ్, మేడా ప్రవీణ్, దాసరి చేతన్, రేపల్లె పట్టణం ప్రభల వారి వీధికి చెందిన కొసరాజు రోహిత్‌నాగ్, విశాఖపట్నంకి చెందిన కొచ్చెర్ల సత్యసాయి చక్రవర్తి వారి వద్ద కొని సేవిస్తున్నట్లు చెప్పారు. పోలీసులు జరిపిన మెరుపు దాడుల్లో రూ.80వేలు విలువజేసే గంజాయి స్వాధీనం చేసుకుని, 13 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. గంజాయి సేవించేవారిలో.. ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులున్నారని తెలిపారు. విక్రయదారుల్లో కొందరు కొల్లిపర స్టేషన్లో పలు దొంగతనాలు, గంజాయి కేసుల్లో ముద్దాయిలుగా ఉన్నారని వివరించారు. గంజాయి ముఠాను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ ఉమేష్, ఎస్ఐ కోటేశ్వరరావు, ఆనంద్, ఏఎస్ఐ ప్రసాదరావు, హెడ్ కానిస్టేబుల్స్ రామకోటేశ్వరరావు, రమేష్, పోలీస్ కానిస్టేబుల్స్ చంద్రకుమార్, విజయశేఖర్, కుర్మారావు, నాగబాబు, నాగరాజు, రవి, సుబ్బారెడ్డి, లంకవరపు ప్రసాద్‌ను డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. పలువురు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో రామ్‌రాజ్ షోరూం



రామ్‌రాజ్ షోరూంను ప్రారంభిస్తున్న ప్రముఖులు

నరసరావుపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వస్త్ర రంగంలో ప్రసిద్ధి చెందిన రామ్‌రాజ్ కాటన్ సంస్థ నరసరావుపేటలోని అరుండల్ పేటలో కొత్త షోరూం ఏర్పాటు చేసింది. ఈ షోరూంను గురువారం ఉదయం నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు లాంఛనంగా ప్రారంభించారు. వినుకొండ శాసన సభ్యులు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దర్శి టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ కడియాల లక్ష్మీ గొట్టిపాటి జ్యోతి ప్రజ్వలన గావించారు. ఏపీ రెడ్డి జేఏసీ పొలిమేర వెంకటరెడ్డి తొలి కొనుగోలు చేశారు. రామ్‌రాజ్ కాటన్ చైర్మన్ కేఆర్ నాగరాజన్ అతిథులను స్వాగతించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. రామ్‌రాజ్ కాటన్ అన్ని ఉత్పత్తులు మృదువైన కాటన్ ఫ్యాబ్రిక్స్‌తో తయారు చేయబడ్డాయన్నారు. వీటిని వస్త్ర రంగంలో నిపుణులు రూపొందించి విక్రయిస్తారన్నారు. ధోతీలు, చొక్కాలు, బనియన్లు దక్షిణ భారతదేశంలోనే కాకుండా ఉత్తర భారతదేశంలోనూ అందుబాటులో ఉన్నాయని వివరించారు.

కృష్ణమ్మ పరవళ్లు

(5వ పేజీ తరువాయి)

చేపల షికారుకు వెళ్లకుండా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. సాగర్ జలాశయం నుంచి 26 క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల చేస్తుండడంతో గురువారం పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చి జలశోయగాలను వీక్షించి తరించారు. సెల్ఫీలు దిగుతూ ఉత్సాహంగా గడిపారు. ప్రాజెక్ట్ అందాలను తిలకిస్తూ సందడి చేశారు. ఎగువ నుంచి గురువారం 2 లక్షల 54వేల 128 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు సీటిపారుదల శాఖ జేఈ రాజేష్ తెలిపారు. రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 6 అడుగులు, 10 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి దిగువకు 2లక్షల 49వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు పశ్చిమ డెల్టా కాల్వలకు 16వేల 909 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. బ్యారేజి దిగువన నదీ పరివాహక ప్రాంత లంకల్లో నివాసితులు మత్స్యకారులు, పశుకాపరులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

నిలకడగా ప్రవాహం..

కొల్లూరు మండలంలోని పెసర్లంక అరవింద వారధి వద్ద గంట గంటకు కృష్ణానది వరద ప్రవాహం పెరుగుతూ వచ్చింది. సాయంత్రం గండిలో నుంచి వరద ప్రవాహం కొల్లూరు నక్కపాయ వరకు గోతులను ముంచుతూ ప్రవహించింది. నదీ ప్రవాహాన్ని కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ అమర్‌వర్ధన్, ఆర్సీ ఏఈ విజయరాజులు పర్యవేక్షించారు. భట్టిప్రోలు మండల పరిధిలో విస్తరించి ఉన్న కృష్ణానదిలో కూడా వరద ప్రవాహం ప్రస్తుతం నిలకడగా కొనసాగుతుంది.

టెండర్.. మళ్లీ వాయిదా

(5వ పేజీ తరువాయి)

ఏటా ప్రభుత్వం జూలైలో పెంచుతుంది. అయితే అమృత్ టెండర్ సమయంలో పెంచిన ఎస్ఓఆర్ రేట్లు అందుబాటులోకి రాలేదు. పాత రేట్ల ప్రకారం టెండర్ పిలవగా కాంట్రాక్టర్లు కొత్త రేట్లు కోరుతుండటంతో 7న ముగియాల్సిన టెండర్‌ను వాయిదా వేశారు. సుమారు 4 నుంచి 5 శాతం వరకు ఎస్ఓఆర్ రేట్లను పెంచుతూ ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. పెరిగిన రేట్ల ప్రకారం 4 శాతాన్ని ప్రామాణికంగా తీసుకుంటే పనుల వ్యయం దాదాపు రూ.43.70 కోట్లు పెరగనున్నది. ఈ ప్రకారం రూ.1092.40 కోట్ల నుంచి రూ.1,136 కోట్లకు పెరగనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఇక కాంట్రాక్టర్లదే నిర్వహణ బాధ్యత

మూడు జిల్లాల్లో అమృత్ 2.0 పథకం పనులను ఒకే ప్యాకేజి కింద పీపీపీ తరహాలో టెండర్ నిర్వహిస్తున్నారు. పనుల సమయంలో మొత్తం వ్యయంలో ప్రభుత్వం 50 శాతం సొమ్ము కాంట్రాక్టరుకు చెల్లిస్తుంది. పీపీపీ విధానంలో పదేళ్ల పాటు ఆయా పనుల నిర్వహణ బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్‌దే. నిర్ణీత గడువులోపు పనులు దెబ్బతిన్నా కాంట్రాక్టరే నిర్వహించాల్సి ఉంటుంది. దీనివల్ల పనులు పూర్తి నాణ్యతతో జరుగుతాయని ఇంజనీర్లు చెబుతున్నారు. నిర్వహణ ఖర్చు కాంట్రాక్టరే భరించాల్సి ఉండటంతో పనుల్లో లోపాలు ఉండవంటున్నారు. ఇలా పూర్తి చేసిన పనికి పదేళ్లలో కాంట్రాక్టర్‌కు ప్రతి మూడు నెలలకు ఒకసారి మిగిలిన 50 శాతం నగదుకు వడ్డీతో కలిపి ప్రభుత్వం చెల్లిస్తుంది. ఇలా 40 వాయిదాల్లో కాంట్రాక్టర్ ఖర్చు చేసిన మొత్తాన్ని చెల్లిస్తుంది. అయితే ఈ నూతన విధానంలో పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక్తి చూపుతారా లేదా అన్న సందేహాలు నెలకున్నాయి.

పరారీలో వ్యాపారులు? ఆందోళనలో రుణదాతలు

నరసరావుపేట లీగల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఒకే కుటుంబంలోని వ్యాపారులు పరారీలో ఉన్నట్లు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఆ ఇద్దరి మొబైల్స్ స్విచ్ ఆఫ్ అని మెసెజ్ వస్తుందని రుణదాతలు చెబుతున్నారు. సదరు వ్యక్తులు రెండు రోజుల నుంచి పట్టణంలో లేరని, వారు రూ.60 కోట్ల నుంచి రూ.70 కోట్ల వరకు పలువురి వద్ద రుణాలు తీసుకున్నారని చెబుతున్నారు. పట్టణంలో వీరు ప్రముఖ కంపెనీ ద్విచక్ర వహనాల వ్యాపారం నిర్వహించారు. పట్టణంలోనే ఒక ప్రముఖ నగల వ్యాపారి కోర్టులో క్రెడిటర్ ఐపీ దాఖలు చేయడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.75 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 124, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

42,014 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 39,238 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,014 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 7,042 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	12500
334	9500	13100	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13300	334	9500	12600
273	10000	12800	నెంబరు. 5	10000	13400
341	10000	14000	273	----	----
4884	----	----	341	10000	14300
సూపర్ 10	----	----	4884	10000	12700
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	14200	తేజ	10000	13800
షార్క్-1	----	----	బ్యాడిగి	10000	12200
బ్యాడిగి	10000	12600	దేవనూరు డీలక్స్	10000	12600
దేవనూరు డీలక్స్	10000	12500	తాలుకాయలు	4500	7000

తనిఖీలు.. తాయిలాలు

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలున్నాయి. వర్సిటీలోని ఓ అధికారి అండతో యథేచ్ఛగా అక్రమాలు సాగుతున్నాయని అధ్యాపకులు ఆరోపిస్తున్నారు. తాను తనిఖీలకు రావాలంటే నాటుకోడి కూర, రాగి సంగటి ఉండాలనని ఓ అధికారి పట్టుపడుతున్నట్లు కళాశాలల యాజమాన్యాలు వాపోతున్నాయి. ఆయన తనిఖీలకు వస్తే అడిగినవన్నీ సమకూర్చాల్సి వస్తుందని తెలిపారు. మార్కాపురంలో ఓ కళాశాల నిర్వాహకులను వేధించిన ఓ ఆచార్యుడి విషయం ఇప్పటికే మంత్రి నారా లోకేశ్ పేషికి చేరినట్లు సమాచారం. వర్సిటీలో అనేక ఆరోపణలు ఉన్న ఓ అధికారి తనిఖీల పేరుతో లక్షల వసూలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్‌కు కళాశాలల యాజమాన్యాలు ఫిర్యాదు చేశాయని తెలిసింది.

● తెనాలిలో వైసీపీ నేతగా చలామణి అయ్యే వ్యక్తికి బాపట్ల డిగ్రీ కళాశాలలో విధులు అప్పగించారు. ఇదే వైసీపీ నేతకు నరసరావుపేటలో మరో వైసీపీ నేతకు చెందిన బీఈడీ కళాశాలలో అధ్యాపకుడిగా అప్రూవల్ ఇచ్చారు. ఇలా ఒకేసారి డిగ్రీ, బీఈడీ కళాశాలల్లో లెక్చరర్‌గా ఎలా అప్రూవ్ చేస్తారని అధ్యాపకులు ప్రశ్నిస్తున్నారు.

● ఒరిజినల్ సర్టిఫికెట్లు లేకపోయినా కేవలం జిరాక్స్ కాపీలతో తెలంగాణకు చెందిన అధ్యాపకులకు ఇక్కడి కళాశాలల్లో అప్రూవల్ ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి.

● ఓ వైసీపీ నేతకు చెందిన డిగ్రీ, బీఈడీ కళాశాలలో రెండింటికి ఒకేసారి అప్రూవల్ చేయడమే కాకుండా అరవై ఏళ్లు దాటిన వారిని అధ్యాపకులుగా నియమించినట్లు సమాచారం.

పల్నాడు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి పొన్నూరులోని నిడుబ్రోలు మత్స్య క్షేత్రం నుంచి తెచ్చిన 2 లక్షల గంబూసియా చేప పిల్లలను జిల్లాలోని అన్ని సబ్ యూనిట్లకు అందజేశారు. గురువారం నరసరావుపేట వల్లభ చెరువులో ఈ చేప పిల్లలను ఆయనే స్వయంగా వదిలారు.

రైల్వే అధికారుల మెగా రక్తదానం



రక్తదానం చేస్తున్న రైల్వే అధికారులతో డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్తు ప్రాంగణంలోని రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ సహకారంతో రైల్వే అధికారులు గురువారం స్థానిక పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో మెగా రక్తదానం చేశారు. డీఆర్ఎం సుధేష్ణ సేన్ నాయకత్వంలో మొత్తం 67 మంది రైల్వే అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ తాను చిన్నతనం నుంచి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తున్నానని చెప్పారు. క్లిష్టమైన వైద్య, అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించే శక్తి రక్తానికే ఉందన్నారు. రక్తదానంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఎం రమేష్‌కుమార్, సీనియర్ డీపీవో షాబాజ్ హనూర్, సీనియర్ డీఎఫ్ఎం అమూల్య బి.రాజ్, డివిజనల్ మెటీరియల్స్ మేనేజర్ కార్తికేయ గడఖ్, డీసీఎం కమలాకర్‌బాబు, డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ విజయ కీర్తి, ఏఎస్‌సీ శైలేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఇద్దరు ఇంటర్ విద్యార్థుల అదృశ్యం

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని తురకపాలెం రోడ్డులోని ఓ కళాశాల నుంచి ఇద్దరు ఇంటర్ విద్యార్థులు అదృశ్యమయ్యారు. ప్రకాశం జిల్లా బెల్లంకొండవారి పాలేనికి చెందిన తాడికొండ శివ చరణ్‌కుమార్ (16), ప్రకాశం జిల్లా తాళ్లూరులోని మాధవపురానికి చెందిన వంగ పాటు వీరాంజనేయులు (16) బుధవారం రాత్రి 9:30 గంటల సమయంలో హాస్టల్ నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర రావు ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



నేటితో ముగియనున్న నామినేషన్ల ప్రక్రియ

● ఎన్నికల అధికారి డి.శ్రీనివాసరావు

గుంటూరు కార్పొరేషన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నేటితో ఎన్టీఆర్ స్టేడియం నామినేషన్ ప్రక్రియ ముగియనుంది. ఎన్టీఆర్ మున్సిపల్ క్రీడా ప్రాంగణం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు గురువారం 12 నామినేషన్లు వచ్చాయని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్, ఎన్టీఆర్ స్టేడియం ఎక్స్ అఫిషియో జాయింట్ సెక్రటరీ, ఎన్టీఆర్ స్టేడియం పాలకవర్గ ఎన్నికల నిర్వహణ అధికారి డి.శ్రీనివాసరావు ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు పాలకవర్గ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ జరుగుతున్నాయని తెలిపారు. జూలై 30వ తేదీన వివిధ పదవులకు 5 నామినేషన్లు వచ్చాయన్నారు. జూలై 31న 12 నామినేషన్లు వచ్చాయని వాటిలో వైస్ ప్రెసిడెంట్‌కి 2 నామినేషన్లు, సెక్రటరీకి 2 నామినేషన్లు, జాయింట్ సెక్రటరీకి 2 నామినేషన్లు, ట్రెజరర్ ఒక్క నామినేషన్, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ పురుషుల నుండి 4 నామినేషన్లు, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్స్ మహిళల నుంచి ఒక నామినేషన్ వచ్చాయని తెలిపారు. జూలై 30, 31 తేదీల్లో 17 నామినేషన్లు వచ్చాయని, ఆగస్టు 1న కూడా నామినేషన్లు వేసేందుకు అవకాశం ఉన్నందున, ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హత కలిగిన సభ్యులు నామినేషన్లు వేయవచ్చని చెప్పారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికే రేపు ధర్నా

గుంటూరు (విద్య), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ బకాయిలు మంజూరు, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 2న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఫ్యాప్టో (ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) జిల్లా ఛైర్మన్ కె.నరసింహారావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ధర్నా సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఫ్యాప్టో అధ్యక్ష కార్యదర్శులు కె.నరసింహారావు, పి.రాజనేయులు, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ యు.రాజశేఖర్, డీకే సుబ్బారెడ్డి, ఎండీ ఖలీల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.బసవలింగారావు, ఎండీ సాలార్ బేగ్, బాలాజీ, సీనియర్ ఉపాధ్యాయ నాయకులు విజయసారథి తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించాలని, యాప్‌ల భారం తగ్గించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని, ఆర్థిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



ధర్నాకు సంఘీభావం ప్రకటిస్తున్న ఫ్యాప్టో నాయకులు

రాష్ట్ర పోటీలకు జిల్లా అథ్లెటిక్స్ జట్టు

గుంటూరు (క్రీడలు) జూలై 31 (ఆంధ్రజ్యోతి) చీరాలలో ఈనెల 9 నుండి 10వ తేదీ వరకు జరగనున్న రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనే అండర్-18, 20 బాలబాలికల జిల్లా జట్టును అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 9వ తేదీన ఉదయం 6 గంటలకు చీరాలలోని వీఆర్ఎస్ వైఆర్ఎన్ కళాశాల క్రీడా మైదానంలో ఆధార్ కార్డు, తమ వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు అండర్ 18 విభాగంలో డి.శివాజీ షేక్ మస్తాన్ వలి, జీవి నాగరాజు, ఆర్.తేజ అశ్విన్, బీహెచ్ చైతన్య, టీ రోహిత్ వెంకట సాయి, పి.అభిషేక్, కె.వి వసంత చరణ్, జి.శ్రీనివాసరావు, బి.వంశీ, ఆర్.శ్రీనివాస్ నాయక్, జి.వరుణ్ కుమార్, పివి శివ చరణ్, పి.రిత్విక్ రెడ్డి, సిహెచ్ ఆంజనేయులు, ఎన్.లోకేంద్ర, బాలికలలో ఎం.దీప్తి రెడ్డి, సిహెచ్ కరుణ, ఎం.లావణ్య, పి.ఇందుమతి, ఏ.భూమిక, నీలాంబరి, షేక్ సుల్తాన్, డి.సాయి శరణ్య, షేక్ పర్వీన్, ఎండి ఆసియా, రూపులిత పాత్ర, నాజియా భాను అండర్ 20 బాలుర విభాగంలో షేక్ ఆలం, కె ప్రవీణ్ కుమార్, ఎన్.జీవన్, కే బాలు షేక్ రోషన్, షేక్ నూర్ భాషా, షేక్ హమీద్, ఎం మధు, షేక్ అబ్దుల్ అహ్మద్, బాలికల విభాగంలో సిహెచ్ డాలీ, ఎల్ వి ధనలక్ష్మి, షేక్ షాజహాన్, బి ఎం నవ్య శ్రీ, పి.భానుమతి, ఎం.అహల్య ఎంపికయ్యారు

సమాచార హక్కు చట్టం పై అవగాహన

గుంటూరు సిటీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయం కృషి భవన్‌లో గురువారం సమాచార హక్కు చట్టం-2005పై రైతులు, సిబ్బందికి జిల్లా స్థాయి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రాజకుమారి సమాచార హక్కు చట్టం ఉద్దేశ్యం, పౌరులు సమాచారం పొందే విధానం, అధికారుల విధులు, బాధ్యతలపై వివరించారు. చట్టంపై సిబ్బంది అడిగిన అనేక సందేహాలను నివృత్తి చేశారు. పౌరులు ఎవరైనా ఎలాంటి సమాచారమైనా ఓ హక్కుగా పొందగలిగే అవకాశం ఈ చట్టం కల్పిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా కార్యాలయంలో పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి, అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్‌గా సత్యనారాయణ వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అసోసియేట్‌లు, మాస్టర్ ట్రైనర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న చిలుకా చంద్రశేఖర్

అంబానీ, అదానీల కోసమే ఆపరేషన్ కగార్

● పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

గుంటూరు(తూర్పు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): అంబానీ, అందానీలకు మధ్య భారతంలోని ఖనిజ వనరులను దోచి పెట్టేందుకే ఆపరేషన్ కగార్ పేరుతో గిరిజనులను, విప్లవకారులను కేంద్ర ప్రభుత్వం కాల్చి చంపుతుందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ అన్నారు. బ్రాడీపేట, యూటీఎఫ్ హాలులో గురువారం దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం (పీడీఎం) ఆధ్వర్యంలో ఉద్దంసింగ్ 85వ సంస్మరణ సభ జరిగింది. ఈ సభకు పీడీఎం రాష్ట్ర సహాయ కార్యదర్శి జి.రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చిలుకా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో వచ్చే ఏడాది మార్చి 31 నాటికి విప్లవకారులను నిర్మూలిస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటన ప్రజాస్వామికవాదులను ఆందోళనకు గురి చేస్తుందన్నారు. ఉద్దంసింగ్‌ను స్ఫూర్తిగా తీసుకుని పర్యావరణాన్ని, గిరిజనులను రక్షించుకునేందుకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. విరసం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడుస్తున్నా దేశంలో ఆకలి, నిరుద్యోగం, దారిద్ర్యం పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కె.జయసుధ, వి.కోట నాయక్, వై.వెంకటేశ్వరరావు, డి.సుధాకర్, విప్పర్ల ముత్తయ్య, న్యాయవాది సురేష్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు రైల్వే రాయితీలు పునరుద్ధరించాలి

● సంస్థ అధ్యక్షుడు కృష్ణారావు

గుంటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్‌లకు రైల్వేలో రాయితీలు పునరుద్ధరించాలని సీనియర్ సిటిజన్స్ సంస్థ అధ్యక్షుడు సిరసపల్లి కృష్ణారావు కోరారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం జరిగిన సీనియర్ సిటిజన్‌ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా వల్ల ఏర్పడిన ఆర్థిక భారాన్ని పూడ్చుకునేందుకే రైల్వే చార్జీలలో రాయితీ నిలిపివేశామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం కరోనా పోయిన ఇన్నాళ్ళకైనా స్పందించక పోవడం విచారకరమని, వెంటనే వృద్ధులకు రైల్వే రాయితీలు పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి పి భావన్నారాయణ మాట్లాడుతూ బ్రిటన్, కెనడా, జర్మనీ, జపాన్ దేశాలు వృద్ధుల ప్రయాణ అవసరాలను గుర్తించి ప్రత్యేక రాయితీలను కొనసాగిస్తున్నాయని, కేంద్రం ఇప్పటికైనా స్పందించి రాయితీలను పునరుద్ధరించి వృద్ధుల కళ్ళల్లో వెలుగు నింపాలన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం నాయకులు ఆర్.వెంకటరత్నం, వెంకటేశ్వర్లు ప్రసంగించారు.

వరదను తలపిస్తున్న ఏలూరు బజారు

● మూడు వారాలుగా రోడ్డుపైనే మురుగునీరు పారుదల

● దుర్వాసనతో అల్లాడుతోన్న వ్యాపారులు, ముఠా కూలీలు



ఏలూరుబజారులో రాకపోకలకు ఇబ్బందులు పడుతోన్న ప్రజలు

గుంటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): నగరంలోని లాలాపేటలో ఉన్న ఏలూరుబజారులో మురుగునీరు వరద నీటిని తలపిస్తోంది. నెల రోజుల నుంచి లాలాపేట పరిధిలోని ఏలూరుబజారు, హిమని కాంప్లెక్స్ ఎదుట సైడు కాల్వల నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే ఏలూరుబజారులో సైడు కాల్వల నిర్మాణ పనులు చేపట్టటంతో మురుగునీరు, వర్షపునీరు పొంగి రోడ్డుపైకి ప్రవహిస్తోంది. మూడు వారాలుగా ఇదే పరిస్థితి నెలకొన్నదని, దుర్వాసనతో ఉండలేని పరిస్థితులు నెలకొన్నదని వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారాల దుకాణాల కోసం డ్రెయిన్‌పై నుంచి రాకపోకలకు చెక్క బల్లలు ఏర్పాటు చేసుకున్నారు. మరో వైపు నిత్యం ముఠా కూలీలు పనులతో ఇక్కడే రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా మురుగునీటితో కాళ్ళు పాచి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రణాళికా బద్ధంగా లేకపోవటమే సమస్య...

నగరపాలక సంస్థ అధికారులు ఒక ప్రణాళిక బద్ధంగా లేకపోవటంతోనే అసలు సమస్య ఉత్పన్నమైందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట గాంధీ పార్కు రోడ్డులో వర్షపు నీటిని తరలించేందుకు అక్కడ నుంచి హిమని సెంటర్‌లో డ్రెయిన్ నిర్మించారు. అదే డ్రెయిన్‌ను హిమని కాంప్లెక్స్ ముందు నుంచి ఏలూరు బజారు వరకు డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టారు. ఏలూరు బజారు వరకు వచ్చిన డ్రెయిన్ పనులు పటేల్‌రోడ్డు సెంటర్‌లో నిలిపివేశారు. అక్కడ నుంచి డ్రెయిన్‌లో వచ్చిన మురుగునీరు ముందుకు పోయే పరిస్థితి కనిపించటం లేదు. పైగా అక్కడ చిన్నపాటి కాల్వలే ఉన్నాయి. దాంతో ఇటీవల వర్షాలతో వర్షపునీరు డ్రెయిన్‌లో చేరి నిండుకుంటుందని తెలుస్తున్నాయి. ఆ డ్రెయిన్‌లో నీరు ముందుకు పోయే పరిస్థితి లేక రహదారులపై వరదలా తలపిస్తున్నాయి. మురుగునీరు సాఫీగా వెళ్లిపోయేలా కాల్వలు నిర్మించి, రోడ్డుపైకి చేరకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



డ్రెయిన్‌లపై రాకపోకలకు చెక్కలు ఏర్పాటు చేసుకున్న వ్యాపారులు

అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ అందాలి

● కలెక్టర్‌కు సీఎం చంద్రబాబు ఆదేశాలు



సీఎం చంద్రబాబు నిర్వహించిన వీసీకి హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్క రైతుకు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఆర్థికసాయం అందేలా చూడాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని సీఎం చంద్రబాబునాయుడు ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి సీఎం 'అన్నదాత సుఖీభవ' అమలు సన్నద్ధతపై సీఎస్ విజయానంద్, ఆర్థిక, రెవెన్యూ, జలవనరులు, వ్యవసాయ శాఖల ఉన్నతాధికారులతో కలసి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఆగస్టు 2న అన్నదాత సుఖీభవ పథకం అమలు కార్యక్రమం పండుగ వాతావరణంలో జరగాలని, గ్రామ సచివాలయం నుంచి పంచాయతీలు, మండల కేంద్రాలు, నియోజకవర్గ కేంద్రాల స్థాయిలో ఈ కార్యక్రమం నిర్వహించాల న్నారు. గత ప్రభుత్వం అన్ని వ్యవస్థలను ఛిన్నాభిన్నం చేసిందని, నాడు ఆర్థిక విధ్వంసం జరిగిందని, ప్రతి వ్యవస్థను పునర్నిర్మిస్తూ ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రయత్ని స్తున్నామన్నారు. రైతులకు హామీ ఇచ్చినట్టుగానే 'అన్నదాత సుఖీభవ'ను అమలు చేసి చూపించామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్‌లోని శంకరన్ మినీ సమావేశ మందిరం నుంచి కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ, సీపీఓ శేషశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

గుంటూరు(తూర్పు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతగుంటూరు, సరస్వతి శిశు మందిర్‌కు యూనియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు వాటర్ కూలర్ వితరణ చేశారు. మరో ఉద్యోగి రవికుమార్ విద్యార్థులకు క్రీడా దుస్తులకు అందజేశారు. అనంతరం జరిగిన సభలో ఉద్యోగులు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తరువాత సామాజిక సేవల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులందరూ చక్కగా చదువుకుని తల్లి దండ్రులకి, గురువులకి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విశ్రాంత ఉద్యోగులు ఎం.శ్రీనివాసరావు, ఐఎస్ఎస్ మూర్తి, రామకృష్ణ, బాలపద్మజ, చెన్నకేశవరావు, వై.శ్రీనివాసరావు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రీడా దుస్తులను అందుకున్న విద్యార్థులతో యూనియన్ బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు

ఆసక్తికరంగా రోప్ స్కిప్పింగ్ పోటీలు

గుంటూరు(తూర్పు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): రోప్ స్కిప్పింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామం, గీతాంజలి సీబీఎస్ఈ పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాల కరస్పాండెంట్ రమాదేవి, ప్రిన్సిపల్ దీనకుమారి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన పోటీలలో కింగ్ ఎమ్మి ఫిట్‌నెస్ సెంటర్ జట్టు విజేతగా నిలిచింది. రెండు, మూడు స్థానాలను వెస్ట్ బెర్రీ పాఠశాల (తెనాలి), గీతాంజలి పాఠశాల(కుంచనపల్లి) కైవసం చేసుకున్నారు. అనంతరం విజేతలకు అతిథులు సర్టిఫికెట్స్ పతకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపల్ మౌనిక, అసోసియేషన్ కార్యదర్శి తిరుపతిరావు, అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఇమ్మానియేల్, రాజు పాల్గొన్నారు.

సదుపాయాల కల్పనకు ఆర్థిక తోడ్పాటు

గుంటూరు(తూర్పు), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శౌచాలయాల అభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు తరపున రూ.3.80 లక్షల చెక్కును కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి గురువారం అందించారు. కలెక్టరేట్‌లో పనిచేసే సిబ్బందికి, ప్రజలకు మెరుగైన సౌకర్యాల కోసం బ్యాంకు సామాజిక బాధ్యతగా ఈ సహకారం అందించినట్లు బ్యాంక్ ఛైర్మన్ కె.ప్రమోద్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ హరీష్ బేతా, ఎల్‌డీఎం మహిపాల్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వాసుదేవకుమార్ పాల్గొన్నారు.



కలెక్టర్ ఎస్.నాగలక్ష్మికి చెక్కును అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్‌ల నిర్వహణలో భాగంగా ఉద్యోగ నగర్, ఎస్‌వీఎన్ కాలనీ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ ఎన్.గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అలానే చంద్రమౌళీనగర్‌లో చెట్ల కొమ్మలు తొలగించటంలో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు వరకు చంద్రమౌళీనగర్, ఎన్టీఆర్ స్టేడియం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్ సిబ్బంది సేవలు భావితరాలకు ఆదర్శం

● ఘనంగా సత్కరించిన ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సుదీర్ఘ కాలం పోలీస్ శాఖ ద్వారా ప్రజలకు మీరందించిన సేవలు ఆదర్శనీయమని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. ఈ మేరకు గురువారం ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని ఆయన పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్సైలు ఆర్.మోహన విజయకుమార్, నాగ రాజేశ్వరి దేవి, ఏఎస్సైలు ఎస్.భగవంతరావు, ఎన్.కొండలరావు, హెడ్ కానిస్టేబుళ్లు వి.పోలయ్య (ఏఆర్), వై.రాంబాబు (సివిల్) తదితరులు ఉన్నారు. ఎస్పీ మాట్లాడుతూ గతంలో ఉన్న నక్సలిజం, రవాణా సౌకర్యాల కొరత, ఇతర సవాళ్ల మధ్య ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించారని తెలిపారు. ఈ సేవల వెనుక కుటుంబ సభ్యుల త్యాగం, సహకారం ఎంతో ఉందని అభినందించారు. మీరు అందించిన సేవలు భావితరాలకు ఆదర్శంగా నిలుస్తాయని, మీ కుటుంబ సభ్యులతో శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని కోరుకుంటున్నట్లు ఎస్పీ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఆర్‌ఐలు ఏడుకొండలురెడ్డి, సురేష్, శ్రీహరిరెడ్డి, శివరామ కృష్ణ, రాష్ట్ర పోలీస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు దళవాయి. సుబ్రహ్మణ్యం, జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు మైలా సాంబశివరావు, పోలీసులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సత్కరిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నగరంలో ఈ నెల 17, 18 తేదీలలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట మల్లయ్యలింగం భవన్లో గురువారం జరిగిన కమిటీ, ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభల్లో భాగంగా 17న బీఆర్ స్టేడియం నుంచి ర్యాలీ, విజయ థియేటర్ స్థలంలో బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. 18న ప్రతినిధులు సభ మల్లయ్య లింగం భవన్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి, సహాయ కార్యదర్శి అకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, మంగమ్మ, కోటేశ్వరరావు, బాలయ్య, సద్గుణ రావు, రాజా, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి



శాస్త్రీయ సంగీత కచేరిలో పాల్గొన్న బెజవాడ భువనేశ్వరి బృందం

గుంటూరు(తూర్పు), జూలై 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలో అన్నమయ్య కళావేదికపై జరుగుతున్న సంగీత నృత్యోత్సవాలలో భాగంగా గురువారం సంస్థ వారు, ఆలయ పాలకమండలి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. తొలుత ముప్పవరపు వెంకట సింహాచల శాస్త్రిచే వాగ్గేయకారుల భక్తి వైభవం అనే అంశంపై జరిగిన ధార్మికోపన్యాసం భక్తులను ఆకట్టుకుంది. అనంతరం బెజవాడ భువనేశ్వరి బృందంచే శాస్త్రీయ సంగీత కచేరి సంగీతాభిమానులను అలరించింది. వీరికి వయోలిన్‌పై చావలి శ్రీనివాస్, మృదంగంపై బి.సురేష్‌బాబు చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. ఈ సందర్భంగా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంస్థ కార్యదర్శి వెంకటరమణ కళాకారులను అతిథులను ఘనంగా సత్కరించారు.



సుపరిపాలన కరపత్రాలను ప్రజలకు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్

ప్రతి ఇంటికి పెద్ద కొడుకు చంద్రబాబు

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

● పదకొండో డివిజన్లో సుపరిపాలనలో తొలి అడుగు

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల ద్వారా అవ్వతాతలను సీఎం చంద్రబాబు నాయుడు పెద్ద కొడుకులా ఆదుకుంటున్నారని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నియోజకవర్గంలోని 11వ డివిజన్‌లో గురువారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలందరినీ పలకరిస్తూ ప్రభుత్వ పాలనపై అభిప్రాయాలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వృద్ధాప్యంలో పేద పెద్దలు ఎవరి మీద ఆధారపడకుండా ప్రభుత్వం ద్వారా వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. తూర్పు నియోజకవర్గంలో నందివెలుగు బ్రిడ్జి నిర్మాణం అభివృద్ధికి ప్రతీకగా ఉందని అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నందివెలుగు బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదని, అభివృద్ధిపై అప్పటి నాయకులకు ఉన్న చిత్తశుద్ధి ఏంటో ప్రజలందరికీ తెలుసునని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ సింగపూర్ పర్యటన ద్వారా రాష్ట్రానికి పెట్టుబడుల వరద రాబోతోందని, ఆది రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం మారనుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ జాదా, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, క్లస్టర్ ఇన్‌చార్జ్ పఠాన్ జహీర్, డివిజన్ అధ్యక్షుడు ఉస్మాన్, మజారుద్దీన్, ముజీబ్, మల్లికా, అమనుల్లా ఖాన్, ఇలియాజ్, ఆదిల్, సల్మా, ట్రైలర్ జానీ, శంషుద్దీన్, ఆటో జానీ, దేవా, చిన్న ఇలియాజ్, ఖలీల్ బాయ్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు అండగా నిలుద్దాం

బంగారు కుటుంబాలను ఆదుకుంటే చిన్న సాయమైనా వారి జీవన పురోభివృద్ధికి బాటగా నిలుస్తుందని ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పీ- 4 కార్యక్రమానికి సంబంధించి మార్గదర్శకులను గుర్తించేందుకు మునిసిపల్ ఆడిటోరియంలో నగరంలోని వివిధ కార్పొరేట్ హాస్పటల్స్ వైద్యులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 25 వేల బంగారు కుటుంబాలను గుర్తించామని, వారికి బాసటగా నిలిచేందుకు మార్గదర్శకులుగా వైద్యులు ముందుకురావాలని కోరారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా ఆర్థిక అంతరాలను తగ్గించవచ్చని తెలిపారు.

టీడీపీలో చేరిన రిటైర్డ్ ఏఎస్ఐ

రిటైర్డ్ ఏఎస్ఐ గుడిపల్లి ఏడుకొండలు గురువారం ఎమ్మెల్యే నసీర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

జగన్ చేసిన నేరాలకు మన దేశ చట్టాలు సరిపోవు

● టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి



కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జూలై 31(ఆంధ్రజ్యోతి): జగన్ చేసిన నేరాలకు మన దేశ చట్టా లు సరిపోవని టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లా డారు. వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డిని మించిన అవినీతిపరుడు భారతదేశ రాజకీయాల్లో మరొకరు లేరని విమర్శించారు. చట్టాల్లో ఉన్న లొసుగులను అడ్డు పెట్టుకొని బతుకీడుస్తున్నాడని, ఆయన చేసిన నేరాలు, ఘోరాలకు మరో దేశంలో అయితే ఈ పాటికే ఊహకందని తీర్పును అమలు చేసేవారని అన్నారు. జగన్ మద్యం కుంభకోణంలో ఒకసారి అరెస్టు అయితే ఆయన శేష జీవితం జైల్లో ముగిసిపోవాల్సిందేనని అన్నారు. అధికారంలో ఉన్న అయిదేళ్లలో అన్నీ డిస్టిలరీస్, బ్రేవరీలను తరతమ బేధం లేకుండా ఆక్రమించుకొని నాసిరకం మద్యం తయారు చేయించిన ఘనత జగన్‌కే దక్కిందన్నారు. తొమ్మిది దశల్లో శుద్ధి చేయాల్సిన స్పిరిట్‌ని కేవలం ఒక్కసారి మాత్రమే శుద్ధిచేసి, దానికి కేరామిల్ రంగులు కలిపి వేలాది మంది నిరుపేద మద్యం ప్రియుల మరణాలకు కారకులైన జగన్‌రెడ్డిని ఏ న్యాయస్థానాలు రక్షించలేవని తేల్చి చెప్పారు. జగన్ సినిమా ముగిసిపోయినప్పటికీ పదే పదే కార్యకర్తల ఆనందం కోసం ఎల్లుండి ఎలక్షన్, ఆ మరుసటి రోజు నేను సీఎంని అని వైసీపీ సైకో గుంపుని రెచ్చగొడుతూ శునకానందం పొందుతున్నాడని అన్నారు. జగన్‌కు అంత నమ్మకం ఉంటే వైసీపీకి చెందిన 10 మంది ఎమ్మెల్యేలను రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని కనపర్తి సవాల్ విసిరారు.

ఘనంగా ఏఈఎల్‌సీ ఆవిర్భావ దినోత్సవం

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఏఈఎల్‌సీ 184వ ఆవిర్భావ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. 1842 జూలై 31లో ఫాదర్ హెయ్యర్ పెన్సిల్వేనియా దేశం నుంచి క్రీస్తు సువార్త పరిచర్యకై గుంటూరుకు వచ్చి ఏఈఎల్‌సీ ద్వారా పేద ప్రజలకు ఎన్నో సేవలందించారని ఏఈఎల్‌సీ పరిపాలనాధికారి, విశ్రాంత న్యాయమూర్తి పీఎస్ జోసెఫ్ అన్నారు. ఈ సందర్భంగా లాడ్జి సెంటర్‌లోని ఏఈఎల్‌సీ ప్రధాన కార్యాలయంలో గల ఫాదర్ హెయ్యర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఏఈఎల్‌సీ పాలనాధికారులు, విశ్రాంత న్యాయమూర్తులు పీఎస్ జోసెఫ్, ఎన్.జేసురత్నకుమార్ మాట్లాడుతూ ఎక్కడో పెన్సిల్వేనియాలో పుట్టి ఇక్కడకు వచ్చి తన జీవితాన్ని పేద ప్రజలకు అంకితం చేసి క్రీస్తు సువార్త చాటిన ఫాదర్ హెయ్యర్ జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. ఫాదర్ హెయ్యర్ సేవ స్ఫూర్తితో ఉత్తేజితులైన ట్రినిటీ లూథరన్ సంఘ (కుగ్లర్ హాస్పిటల్) ప్రతినిధులైన గ్రేస్ సుదర్శనం, జె.దైవఆశీర్వాదం, బత్తుల లెనిన్‌ల సహకారంతో 50 మంది హెచ్ఐవి బాధిత చిన్నారులకు నెలకు సరిపడే పౌష్టికాహార కిట్‌లను అందించారు.



ఫాదర్ హెయ్యర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విశ్రాంత న్యాయమూర్తులు, ఏఈఎల్‌సీ పాలనాధికారులు జోసెఫ్, జేసురత్నకుమార్

ఎంబీటీఎస్ కళాశాలలో జాబ్ మేళా

గుంటూరు (విద్య), జూలై 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడులోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు మొత్తం 194 మంది నిరుద్యోగ యువత హాజరుకాగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి 54 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోఆర్డినేటర్ సంజీవరావు తెలిపారు. 12 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొన్నాయి.



తల్లిపాలే బిడ్డకు.. మొదటి వ్యాక్సిన్!

● నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు ● బిడ్డకు తొలి పోషణను తల్లికి గుర్తుచేయడమే ముఖ్య ఉద్దేశం

సత్తెనపల్లి/గుంటూరు మెడికల్ జూలై 31(ఆంధ్రజ్యోతి): అవగాహన రాహిత్యం వల్ల చాలా మంది తల్లులు.. తల్లి పాల ప్రాముఖ్యతను గుర్తించ లేక పోతున్నారు. దీనికి కుటుంబ సభ్యుల సహకారం, డాక్టర్ల సలహాలు, నర్సింగ్ కేర్ అవసరం. గర్భధారణ, ప్రసవ సమయంలో ఎదురయ్యే సమస్యలకు గురికాకుండా.. జాగ్రత్తలు తీసుకోవడంతో బ్రెస్ట్ ఫీడింగ్‌పై అపోహలను దూరం చేయడమే తల్లిపాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశం. తల్లిపాల వల్ల కలిగే ప్రయోజనాల పై అవగాహన కల్పించాలని.. ప్రభుత్వం ఏటా ఆగస్టు మొదటి వారం 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తోంది. డబ్ల్యూహెచ్‌వో అంచనాల ప్రకారం ఆరు నెలల వరకు బిడ్డకు తల్లి పాలు ఇవ్వాలి. వీలైతే రెండు సంవత్సరాల వరకు పాలు ఇవ్వడం వల్ల ఆనందకరమైన అనుభూతి తల్లి బిడ్డల మధ్య పెరిగి.. సెక్యూరిటీ ఫీలింగ్ కలుగుతుంది. తల్లి పాలలో బిడ్డ ఎదుగుదలకు అవసరమైన తేలికపాటి జీర్ణమయ్యే పోషకాల నుంచి వారి శారీరక, మానసిక అవసరాలకు తగినట్టుగా మారుతూ ఉంటుంది. బిడ్డకు అవసరమైన తొలి పోషణ, రక్షణకు తల్లి బాధ్యతను గుర్తుచేయడమే తల్లి పాల వారోత్సవాల ముఖ్య ఉద్దేశం.

ఏటా 12లక్షల మంది పిల్లల మరణం

ప్రపంచ ఆరోగ్య సంస్థ గణాంకాల ప్రకారం ప్రపంచంలో వివిధ జబ్బుల బారిన పడి ఏటా 12 లక్షల మంది శిశువులు మరణిస్తున్నారు. పిల్లలకు తల్లిపాలు లభించక పోవడమే ఈ మరణాలకు ప్రధాన కారణమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దేశంలో 1992లో శిశు ఆహార చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. ఇది 1993 ఆగస్టు ఒకటో తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. శిశు ఆహార నియంత్రణ చట్టం అమల్లోకి వచ్చిన ఆగస్టు ఒకటో తేదీ నుంచి 7వ తేదీ వరకు దేశవ్యాప్తంగా తల్లిపాల ప్రోత్సాహక వారోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది వరల్డ్ ఎలయన్స్ ఫర్ బ్రెస్ట్ ఫీడింగ్ నెట్‌వర్క్ (వాబా) "తల్లిపాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వండి.. స్థిరమైన మద్దతు వ్యవస్థలను సృష్టించండి." అనే నినాదం ఇచ్చింది.

చాలామంది తల్లులు తమ పిల్లలకు సరిపడా పాలు ఇవ్వలేక పోతున్నామని మదనపడుతుంటారు. కారణం అనారోగ్య సమస్యలు, ఒత్తిడి, ప్రసవం తరువాత అలసి పోవడం, నీరసంతో ఎక్కువగా నిద్రపోవడం, సరైన ఆహారం తీసుకోక పోవడం, పత్యం ఉండటం పలు కారణాలు. మాత్రలు, మందులు వాడటం కంటే ఆరోగ్యకరమైన సమతుల ఆహారం తీసుకోవడం వల్ల తల్లిపాలు సమృద్ధిగా పడతాయి. శిశువుకు తల్లి పాలు మాత్రమే ఇవ్వడాన్ని ఐబీఎస్ ఫీడింగ్ అంటారు. దీంతో రొమ్ము, అండాశయ క్యాన్సర్, మధుమేహం, గుండె, రక్తనాళాల వ్యాధులు వచ్చే ప్రమాదం తగ్గుతుందని వైద్యులు చెబుతున్నారు. శిశువు ప్రతి రెండు, మూడు గంటలకు పాలు తాగుతుందని పేర్కొంటున్నారు.

శిశు మైత్రి ఆసుపత్రులు

దేశంలో తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహించేందుకు 1991లో దేశంలో బ్రెస్ట్ ఫీడింగ్ ప్రమోషన్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా (బీపీఎన్ఐ) అనే స్వచ్ఛంధ సంస్థ ఏర్పడింది. తల్లి పాల సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఈ సంస్థ పది మార్గదర్శకాలను రూపొందించింది. ఈ సూత్రాలను విజయవంతంగా అమలు చేసే ఆసుపత్రులకు శిశు మైత్రి ఆసుపత్రులు (బేబీ ఫ్రెండ్లీ హాస్పిటల్స్)గా గుర్తింపు ఇస్తారు.

పోషకాలు అందిస్తాయి



తల్లి పాలు శిశువుకు అవసరమైన పోషకాలను అందించడమే కాకుండా వారి పెరుగుదలకు, అభివృద్ధికి కీలకం. తల్లి పాలల్లో లాక్టోజ్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉంటాయి. నార్మల్ డెలివరీ అయిన అరగంట లోపు, సిజేరియన్ అయిన నాలుగు గంటలలోపు వీలైనంత త్వరగా బిడ్డకు తల్లి పాలు ఇవ్వడం ప్రారంభించాలి. చాలా మందిలో బిడ్డ పుట్టిన వెంటనే కొన్ని చుక్కల నుంచి పది మిల్లీ లీటర్ల పసుపు పచ్చని ముర్రు పాలు పడతాయి. వీటిలో శిశువుకు కావాల్సిన ఇమ్యూనిటీని పెంపొందించే యాంటీబాడీస్ ఉంటాయి.

- డాక్టర్ బి.అరుణ, గైనకాలజిస్టు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

వారం రోజులు పట్టవచ్చు



తల్లి బిడ్డకు పాలు ఇచ్చే ప్రక్రియలో ఒకటి నుంచి ఏడు రోజులు పట్ట వచ్చు. దీనికి కంగారు పడాల్సిన అవసరం లేదు. ప్రసవానికి మూడు నెలల ముందే శిశువుకు ఏ విధంగా ఎన్నిసార్లు ఎలా పాలు పట్టాలి, ఎన్ని సార్లు మల, మూత్ర విసర్జన చేస్తారు? పిల్లలు ఎక్కువ సేపు నిద్రపోవడం, ఎలా తాగాలో శిశువుకు తెలియక పోవడం అనే అంశాలపై కౌన్సెలింగ్ తీసుకోవడం అన్ని విధాలా మంచిది. బ్రెస్ట్ ఫీడింగ్ టెక్నిక్స్ ఓర్పు, నేర్పుతో తెలుసుకోవడం చాలా అవసరం.

- డాక్టర్ లక్ష్మణరావు, చిన్న పిల్లల వైద్యులు, ఏరియా వైద్యశాల, సత్తెనపల్లి

తల్లిపాలే బిడ్డకు మొదటి వ్యాక్సిన్



తల్లి పాల వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. పిల్లల భవిష్యత్ ఆశాజనకంగా ఉండాలంటే తల్లి పాలు తాపించడం, చాలా ముఖ్యం. ఈ వారం రోజులు అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది తల్లి పాల ప్రాముఖ్యత గురించి గ్రామాల్లో అవగాహన కల్పిస్తారు. తల్లిపాలు శిశువుల పెరుగుదలకు, అభివృద్ధికి కీలకం. తల్లిపాలను రక్షించడం అనేది ఉమ్మడి బాధ్యత. పుట్టిన బిడ్డకు తల్లి పాలే మొదటి వ్యాక్సిన్.

- ఎం.ఉమాదేవి, ఐసీడీఎస్ పీడీ, పల్నాడు జిల్లా

నేటి నుంచి దీపం-2
ఉచిత సిలిండర్ల బుకింగ్స్ ప్రారంభం

● ఏప్రిల్ - జూలై వరకు 10.94 లక్షల మందికి సబ్సిడీ విడుదల

● రూ. 89.57 కోట్ల నగదు బ్యాంకు ఖాతాల్లో జమ



గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దీపం-2 వంట గ్యాస్ ఉచిత రీఫిల్ సిలిండర్ మూడో విడత బుకింగ్స్ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా గతేడాది దీపావళి పండగ నుంచి ఈ పథకం అమలుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఏడాదికి మూడు వంట గ్యాస్ రీఫిల్ సిలిండర్ల చార్జీలను ప్రభుత్వం సబ్సిడీ కింద జమ చేస్తుంది. ఇప్పటికే రెండు విడతల సబ్సిడీ అర్హులైన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ అయ్యాయి. రెండో విడతలో కొంత ఆలస్యమైనప్పటికీ అర్హుల్లో కొద్దిమందికి మినహా అందరికి సబ్సిడీ నగదు జమ జరిగింది. దీంతో నేటి నుంచి మూడో విడత లబ్ధి పొందేందుకు లబ్ధిదారులు రీఫిల్ సిలిండర్ల బుకింగ్‌లకు సిద్ధమయ్యారు.

● గుంటూరు జిల్లాలో ఏప్రిల్ మొదలుకొని జూలై నెలాఖరు వరకు 3,95,775 రీఫిల్ సిలిండర్ల డెలివరీలు లబ్ధిదారులకు జరిగాయి. ఇందులో 3,78,562 మందికి సబ్సిడీ నగదు కింద రూ. 32,20,51,966 విడుదల చేసింది. బ్యాంకు ఖాతాలు సవ్యంగా ఉన్న 3,78,161 మందికి రూ. 32,17,08,233 నగదు జమ జరిగింది.

● పల్నాడు జిల్లాలో 4,08,835 రీఫిల్ సిలిండర్ల డెలివరీలు జరిగాయి. ఇందులో 3,91,853 మందికి రూ. 33,49,93,519 నగదుని ప్రభుత్వం విడుదల చేసింది. కాగా 3,91,306 మందికి రూ. 33,45,24,857 నగదు జమ చేశారు.

● బాపట్ల జిల్లాలో 2,90,137 రీఫిల్ సిలిండర్లను గ్యాస్ కంపెనీలు డెలివరీ చేశాయి. ఇందులో 2,80,328 మందికి రూ.23,88,87,256 నగదుని ప్రభుత్వం విడుదల చేసింది. అన్ని సవ్యంగా ఉన్న 2,79,803 మందికి రూ. 23,84,36,666 నగదు జమ చేయడం పూర్తి అయింది.

సిలిండర్ ధర పెరిగినా..

కేంద్ర ప్రభుత్వం గత నాలుగు నెలల వ్యవధిలో వంట గ్యాస్ రీఫిల్ సిలిండర్ ధరని పెంచింది. దీంతో రూ. 827.50 నుంచి రూ. 877.50లకు సిలిండర్ ధర పెరిగింది. ఇలా రీఫిల్ సిలిండర్ ధర పెరగడం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా రూ. 5.47 కోట్ల భారం ప్రభుత్వంపై పడింది. అయినప్పటికీ ఎలాంటి కోతలు పెట్టకుండా ప్రతి ఒక్కరికి ఆ నగదుని ప్రభుత్వం జమ చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. కాగా నేటికీ కొంతమంది తమ బ్యాంకు ఖాతాలను ఎన్‌పీసీఐకి సరిగా లింకు చేయించుకోలేదు. అలాంటి లబ్ధిదారులకు నగదు జమ కావడం లేదు. ఆయా బ్యాంకులకు వెళ్లి లబ్ధిదారులు ఎన్‌పీసీఐకి లింకు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ముగ్గురు దొంగలు..మహా ముదుర్లు



నిందితులతో వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు, సిబ్బంది

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లోని గృహాల్లో దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులను పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. నల్లచెరువు 9వ లైన్‌లో ఉంటున్న ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ వెంకీ, అతని అన్న తమ్మిశెట్టి మణికంఠ, నల్గొండ జిల్లా పెద్ద అడిచర్లపల్లి మండలం రంగారెడ్డిగూడేనికి చెందిన ఊరడి జనార్దన్ అలియాస్ జానీ అనే ముగ్గురు స్నేహితులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.25 లక్షల విలువైన రెండు కార్లు, ఆటో, టీవీ, 104 అమెరికా డాలర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గురువారం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లోలో వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు నిందితులను మీడియా ఎదుట హాజరపరిచి, వివరాలు వెల్లడించారు. డీఎస్పీ వివరాల మేరకు.. ముగ్గురు దొంగలు బృందంగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన చోరీ కేసులో అక్కడి పోలీసులు ఈ ముగ్గురుని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. నిందితులు జూన్ 23న అనకాపల్లి సబ్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ మరుసటి రోజు తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, అన్న మణికంఠ, జనార్దన్, ఉప్పాల సురేష్ అనే నలుగురు కలిసి పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని కృష్ణ నగర్ నాలుగో లైన్‌లోని బాలాజీ ప్రొడక్ట్స్ కార్యాలయంలో చోరీకి పాల్పడ్డారు. లక్ష రూపాయల నగదు, 104 అమెరికా డాలర్లు దొంగిలించారు. ఈ నెల 12న నగరంలోని అమరావతి రోడ్డులో గల నగరాలులో ఓ ట్రావెల్స్ వద్దకు వెళ్లి.. ట్రయల్ రన్ పేరుతో కారుని తీసుకుని ఉడాయించారు. ఈ నెల 18న బాపట్ల జిల్లా ఈపూరుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంటిలో చోరీ చేసి టీవీ, రోల్డ్ గోల్డ్ గాజులు అపహరించుకుపోయారు. పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన చోరీ కేసులో ఎస్సై టి.సుబ్బారావు, ఏఎస్సై ఎం.అంతోని, హెడ్ కానిస్టేబుల్ కె.కోటేశ్వరరావు, కానిస్టేబుల్ వై.మాణిక్యరావు ముందస్తు సమాచారం మేరకు బుధవారం వై జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఆటోలో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా.. తమ దొంగతనాలను వెల్లడించారు. నిందితులను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అభినందించారు.

సునామీ సన్నద్ధతపై మాక్ ఎక్సర్‌సైజ్



వర్చువల్‌గా మాక్ ఎక్సర్‌సైజ్‌ను పర్యవేక్షిస్తున్న అధికారులు

తాడేపల్లి (కుంచనపల్లి), జూలై 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ (ఎన్‌డీఎంఏ), ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ (ఐఎన్‌సీవోఐఎస్), ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీ ఎంఏ) సంయుక్త ఆధ్వర్యంలో సునామీ సన్నద్ధతపై గురువారం మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. 12 కోస్తా జిల్లాల్లోని ప్రభావిత మండల, గ్రామ స్థాయి అధికారులతో గురువారం రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి ఈ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విపత్తుల నిర్వహణ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్ ఎన్‌డీఎంఏ సెక్రటరీ, సభ్యులు, ఇన్‌కోయిస్ అధికారులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకట దీపక్ మాట్లాడుతూ సునామీ తుపాను పట్ల అధికారులు సంసిద్ధంగా ఉండాలని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఈస్ట్ కోస్ట్ రాష్ట్రాలలో సునామీ సన్నద్ధతపై మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించిందన్నారు. ఎస్‌వోపీ అమలు చేయడం అందుబాటులోని వనరులు, సౌకర్యాలు, సాంకేతికతను ముందుగానే తెలుసుకోవడం ద్వారా ప్రమాద స్థాయి తగ్గించుకోవచ్చన్నారు. సునామీ సంభవించినప్పుడు సమర్థంగా ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయి అధికారులకు ఈ డ్రిల్ ఉపయోగపడుతుందన్నారు. సునామీ, తుపానుల సమయంలో ఆహారం, నీరు పునరావాసం, వైద్యం వంటి ప్రాథమిక అవసరాలు ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు వివరించారు. సేఫ్ రూట్ మ్యాప్, పవర్ బ్యాకప్ వంటి సదుపాయాలు సునామీ ప్రణాళికలను వివరించగా, మిగతా రాష్ట్రాలు దీన్ని అమలు చేయాలని ఎన్‌డీఎంఏ సెక్రటరీ సూచించారు. మాక్ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా ఇన్‌కోయిస్ సునామీ హెచ్చరికలు జారీ చేసిందని.. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జిల్లా అధికారులకు సునామీ హెచ్చరికలు జారీ చేసే విధానం మండల స్థాయి అధికారులకు సమాచారం చేరవేయడం ప్రత్యక్షంగా చూపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, పోలీసు, ఫైర్, ప్రభుత్వ లైన్ డిపార్టుమెంట్ అధికారులు పాల్గొన్నారు.

పీ4 నీడ్ అసెస్‌మెంట్ సర్వేలో..
అంతా తికమక

● ఏవి పడితే అవి టిక్కులు కొడుతున్న సచివాలయాల సెక్రెటరీలు

● ఆర్థికంగా సహకరించేందుకు ముందుకు రాని దాతలు

● వాళ్లకు ఏవేవో చెప్పి మార్గదర్శులుగా మ్యాపింగ్

గుంటూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల నుంచి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా కొనసాగుతోన్న పీ4 నీడ్ అసెస్‌మెంట్ సర్వే అంతా గజిబిజి గందరగోళంగా మారింది. ఇందుకోసం ప్రభుత్వం పంపిన ప్రొఫార్మాతో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది ఇంటింటికి వెళ్లి బంగారు కుటుంబాలు, మార్గదర్శులను సర్వే చేస్తున్నారు. హౌస్‌హోల్డ్ నంబరు ఆధారంగా ఈ సర్వే చేపడుతున్నారు. కుటుంబ వార్షికాదాయం, ఆస్తులు ఏమున్నాయో చెప్పమంటున్నారు. అలానే సూపర్ సిక్స్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ భరోస పింఛన్, దీపం(మూడు ఉచిత గ్యాస్‌సిలిండర్లు సంవత్సరానికి), తల్లికి వందనంలో లబ్ధి పొందుతున్నట్లు అయితే వాటిని వివరిస్తున్నారు. ఇక ఆ తర్వాత అసలు సర్వే చేపడుతున్నారు. భవిష్యత్తులో మీ ఆదాయం పెరగడానికి అత్యవసరంగా కావాల్సింది ఏంటని చాంతాండంత జాబితాను చదువుతున్నారు. ఉత్తమ ఉద్యోగ అవకాశాలు రక్షణ కోరుకొంటున్నారా, చిన్న వ్యాపారాల విస్తరణని ఆశిస్తున్నారా, కంప్యూటర్, మార్కెటింగ్, బిజినెస్‌లో వృత్తి నైపుణ్యం అవసరమా, ఉన్నత చదువులకు ఆర్థిక సాయం కోరుకొంటున్నారా, స్కాలర్‌షిప్‌లు రావాలని ఆశిస్తున్నారా అని ప్రశ్నలు సంధిస్తున్నారు. వ్యవసాయ ఆదాయంలో పెరుగుదల కోసం ఎవరైనా ఊతమివ్వాలని కోరుకొంటున్నారా, వ్యాపారాలకు రుణ సదుపాయం కోరుతున్నారా, వ్యక్తిగత/కుటుంబానికి వైద్య సదుపాయం ఆశిస్తున్నారా, క్రీడలు వంటి వాటిల్లో శిక్షణ కావాలా అని చెబుతూ ఏదో ఒకటి ఎంపిక చేసుకోవాలంటున్నారు. అలానే భవిష్యత్తులో ఆదాయం పెంచుకోవడానికి రెండో ముఖ్యమైన అవసరం ఏమి ఉండాలని కోరుతున్నారని ప్రశ్నిస్తూ అందుకు పైన పేర్కొన్న వాటిల్లోనే ఏదో ఒకటి చెప్పాలంటున్నారు. ఆ తర్వాత ఏడాదిలో ఏది అత్యవసరంగా కోరుకొంటున్నారో చెప్పాలని, అలానే ఐదు నుంచి పదేళ్లలో ఇంకా ఎలాంటి సాయం కోరుకొంటున్నారో స్పందించాలని కోరుతున్నారు. అనంతరం మార్గదర్శుల వద్దకు వెళుతున్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారుల వద్దకు వెళ్లి పీ4 గురించి వివరిస్తూ బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే చాలామంది ఆర్థిక సాయం అందించేందుకు ముందుకు రావడం లేదు. దీంతో మీరు ఆర్థిక సాయం ఇవ్వాల్సిన అవసరం లేదని, తాము చెప్పేవాటిల్లో సహకరిస్తే చాలని చెప్పి ఒప్పించి మార్గదర్శులుగా మ్యాపింగ్ చేస్తున్నారు. కాగా, గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో దాదాపుగా మూడు లక్షల మందికి పైగానే బంగారు కుటుంబాలను జిల్లా అధికార వర్గాలు ఎంపిక చేశాయి. ఇంతమందిని దత్తత తీసుకోవడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఇందుకోసం వివిధ వర్గాలతో కలెక్టర్లు చర్చలు జరుపుతున్నారు. మార్గదర్శులుగా మ్యాపింగ్ కావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే తొలి ఏడాది స్వల్ప లక్ష్యాలను పెట్టుకొని అందులో లోటుపాట్లను సవరించుకొని ముందుకెళితేనే ఎంతో కొంత ఫలితం ఉంటుందని, అలా కాకుండా కేవలం గణాంకాల కోసం పీ4 కొనసాగిస్తే మాత్రం ఆశించిన ఫలితాలు రావడం కష్టమవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మ్యాజిక్ డ్రెయిన్స్‌పై దృష్టిపెట్టండి



శంకుస్థాపనకు విచ్చేసిన ఎమ్మెల్యే ప్రతిపాటి, కమిషనర్ కృష్ణ తేజకు స్థానికుల స్వాగతం

● కొలకలూరు పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు

● పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ

తెనాలి రూరల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్ని స్వచ్ఛత వైపు నడిపిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో ప్రజలు జీవించేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నట్లు పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ తెలిపారు. గుంటూరు జిల్లా కొలకలూరు గ్రామంలో గురువారం అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. గ్రామంలో పారిశుధ్యంపై రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ బుధవారం మెగా డ్రైవ్ చేపట్టారు. గ్రామంలోని పారిశుధ్యం అధ్వానంగా ఉండటాన్ని స్థానికుల నుంచి తెలుసుకున్న మంత్రి.. శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా పంచాయతీ రాజ్ కమిషనర్ కృష్ణతేజ గ్రామంలో అధికారులతో కలిసి పర్యటించారు. బీసీ కాలనీలో డ్రెయిన్ల దుస్థితిని చూసి, అధికారులకు తగు సూచనలు చేశారు. కాలనీలో మ్యాజిక్ డ్రెయిన్లు(భూమిలో నీరు ఇంకిపోయేలా) నిర్మాణానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలన్నారు. తొలుత 200 నుంచి 300 మీటర్ల వరకూ మ్యాజిక్ డ్రెయిన్లు ఏర్పాటు చేసి నీరు ఇంకుతున్న విధానాన్ని గమనించాలని సూచించారు. ఇది విజయవంతమైతే గ్రామంలో ఈ విధానం ఏర్పాటుకు.. నిధులు అంచనా వేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో.. గ్రామ జనాభా, ఇంటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ పన్ను వంటివాటిని తనిఖీ చేశారు. గ్రామంలో వందలాది దుకాణాలుండగా కొన్నింటికే ట్రేడ్ లైసెన్సులు విధించడాన్ని గుర్తించారు. పూర్తి స్థాయిలో వ్యాపారులు లైసెన్సులు తీసుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, నూతన గృహాలకు వారం రోజుల్లోగా పన్ను వసూలు చేయాలని డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్‌ను ఆదేశించారు. గ్రామంలో తడిచెత్త, పొడి చెత్త వేరుచేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. స్వర్ణ పంచాయతీగా గ్రామాన్ని తీర్చిదిద్దడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని.. అతి స్వల్పకాలంలోనే డ్రెయిన్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు కమిషనర్ కృష్ణ తేజ పేర్కొన్నారు. ఈజీఎస్ (ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్) డైరెక్టర్ షణ్ముఖం, అడిషనల్ కమిషనర్ శివప్రసాద్, డీపీవో నాగ సాయికుమార్, డ్వామా పీడీ శంకర్, గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, ఎంపీడీవో అత్తోట దీప్తి, మంత్రి మనోహర్ కార్యాలయ అధికారులు ఏసురత్నం, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజ

చిలకలూరిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నాడు-నేడు పేరుతో గత పాలకులు విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తే, రాష్ట్ర విద్యా వ్యవస్థను దేశానికే ఆదర్శంగా నిలపాలన్న సత్సంకల్పంతో మంత్రి లోకేశ్ విద్యా శాఖ బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్‌వీఎస్‌సీవీఎస్ హైస్కూల్‌లో రూ.50 లక్షల ఎంపీ నిధులతో మూడు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజతో కలిసి శంకుస్థాపన చేశారు. రాజ్యసభ సభ్యులు విజయేంద్ర ప్రసాద్ ఇందుకోసం ఎంపీ నిధులను కేటాయించారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులను ప్రత్తిపాటి, కృష్ణతేజ పరిశీలించి ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చిలకలూరిపేట విద్యా సంఘం అధ్యక్ష కార్యదర్శులు తేళ్ల సుబ్బారావు, మైలవరపు శివానందకుమార్, బేతంచర్ల కోటేశ్వరరావు, తేలప్రోలు వీరయ్య చౌదరి, టీడీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఓవరాల్ చాంపియన్స్ 'కడప క్లస్టర్'

●ముగిసిన దక్షిణ భారత నవోదయ విద్యార్థుల యోగా పోటీలు



ఓవరాల్ చాంపియన్‌షిప్ పొందిన కడప క్లస్టర్ విద్యార్థులు

చిలకలూరిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులపాటు చిలకలూరిపేట మండలం జవహర్ నవోదయ విద్యాలయలో నిర్వహించిన దక్షిణ భారత దేశ స్థాయి విద్యార్థుల యోగా పోటీలు గురువారం ముగిసాయి. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పాండిచ్చేరి రాష్ట్రాలకు చెందిన 77 నవోదయ విద్యాలయాల విద్యార్థులు 278 మంది ఈ పోటీలలో పాల్గొన్నారు. వివిధ విభాగాలుగా నిర్వహించిన ఈ పోటీల్లో కడప క్లస్టర్ నవోదయ విద్యార్థులు ఓవరాల్ విన్నర్స్ చాంపియన్‌షిప్ గెలుపొందగా.. కృష్ణా క్లస్టర్ విద్యార్థులు రన్నర్స్‌గా నిలిచారు. వివిధ క్లస్టర్ల నుంచి నవోదయ జాతీయ యోగా పోటీలకు ఎంపికైన 21 మంది విద్యార్థులు, 21 మంది విద్యార్థినులను మెడల్స్, సర్టిఫికెట్లతో సత్కరించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పల్నాడు జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ బి.రవి పాల్గొని, మాట్లాడుతూ యోగా ఇప్పుడు దేశ విదేశాలలో ఎంతో మందిని ఆకర్షిస్తోందన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి ఉత్తమ సాధనం యోగా అని చెప్పారు. విద్యాలయ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు. కాగా ఆగస్టు 28, 29, 30 తేదీల్లో నవోదయ విద్యార్థుల జాతీయ స్థాయి యోగా పోటీలు కూడా మద్దిరాల జవహర్ నవోదయ విద్యాలయాలోనే నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపల్ నరసింహారావు తెలిపారు.



రన్నర్స్ గా నిలిచిన కృష్ణా క్లస్టర్ విద్యార్థులు

కార్మికులకు పెన్షన్ పునరుద్ధరణపై హర్షం

● మంత్రి, ఎమ్మెల్యే, సీఆర్డీఏ కమిషనర్‌కు ధన్యవాదాలు



మందడంలో స్వీట్లు పంపిణీ చేసుకుంటున్న పారిశుధ్య కార్మికులు, సీఐటీయూ నాయకులు

తుళ్లూరు, జులై 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం రాజధాని అమరావతి జీవన భృతి పెన్షన్ రూ. 5 వేలను పారిశుధ్య కార్మికులకు రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం జీవో నంబరు 121 ద్వారా పెన్షన్ అమలు చేస్తున్నట్లు ఆర్డర్ ఇచ్చింది. ఆగస్టు 1న పింఛన్ డబ్బులను నేరుగా అందజేయనుంది. ఈ మేరకు గురువారం కార్మికులు స్వీట్లు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. స్థానిక శాసన సభ్యులు తెనాలి శ్రావణ్, రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ, సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకు సీఐటీయూ నాయకుడు ఎం.రవి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఐక్యంగా పోరాడి పెన్షన్ అమలు చేయించుకున్నామని ఆయన పేర్కొన్నారు. ఆశా వర్కర్లకు, అంగన్ వాడీ సిబ్బందికి కూడా పెన్షన్ అమలు చేయడం హర్షణీయమన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు, పారిశుధ్య కార్మికులకు, అంగన్‌వాడీలకు, ఆశా వర్కర్లకు అమరావతి జీవన భృతి పెన్షన్ ఎత్తి వేసి దారుణంగా వ్యవహరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఆలకించుకొని పెన్షన్ పునరుద్ధరించడం.. ఆనందదాయకమన్నారు. అయితే కొంత మంది పేర్లు సాంకేతిక కారణాలు రీత్యా అర్హత లిస్టులో లేవని, దీనిపై అధికారులు దృష్టి పెట్టి అటువంటి వారికి వెంటనే పెన్షన్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశుధ్య కార్మికులకు నెలకు రూ. 12 వేలు కాకుండా మున్సిపల్ కార్మికులకు ఇస్తున్న విధంగా జీవో నంబరు 36 ప్రకారం రూ. 21 వేలు జీతం అమలు చేయాలని కూటమి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 7 నెలల పెండింగ్ పెన్షన్ కూడా అమలు చేయాలని విన్నవించారు.

ఆంజనేయుడికి ఆకుపూజ ఎందుకు చేస్తారు?

ఆంజనేయుడు జ్యోతి స్వరూపుడు. ఆయనను పూజిస్తే కష్టాలు, అవరోధాలు తొలగిపోతాయని, ముఖ్యంగా ఏలినాటి శని ప్రభావం తగ్గుతుందని నమ్మకం ఉంది. అందుకే ప్రతి మంగళవారం, శనివారం ఆయనకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. హనుమంతుడికి ఎంతో ఇష్టమైన తమలపాకులతో పూజ చేసి, మాలవేసి అలంకరిస్తే మనోభీష్టాలు నెరవేరుతాయనేది భక్తుల విశ్వాసం. ఆయనకు తమలపాకులతో పూజ ఎందుకు చేస్తారో తెలిపే కథలు కొన్ని ఉన్నాయి.

తెలుసుకుందాం



ఒక కథ ప్రకారం... రావణుడు మాయ లేడిని పంపి సీతమ్మను అపహరించడంతో... శ్రీరాముడు ఆమె కోసం అన్వేషణ ప్రారంభించాడు. ఆ అన్వేషణలో సాయపడిన ఆంజనేయుడు నూరు యోజనాల నిడివి ఉన్న సముద్రాన్ని దాటి... లంకలోని అశోకవనాన్ని చేరుకున్నాడు. సీతమ్మను దర్శించిన తరువాత... ఆ సంగతి శ్రీరాముడికి చెప్పాలని బయలుదేరాడు. అప్పుడు సీతమ్మ ఆయనను ఆశీర్వదించాలనుకుంది. ఆ వనంలోని పువ్వులు చేతికి అందకపోవడంతో... అందుబాటులో ఉన్న తమలపాకును కోసి, దాన్ని ఆంజనేయుడి తలపై ఉంచి దీవించింది. అందుకే ఆయనకు తమలపాకు ప్రీతిపాత్రమైందని చెబుతారు. సీతమ్మ దగ్గర సెలవు తీసుకొని బయలుదేరిన ఆంజనేయుడు... ఆకాశమార్గంలో వయనిస్తూ హూంకరించాడు. అది విన్న వానరులకు... ఆయన సీతమ్మ జాడ తెలుసుకొనే వస్తున్నాడని అర్థమైంది. ఆయన రాగానే వారు తమలపాకు తీగలతో సత్కరించారు. దానికి హనుమంతుడు ఆనందంతో ఉప్పొంగిపోయాడు. కాబట్టి తమలపాకు మాల వేస్తే స్వామి పరమానందం చెంది, దీవెనలు పుష్కలంగా అందిస్తాడని ప్రజల నమ్మకం.

మరో కథనం ప్రకారం... ఒకసారి సీతమ్మతల్లి అందిస్తున్న తమలపాకు చిలకలను శ్రీరాముడు సేవిస్తున్నాడు. అప్పుడు అక్కడికి వచ్చిన ఆంజనేయుడు "స్వామీ! ఏమిటది? మీ నోరు అంత ఎర్రగా ఎందుకయ్యింది?" అని అడిగాడు. "తమలపాకులు తింటే నోరు ఎర్రగా అవుతుంది. అంతేకాదు, ఇది ఆరోగ్యానికి చాలా మంచిది" అని చెప్పాడు శ్రీరాముడు. వెంటనే ఆంజనేయుడు అక్కడి నుంచి వెళ్ళి... తన శరీరమంతా తమలపాకులు కట్టుకొని, నర్తిస్తూ ఆనందించాడు. అప్పటి నుంచి ఆయన ఎక్కువగా తమలపాకు తోటల్లో, అరటి తోటల్లో విహరిస్తాడని ప్రతీతి. ఆంజనేయుడు రుద్రాంశ సంభూతుడు కాబట్టి తమలపాకులు ఆయనకు శాంతిని ఇస్తాయి. అలాగే తమలపాకులకు మరో పేరు నాగవల్లీ దళాలు. తమలపాకులతో స్వామిని పూజించి, సుందరకాండ, హనుమాన్ చాలీసా పారాయణ చేయడం వల్ల, స్వామికి తమలపాకుల హారాన్ని అలంకరించడం వల్ల మంత్ర సంబంధమైన పీడలు తొలగిపోతాయని, శనీశ్వరుడి అనుగ్రహం కలుగుతుందని, నాగదోష శాంతి చేకూరుతుందని, సకల శుభాలు, ఆయురారోగ్యాలు చేకూరుతాయని, కార్యాల్లో విజయం లభిస్తుందని పెద్దలు చెప్పారు.

• సి.ఎన్.మూర్తి
8328143489

ఏ పురాణాన్ని విన్నా, వినిపించినా, చదివినా, చదివించినా... ఆ కథలో దాగిన అంతరార్థాన్ని తెలుసుకోవాలి. దాన్ని మన జీవితానికి అన్వయించుకోవాలి. తప్పకుండా అన్వయించుకోవలసిన కథలు కొన్ని ఉన్నాయి. వాటిలో గౌరీ శంకరుల కథ ఒకటి.

విశేషం



గౌరీ శంకరుల కథ... వధూవరులకు పాఠం

తపస్సు చేస్తున్న గౌరీ దేవి దగ్గరకు శంకరుడు మాయా బ్రహ్మచారి రూపంలో వచ్చాడు. గౌరి పక్కనే ఉన్న చెలికత్తె అతణ్ణి చూసి " నువ్వెరు? దేనికోసం వచ్చావు?" అని అడిగింది.

"ఏం లేదు! ఈమె ఇంత కఠోరమైన తపస్సు చేస్తోంది కదా? దేనికోసం?" అని అడిగాడు.

"శంకరుణ్ణి పతిగా పొందడం కోసం" అని ఆమె చెప్పింది.

అతను బిగ్గరగా నవ్వుతూ "ఇదేం పిచ్చితనం? తన తల్లితండ్రులెవరో ఆ శంకరుడికే తెలీదు. ఏదైనా పొరపొచ్చెం వస్తే అటువైపు నుంచి ఆమెకు దిక్కెవరు? పోనీ... ఉండేందుకు ఇల్లుందా? అంటే... శ్మశానం ఆయన నివాస స్థలం. చుట్టపక్కాలు ఎవరైనా వచ్చిపోతూ ఉంటారా? అంటే... వచ్చేవాళ్ళందరూ ఏడుస్తూ వస్తారు, దిగాలుగా వెళ్తూ ఉంటారు. మరెప్పుడూ ఇక్కడకు రాకుండా ఉంటే బాగుండుననుకుంటారు. అతని ఇంటికి (నివాసానికి) వెళ్ళే మార్గాన్ని చూద్దామా? ఆ దారి మొత్తం చనిపోయిన వ్యక్తుల తాలూకు వారి తలలు గొరిగిన వెంట్రుకలతో, తడిపేసిన వస్త్రాలతో ఉంటుంది. ఇంతకూ అందంగా ఉంటాడా? అంటే ఒళ్ళంతా శ్మశానంలోని భస్మపు పూతే. మెడలో ఆభరణాలంటావా? పుర్రెలు లేదా లావులావుగా, కఠినంగా ఉండే రుద్రాక్షలూను. విలువైన వస్త్రాలున్నాయనుకుంటున్నావేమో? ఆయనకు ఉన్నది రెండే రెండు... అంటే వస్త్రాల జత. ఒకటి రక్తపు బొట్లు ఓడుతూ ఉండే ఏనుగు చర్మం (గజాజినం శోణిత బిందు వర్షి), మరొకటి బరువైన పులి చర్మం. వివాహం అయ్యాక కౌగిలించుకుంటే... ఆ శ్మశాన భస్మం... చందనపు పూతతో ఉన్న ఆమె శరీరానికి అంటుకుంటుంది. చక్కని పుష్పాలను కొప్పునిండా ధరించే ఆమె అందానికి... ఆయన బిరుసైన, ఏనాడూ తలంటి లాంటి సంస్కారం లేని కురులు, పైగా దాదాపు పాదాల వరకూ ఉండే జటాజూటం... వెగటుగా అనిపించదా మరి? అన్నిటికీ మించి... చూడ్డానికి అదోలా అనిపించేలా ఈయనకు మూడు కళ్ళు ఉంటాయి. చక్కని భోజనాన్ని అత్తింట్లో ఆరగిద్దామనుకుంటున్నదేమో ఆ వెర్రిది! ప్రతిరోజూ భిక్షాటనం చేసుకొని వచ్చి, దానితోనే సంతృప్తి పడతాడు. ఆమె గనుక వివాహం చేసుకున్నదనుకో... ఏదైనా మిగిలితే పెడతాడు, లేదంటే పస్తే మరి! చక్కని అన్న పాత్ర ఉందనుకోకు, పుర్రెలో తినాల్సి వస్తుంది. ముందే గమనించుకోవాలని చెప్పు. అతని కళ్ళలోనైనా అందం ఉందా? అవి నిత్యం కోపంతో (రుద్రః) ఎర్రగా రక్తం గడ్డకట్టినట్టు ఉంటాయి. ఏం ఆనందిస్తుందంటావ్ పెళ్ళి చేసుకొని?..." అంటూ ఇంకా ఏదో చెప్పబోయాడు.

సనాతనుడు, లయకారుడు

అతని మాటలన్నిటినీ వింటున్న గౌరి తన చెలికత్తెతో... "అతణ్ణి వెళ్ళిపొమ్మను. గొప్పవాళ్ళ గొప్పతనం తెలియకుండా... ఎవరైనా ఏదైనా మాట్లాడుతూ ఉన్నప్పుడు... అలా నిందించిన పాపంలో కొంత భాగం వింటున్న మనకు కూడా వస్తుంది" అని అంది. తరువాత అతనితో "ఓ బ్రహ్మచారీ! శంకరుడి గురించి నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నావు. ఇది సరికాదు. ఇంద్రుడంతటివాడు ఆయన వస్తూ ఉంటే... ఐరావతాన్ని దిగి నమస్కరించి వెళ్తాడు. ఆయనకు ఉన్న మూడో కన్ను... జ్ఞాననేత్రం తప్ప అంగవైకల్య సూచకం కాదు. ఆయనకి తల్లితండ్రులు లేకపోవడం కాదు... ఆయన ఎవరికీ అంతుపట్టనంత సనాతనుడు (ప్రాచీనుడు). ఆయన లయకారుడు. కాబట్టి ఆ సమయంలో శ్మశానమే ఆయన కార్యస్థలం. అందుకే అక్కడ ఉంటాడు. తమవారు మరణించిన సందర్భంగా ఎవరికైనా అశుచి (అంటు, మైలు) వస్తే... ఆ కార్యక్రమాలన్నీ పూర్తయ్యాక శుద్ధి జరిగేది ఆయన ఆలయంలో రాత్రి నిద్ర చేసిన తరువాతే! ఇలా ఎన్నని చెప్పను? వ్యతిరేకించాలనే దృక్పథంతో ఉన్నవాడికి ఎన్ని చెప్పినా ఒక్కటే!" అంటూ "అతణ్ణి పొమ్మను" అని గౌరి గద్దిస్తూ తన చెలికత్తెతో చెప్పింది. ఎప్పుడైతే తన సమక్షంలోనే తన గొప్పదనాన్ని గురించి శైలజ వివరించిందో... వెంటనే శంకరుడు తన నిజరూపాన్ని చూపించాడు. ఆమె చేతిని పట్టుకున్నాడు (చేపట్టడం అంటే వివాహాంగీకార సూచకం కదా). అంతే కాదు... "తవాస్మి దాసః... నీకు శాశ్వతంగా దాసుణ్ణి" అని కూడా అన్నాడు.

> పెళ్ళికి ముందు ఏ వరుడైనా తను చేసుకోబోయే వధువుకు కొన్ని ఎచ్చులు (అతిశయాలు) చెబుతాడు. తన గురించి ఉన్నది ఉన్నట్టు చెప్పుకొన్న వరుడు శంకరుడొక్కడే! ఇలాంటి ఎచ్చుల కారణంగానే ఈ రోజుల్లో ఎన్నో సంసారాలు అనతికాలంలోనే కూలిపోతున్నాయి. కాబట్టి సుఖంగా కాపురం చేసుకోదలచిన వరులు నిజాన్ని నిజంగానే చెప్పుకోవాలి లేదా చెప్పించాలి.

అలాంటి వరుడు ఆయనొక్కడే!

ఈ మంగళ గౌరి కథ ద్వారా తెలుసుకోవలసిన విశేషాలు అనేకం ఉన్నాయి. పెళ్ళికి ముందు ఏ వరుడైనా తను చేసుకోబోయే వధువుకు కొన్ని ఎచ్చులు (అతిశయాలు) చెబుతాడు. తన గురించి ఉన్నది ఉన్నట్టు చెప్పుకొన్న వరుడు శంకరుడొక్కడే! ఇలాంటి ఎచ్చుల కారణంగానే ఈ రోజుల్లో ఎన్నో సంసారాలు అనతి కాలంలోనే కూలిపోతున్నాయి. లేదా "అప్పుడలా చెప్పావా? లేదా? ఎందుకలా చెప్పి నన్ను మోసగించావ్?" లాంటి దెప్పుళ్ళతో, నిత్య కలహాలతో కొన్ని సంసారాలు సాగుతున్నాయి. కాబట్టి సుఖంగా కాపురం చేసుకోదలచిన వరులు నిజాన్ని నిజంగానే చెప్పుకోవాలి లేదా చెప్పించాలి. ఒకవేళ వరుడు లేదా వధువు అలాంటివి చెబితే... అది సరికాదని తల్లితండ్రులు మందలించాలి. పొరపాట్లను అంగీకరిస్తూ నిజాన్ని చెప్పి తీరాలి. రెండోది... శంకరుడు ఆమెను తాను తపస్సు చేసుకుంటున్న కాలంలో చూశాడు. అప్పుడు ఆమె చాలా సౌందర్యవతి. కఠోరమైన తపస్సు కారణంగా ఆమె గౌర వర్ణంలోకి మారింది. అయినా శంకరుడు 'ఆనాడు ఉన్న అందం లేదు కదా? మరొక ఆమెను చూసుకుందాం' అనుకోలేదు. ఆమె శరీరం రంగు మారినంత మాత్రాన తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. నేటి కాలపు వరులు దీన్ని నేర్చుకోవాలి. శరీరచ్ఛాయ అనేది శాశ్వతం కాదు. ఏ గాయంతోనో, మనోవేదనతోనో రూపంలో మార్పు రావచ్చు. అందమే శాశ్వతం అనుకుంటూ... అదే ప్రాతిపదిక మీద వివాహ నిర్ణయం సరికాదు. అలాగే ఆదాయానికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వకూడదు. ఉద్యోగం ఏ క్షణంలో పోతుందో తెలియదు... నేటి కాలంలో ఈ పరిస్థితి ఇంకా తీవ్రంగా ఉంది. మంచి ఆస్తి ఉన్నా... పెద్ద దూది గుట్టను దగ్ధం చెయ్యడానికి చిన్న నిప్పురవ్వ చాలన్నట్టు... ఒక్క వ్యసనం లేదా వెనుకటి రుణం ఉంటే చాలు... ఐశ్వర్యమంతా హుళక్కే కదా!

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

దైవమార్గం

విర్రవీగినవారికి నరకమే...

ఒక మహా నగరంలో ధనవంతుడొకరు ఉన్నాడు. చుట్టూ సేవక జనంతో, నిత్య వైభోగాలతో అతని జీవితం సాగుతూ ఉండేది. అతని విలాసవంతమైన భోజనం బల్ల పైనుంచి జారి పడే ఆహార పదార్థాలు తిని బతకాలని చూసే వ్యక్తి ఒకడు ఉన్నాడు. ఆ నిరుపేద పేరు లాజరు. చినిగిన దుస్తులు, బక్కచిక్కిన దేహం, దాని నిండా



గాయాలు, వాటిని నాకాలని అతని మీద ఎగబడే కుక్కలు. కానీ అతను ఎప్పుడూ తను లేనివాణ్ణని బాధపడడం కానీ, ఉన్నవాళ్ళను ద్వేషించడం కాని ఎరుగడు.

కొన్నాళ్ళకు లాజరు చనిపోయాడు. అతణ్ణి దేవదూతలు పరిశుద్ధుల లోకానికి తీసుకువెళ్ళారు. దివ్య పురుషుడైన అబ్రహాం చెంతన ఉంచారు. మరి కొన్నాళ్ళకు ధనవంతుడు కూడా మరణించాడు. అతణ్ణి నరకంలో, అగ్ని జ్వాలల మధ్య ఉంచారు. అక్కడ అతను ఎన్నో బాధలు భరిస్తున్నాడు. ఒకసారి అబ్రహాం పక్కన కూర్చొని ఉన్న లాజరును ఆ ధనికుడు చూశాడు. "రక్షించు" అని కేకలు వేశాడు. "దప్పికతో నా నాలుక ఎండిపోయింది. కాబట్టి దయచేసి నా పట్ల కనికరం చూపించు. లాజరును పంపించు" అని అభ్యర్థించాడు. అప్పుడు అబ్రహాం "నీవు భూలోకంలో ఉన్నప్పుడు నీ ఇష్టం వచ్చినట్టు ప్రవర్తించావు. ఎక్కువ సుఖభోగాలను అనుభవించావు. దాని ఫలితంగా ఇప్పుడు కష్టపడుతున్నావు. లాజరు భూలోకంలో ఎన్నో బాధలు, కష్టాలు అనుభవించి, ఇప్పుడు సుఖపడుతున్నాడు. ప్రతి వ్యక్తి తన క్రియలకు తగిన ప్రతిఫలాన్ని అనుభవించక తప్పదు" అన్నాడు. ధనవంతుడు ఎంతో బాధపడ్డాడు. తాను దేవుణ్ణి మరచి... అక్రమ కార్యాలు చేసినందుకు పశ్చాత్తాపపడ్డాడు.

సిరిసంపదలు ఉన్నాయని విర్రవీగుతూ, కన్నూ మిన్నూ కానకుండా, పక్కవారిని ఈసడించే అహంకారులకు ఈ కథలో ఒక పెద్ద హెచ్చరిక ప్రతిధ్వనిస్తోంది. ఉన్నవాడు లేనివాడికి సాయపడాలి. సంపాదించడమే కాదు, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం కూడా తెలియాలి. దానశీలత ఒక మహాకళ. ఎప్పుడైనా ఏదైనా మనం ఒకరికి ఇస్తేనే దేవుడు మనకూ ఇస్తాడు. ఇవ్వడానికి సంపదే అక్కరలేదు, ఇవ్వగలిగేవి ఇంకా చాలా ఉన్నాయి. సంపాదించడం నేరం కాదు కానీ... అవసరాల్లో ఉన్న ఇతరులను ఆదుకోవాలి అనేది ఈ కథలోని సారాంశం.


> ఉన్నవాడు లేనివాడికి సాయపడాలి. సంపాదించడమే కాదు, అవసరంలో ఉన్నవారిని ఆదుకోవడం కూడా తెలియాలి. దానశీలత ఒక మహాకళ. ఎప్పుడైనా ఏదైనా మనం ఒకరికి ఇస్తేనే దేవుడు మనకూ ఇస్తాడు. ఇవ్వడానికి సంపదే అక్కరలేదు, ఇవ్వగలిగేవి ఇంకా చాలా ఉన్నాయి.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

వ్యాసపీఠం

వాల్మీకి-నారద సంభాషణే ఈ రామాయణం!

సీతారాముల జీవితచరిత్ర రసరమ్యమైనది. కొన్ని వేల ఏళ్ళుగా భారతావనికి జీవధారలాంటిది. మన పూర్వీకులు దీన్ని వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, బ్రహ్మసూత్రాల స్థాయిలో నిలిపారు. వాల్మీకి మహర్షి విరచిత రామాయణానికి గత వెయ్యేళ్లలో అనేక వ్యాఖ్యానాలు వెలువడ్డాయి. మహేశ్వర తీర్థుల 'తత్త్వదీపిక', గోవిందరాజుల 'భూషణం', త్రయంబక మఖిన్ రాసిన 'ధర్మకూతం', మాధవయోగి 'అమృతకటకం', నాగేశభట్టు 'తిలకం', వంశీధర శివసహాయ శిరోమణి లాంటి గ్రంథాలు రామాయణాన్ని భిన్నమైన పార్శ్వాల నుంచి విశ్లేషించాయి. ఇక భారతీయ భాషల్లో వెలువడిన రామాయణాల గురించి వేరుగా చెప్పాల్సిన అవసరమే లేదు. తెలుగులో మొల్ల, మళయాళంలో ఎళుత్తాచాన్, ఒడియాలో బాలరాముడు, అవధిలో తులసీదాసు, బెంగాలీలో కృత్తివాసుడు, కన్నడంలో తొరవేలు రాసిన గ్రంథాలు వాల్మీకి మూల రామాయణానికి అనేక



మెరుగులు అద్దాయి. ఈ గ్రంథాలన్నింటిలో ఉన్న ముఖ్యమైన అంశాలన్నింటినీ తీసుకొని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త దుష్యంత్ శ్రీధర్ ఇంగ్లీషులో ఒక రామాయణాన్ని రాశారు. దీనిని ప్రముఖ రచయిత్రి శ్రీదేవి మురళీధర్ తెలుగులోకి అనువదించారు. ఈ పుస్తకంలో కథ అంతా వాల్మీకి- నారదుల మధ్య సంభాషణగా నడుస్తుంది. శ్రీదేవి మురళీధర్ అనువాదం... సరళమైన తెలుగులో, అందరికీ సులభంగా అర్థమయ్యేలా ఉంది. రామాయణంపై ఆసక్తి ఉన్నవారందరూ తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకమిది.

రామాయణం
మూల రచన: దుష్యంత్ శ్రీధర్
అనువాదం: శ్రీదేవి మురళీధర్
ప్రచురణ: హార్పర్ కాలిన్స్
అమెజాన్‌తో సహా అన్ని పుస్తక కేంద్రాల్లో లభిస్తుంది.

సద్బోధ

గోశాలుడి పశ్చాత్తాపం

జైన మతానికి చెందిన తీర్థంకరుడు వర్ధమాన మహావీరుడు. ఆయనకు ఎందరో శిష్యులు ఉండేవారు. వారిలో మక్ఖలి గోశాలుడు ఒకరు. అతను చాలా తెలివైనవాడు. చక్కని మాటకారి. తాను కూడా మహావీరుడిలాంటి తీర్థంకరుడిగా గుర్తింపు పొందాలన్న దురాశ అతనికి కలిగింది. దానికోసం... మహావీరుడు చెబుతున్నవన్నీ తప్పని చాటడానికి ఎన్నో కుట్రలు పన్నాడు. క్రమంగా మహావీరుడు చెప్పే ప్రతిదాన్నీ ప్రత్యక్షంగానే ఖండించడం మొదలుపెట్టాడు.



ఒకసారి మహావీరుడు ఏడు రకాల నరకాల గురించి వివరిస్తున్నాడు. అప్పుడు గోశాలుడు "కాదు, మహావీరుడికి ఏమీ తెలియదు. నిజానికి ఏడు వందల నరకాలు ఉన్నాయి" అన్నాడు. ఇలా తన వాక్చాతుర్యంతో తెలిసినవి, తెలియనివి ఎన్నో చెప్పి... మహావీరుడి శిష్యులలో ఎంతోమందిని గోశాలుడు ఆకర్షించాడు. మహావీరుడి నుంచి వేరుపడి... తనదైన ఒక శాఖను స్థాపించాడు. వాక్చాతుర్యం ఉన్న వ్యక్తి తన మేధాశక్తిని ఉపయోగించి ఏదైనా చెబితే... దాన్ని నమ్మడానికి వేలమంది ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. కేవలం నమ్మడమే కాదు... అతనికి సర్వస్వాన్ని సమర్పించే శిష్యులుగా, భక్తులుగా మారుతారు. అతణ్ణి అనుసరిస్తారు. క్రమంగా అతను కొత్త మతాన్నే, ఉన్న మతంలోని ఒక శాఖనో ఏర్పాటు చేస్తాడు. మక్ఖలి గోశాలుడు చేసిది కూడా అదే!

ఒకసారి గోశాలుడు ఉంటున్న గ్రామానికి మహావీరుడు వచ్చాడు. గోశాలుడు ప్రచారం చేస్తున్న తప్పుడు సిద్ధాంతాలను గురించి చర్చించి, హెచ్చరించడం కోసం అతణ్ణి కలుసుకున్నాడు. "ఒకప్పుడు నీవు నా శిష్యుడివి కాబట్టి, ప్రేమతో నిన్ను సరైన మార్గంలో పెట్టడానికి వచ్చాను" అన్నాడు మహావీరుడు.

"నీకు శిష్యుడిగా ఉన్న ఆ వ్యక్తి ఎప్పుడో మరణించాడు. ఇప్పుడు ఈ శరీరంలో ఉన్నది ఒక తీర్థంకరుడు" అని గర్వంగా చెప్పాడు గోశాలుడు. మహావీరుడు అక్కడి నుంచి నిష్క్రమించాడు.

కొంతకాలం గడిచింది. గోశాలుడిలో క్రమక్రమంగా ఆత్మ పరిశీలన ప్రారంభమయింది. తను ఒక అజ్ఞాని, ఏదీ తెలియకపోయినా తెలిసినట్టు నటించే వంచకుడినని అతనికి తెలిసివచ్చింది. హృదయం బరువెక్కింది. పశ్చాత్తాపం కలిగింది. తన శిష్యులను పిలిచాడు. "నేను ఇంతవరకూ బోధించినదంతా అసత్యమే. నేను మరణించాక... నా శరీరాన్ని నడి వీధుల వెంట లాక్కొని వెళ్ళండి. వీడొక నయవంచకుడని ప్రకటించండి. నా శరీరం మీద ఉమ్మెయ్యమనండి" అని చెప్పాడు. ఆ తరువాత... మారిన మనిషిగా, అహంకారం లేకుండా జీవించాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన


ప్రస్తుత కాలంలో మనిషి తనను తాను ఒక భిన్నమైన, ప్రత్యేకమైన ప్రాణిలా భావించుకుంటున్నాడు. తన దగ్గర ఎంతో సాంకేతికత ఉన్నదనీ, ఒకప్పుడు లేని ఎన్నో ఉపకరణాలు ఉన్నాయనీ గర్వపడుతున్నాడు. ఎక్కువ సమయం స్మార్ట్ ఫోన్‌తోనే గడుపుతున్నాడు. అదో అద్భుతమైన సాంకేతికత అని అనుకుంటున్నాడు. కానీ ఆ సాంకేతికతను ఎందుకు తయారు చేశారో ఎప్పుడైనా ఆలోచించారా? వాటిని కంపెనీలు తయారు చేస్తున్నది మానవ శ్రేయస్సు కోసం కాదు, స్వలాభం కోసం. మనకు సదుపాయాలు కల్పిస్తున్నందుకు డబ్బు తీసుకుంటున్నారు. సిమ్ కార్డు లేనిదే ఫోన్ పని చెయ్యదు. పైగా రీఛార్జి చేసుకుంటూ ఉండాలి. అలాగే ఫోన్ ఛార్జింగ్ ఎంత ఉందో ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ ఉండాలి. ఎవరైతే ఎక్కువగా ఫోన్ వాడుతూ ఉంటారో వాళ్ళు తమతో పవర్ బ్యాంక్ మోస్తూ ఉంటారు. ఫోన్‌లో ఛార్జింగ్ తక్కువగా ఉందని తెలిసిన వెంటనే ఛార్జింగ్ పెడతారు.

జీవితం సఫలం కావాలంటే...

కొత్త ఫోన్ కొనడానికి వెళుతున్నప్పుడు అది మనకు ఎంతో మేలు చేస్తుందనే ఆశతో ఉంటాం. కానీ కొన్న తరువాత ఎప్పుడూ దాని గురించే ఆలోచించే పరిస్థితి ఏర్పడుతుంది. ఎక్కడికైనా వెళ్ళేముందు... అక్కడ ఛార్జింగ్ చేసుకొనే అవకాశం ఉందో లేదో ఆలోచిస్తారు. ఈ విధంగా పొద్దున లేచినప్పటి నుంచి రాత్రి నిద్రపోయే వరకూ ఫోన్ గురించే ఆందోళన చెందేవారు చాలామంది ఉన్నారు. తనను సతమతం చేసే ఆలోచనల నుంచి కాపాడుకోవడానికి ఏ సాంకేతికతను వ్యక్తులు ఉపయోగించాలనుకుంటారో... ఆ సాంకేతికతే వారికి మరిన్ని ఆలోచనలు కలిగిస్తూ ఉంటుంది. మరి ఎప్పుడూ ఆలోచనలోనే మునిగి ఉండే మనిషికి అసలైన ఆనందానుభూతి ఎలా లభిస్తుంది?

మనమందరం మన జీవితాల్లో ఆనందాన్వేషణలో ఉన్నాం. కానీ చింతలు, చికాకులతో సతమతం అవుతున్నంతకాలం ఆనందానుభూతి పొందలేమనేది గ్రహించాలి. ఈ ప్రపంచంలో ఎన్నో విషయాల మీద వితండవాదాలు జరుగుతూ ఉంటాయి. కానీ సాధువులు, మహాత్ములు అన్ని విషయాలనూ ఎప్పుడో చెప్పేశారు. రాయాల్సినవన్నీ ఇంతకుముందే రాశారు. 'ఆత్మానందం లేక మానవుడు, కాశీ మధురలు తిరిగేను - కస్తూరి మృగం తన నాభిలోనే ఉన్న కస్తూరికోసం వనమెల్లా తిరిగినట్టు...'- ఇది విన్న ప్రతిసారీ నవ్వొస్తూ ఉంటుంది. ఇలాంటి మంచి విషయాలు మనిషి బుర్రకు ఎందుకు ఎక్కవు? వాటిని

> వేద వ్యాసుడి లాంటి మహా ఋషులు రచనలు చేయడానికి కారణం ఏమిటి? వాటిని చదవడానికో, గుర్తు పెచ్చుకోవడానికో కాదు... పుస్తకాల్లో ఉన్న విషయాలను గుర్తు పెట్టుకున్నంత మాత్రాన జీవితం సఫలం కాదు. వాటిని ఆచరించాలి.



అమలు చేయడానికి మనిషి ఎందుకు ప్రయత్నించడం లేదు? వేద వ్యాసుడి లాంటి మహా ఋషులు రచనలు చేయడానికి కారణం ఏమిటి? వాటిని చదవడానికో, గుర్తు పెచ్చుకోవడానికో కాదు... పుస్తకాల్లో ఉన్న విషయాలను గుర్తు పెట్టుకున్నంత మాత్రాన జీవితం సఫలం కాదు. వాటిని ఆచరించాలి. అన్నిటికన్న ముఖ్యంగా మీలో ఉన్న ఆ దివ్య శక్తితో అనుబంధం ఏర్పరచుకోండి. తద్వారా మీ జీవితం సఫలం అవుతుంది.



ప్రేమ్‌రావత్



అరబిందో గూటికి అమెరికన్ కంపెనీ
ఒప్పందం విలువ రూ.2,185 కోట్లు

హైదరాబాద్(ఆంధ్రజ్యోతి బిజినెస్): నగరానికి చెందిన ప్రముఖ ఔషధ కంపెనీ అరబిందో ఫార్మా మరో భారీ కొనుగోలు జరిపింది. అమెరికాకు చెందిన లానెట్ సెల్లర్ హోల్డ్‌కో నుంచి లానెట్ కంపెనీ ఎల్‌ఎల్‌సీని 25 కోట్ల డాలర్లకు (సుమారు రూ.2,185 కోట్లు) చేజిక్కించుకుంది. అరబిందో ఫార్మా తన పూర్తి అనుబంధ విభాగమైన అరబిందో ఫార్మా యూఎస్‌ఏ ఇంక్ ద్వారా ఈ డీల్ కుదుర్చుకుంది. అమెరికాలో తయారీ సామర్థ్యంతోపాటు వ్యాపారాన్ని మరింత విస్తరించాలన్న లక్ష్యంలో భాగంగా ఈ కొనుగోలు జరిపినట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది.

అమెరికాలోని పెన్సిల్వేనియా రాష్ట్రంలో ట్రెవోస్ కేంద్రంగా ప్రారంభమైన లానెట్.. అత్యంత నాణ్యమైన, కాంప్లెక్స్ జనరిక్ ఔషధాల ఉత్పత్తిదారు. ముఖ్యంగా ఏడీహెచ్‌డీ చికిత్సలో ఉపయోగించే జనరిక్ లిక్విడ్‌ను తయారు చేస్తోంది సంస్థ. ఇండియానాలో ఏటా 360 కోట్ల ట్యాబ్లెట్లను తయారు చేయగలిగే భారీ ప్లాంట్‌ను సైతం కలిగి ఉంది. ఈ డీల్ ద్వారా లానెట్‌కు చెందిన అత్యంత లాభదాయక ఔషధాల పోర్ట్‌ఫోలియోతోపాటు కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ ఆర్గనైజేషన్(సీడీఎంఓ) వ్యాపారంలోకి అరబిందోకు ప్రవేశం లభించనుంది.

ద్రవ్య లోటు రూ.2.80 లక్షల కోట్లు
వార్షిక లక్ష్యంలో 17 శాతానికి..

న్యూఢిల్లీ :ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికం(ఏప్రిల్-జూన్)లో కేంద్ర ప్రభుత్వ ద్రవ్య లోటు రూ.2,80,732 కోట్లకు చేరిందని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) వెల్లడించింది. ఇది వార్షిక బడ్జెట్ అంచనా(బీఈ)లో 17.9 శాతానికి సమానం. గత ఆర్థిక సంవత్సరం(2024-25) ఇదే కాలానికి ద్రవ్యలోటు బడ్జెట్ అంచనాలో 8.4 శాతంగా ఉంది. కాగా ఈసారి లోటును రూ.15.69 లక్షల కోట్లకు (జీడీపీలో4.4%) కుదించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది.



జీఆర్‌టీ జువెలర్స్‌కు పీజీఐ అవార్డు

హైదరాబాద్: ప్లాటినం గిల్డ్ ఇంటర్నేషనల్(పీజీఐ) నిర్వహించిన ప్లాటినం సీజన్ ఆఫ్ లవ్ 2025 పోటీలో జీఆర్‌టీ జువెలర్స్ మరోసారి అవార్డు దక్కించుకుంది. ఈ పోటీలో జీఆర్‌టీ అవార్డు గెలుచుకోవడం వరుసగా ఇది తొమ్మిదోసారి. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాదిలో ప్లాటినం విక్రయాల్లో అగ్రగామిగా నిలిచినందుకు గాను జీఆర్‌టీకి ఈ అవార్డు లభించింది.

రూ.16 లక్షల కోట్లు
దేశంలోని టాప్ రియల్టీ కంపెనీల మొత్తం ఆస్తుల విలువ ఇది..

- అగ్రస్థానంలో డీఎల్ఎఫ్
- టాప్-10 జాబితాలో అపర్ణ కన్‌స్ట్రక్షన్స్
- గ్రోహ్-హురున్ ఇండియా రిపోర్టు వెల్లడి



న్యూఢిల్లీ : దేశంలోని అత్యంత విలువైన రియల్టీ కంపెనీల ఆస్తుల విలువ రూ.16 లక్షల కోట్లకు చేరింది. గత ఏడాదిలో రూ.14 లక్షల కోట్ల వృద్ధి నమోదైంది.. గురువారం విడుదలైన 'గ్రోహ్-హురున్ ఇండియా రియల్ ఎస్టేట్ 150' నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. గత ఏడాది కాలంలో రియల్ ఎస్టేట్ రంగ వృద్ధి రేటు 70 శాతం నుంచి 14 శాతానికి పడిపోయినా కంపెనీల ఆస్తుల విలువ మాత్రం ఎగబాకడం విశేషం.

డీఎల్ఎఫ్ నం.1

దేశీయ రియల్టీ రంగంలో డీఎల్ఎఫ్ హవా కొనసాగుతోంది. రూ.2.07 లక్షల కోట్ల ఆస్తులతో డీఎల్ఎఫ్ అగ్రస్థానంలో నిలిచింది. గత ఏడాది కాలంలోనే ఈ కంపెనీ ఆస్తుల విలువ 2.6 శాతం పెరిగింది. లోధా డెవలపర్స్ (రూ.1.38 లక్షల కోట్లు), తాజ్ గ్రూపు కంపెనీ ఇండియన్ హోటల్స్ (రూ.1.08 లక్షల కోట్లు), ప్రెస్టీజ్ ఎస్టేట్స్ (రూ.71,500 కోట్లు) వరుసగా రెండు, మూడు, నాలుగో స్థానాల్లో నిలిచాయి. హైదరాబాద్‌కు చెందిన అపర్ణ కన్‌స్ట్రక్షన్స్ రూ.37,400 కోట్ల ఆస్తులతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఏడాది కాలంలో ఈ కంపెనీ ఆస్తుల విలువ 12.9 శాతం పెరిగింది.

రియల్టీలో రిచ్.. రాజీవ్ సింగ్




- స్థిరాస్తి రంగ సంపన్నుల్లో రూ.1.27 లక్షల కోట్ల ఆస్తులతో డీఎల్ఎఫ్ అధినేత రాజీవ్ సింగ్ అగ్రస్థానంలో ఉన్నారు.
- రూ.92,340 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో లోధా డెవలపర్స్ అధినేత ఎంపీ లోధా.
- అదానీ రియల్టీ అధిపతి గౌతమ్ అదానీ రూ.52,320 కోట్ల స్థిరాస్తి సంపదతో మూడో స్థానంలో ఉన్నారు.
- అపర్ణ కన్‌స్ట్రక్షన్‌కు చెందిన ఎస్ సుబ్రమణ్యమ్ రెడ్డి, సీ వెంకటేశ్వర రెడ్డి వరుసగా 8, 9వ స్థానాల్లో ఉన్నారు.
- నగరాలవారీగా.. రూ6,96,800 కోట్ల ఆస్తులు, 42 రియల్ ఎస్టేట్ కంపెనీలతో ముంబై అగ్ర స్థానంలో ఉంది.
- 23 కంపెనీలు రూ.1,97,400 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో బెంగళూరు.
- 16 కంపెనీలు, రూ.86,700 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో ఢిల్లీ.
- 13 కంపెనీలు, రూ.93,700 కోట్ల ఆస్తులతో నాలుగో స్థానంలో హైదరాబాద్.



పసిడీలా!

- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 10% తగ్గిన బంగారం గిరాకీ
- 135 టన్నులకు పరిమితం
- అధిక ధరలే ప్రధాన కారణం
- డబ్ల్యూజీసీ రిపోర్టు వెల్లడి

ముంబై: ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో భారత్‌లో గోల్డ్ డిమాండ్ వార్షిక ప్రాతిపదికన 10 శాతం తగ్గి 134.9 టన్నులకు పరిమితమైందని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) గురువారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. గత ఏడాది ఇదే కాలానికి పసిడి గిరాకీ 149.7 టన్నులుగా నమోదైంది. విక్రయాల విలువ పరంగా చూస్తే, ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బంగారం డిమాండ్ 30 శాతం పెరిగి రూ.1,21,800 కోట్లకు చేరింది. క్రితం సంవత్సరంలో ఇదే సమయానికి డిమాండ్ విలువ రూ.93,850 కోట్లుగా నమోదైంది. సమీక్షా కాలంలో బంగారం ధర తొలిసారిగా రూ.లక్షకు చేరడంతో.. గిరాకీ పరిమాణం తగ్గినప్పటికీ, విలువలో వృద్ధి నమోదైందని డబ్ల్యూజీసీ రీజినల్ సీఈఓ- ఇండియా సచిన్ జైన్ అన్నారు. ఈ ఏడాది ప్రథమార్ధం(జనవరి-జూన్)లో బంగారం గిరాకీ దాదాపు 253 టన్నులుగా ఉండగా.. పూర్తి ఏడాదికి గిరాకీ 600-700 టన్నుల స్థాయిలో ఉండవచ్చని ఆయన అంచనా వేశారు.

రిపోర్టులోని మరిన్ని విషయాలు

- అధిక ధరల కారణంగా జూన్ క్వార్టర్‌లో స్వర్ణాభరణాల విక్రయాలు 17 శాతం తగ్గి 88.8 టన్నులకు పరిమితమయ్యాయి. 2024లో ఇదే కాలానికి 106.5 టన్నుల సేల్స్ జరిగాయి. గోల్డ్ జువెలరీ విక్రయాల విలువ మాత్రం 20 % వృద్ధితో రూ.80,150 కోట్లుగా నమోదైంది.
- ఈ ఏప్రిల్-జూన్‌లో బంగారంలో పెట్టుబడులు 7 శాతం పెరిగి 46.1 టన్నులకు చేరగా.. పెట్టుబడుల విలువ ఏకంగా 54 శాతం వృద్ధితో రూ.41,650 కోట్లుగా నమోదైంది. పసిడి దీర్ఘకాలంలో మెరుగైన ప్రతిఫలాలు అందించగలదన్న ఇన్వెస్టర్ల నమ్మకాన్ని ఇది నొక్కి చెబుతోందని సచిన్ జైన్ అన్నారు.
- జూన్ క్వార్టర్‌లో భారత్‌లోకి పసిడి దిగుమతులు 34 శాతం తగ్గి 102.5 టన్నులుగా నమోదయ్యాయి. గత ఏడాది ఇదే త్రైమాసికంలో దేశంలోకి 150 టన్నుల బంగారం దిగుమతైంది.
- సమీక్షా కాలంలో గోల్డ్ రీసైక్లింగ్ (పాత బంగారం పునర్వినియోగం) ఒక శాతం పెరుగుదలతో 23.1 టన్నులుగా నమోదైంది.
- ఈ ఏప్రిల్ - జూన్‌లో ప్రపంచవ్యాప్తంగా బంగారం గిరాకీ 3 శాతం పెరిగి 1,249 టన్నులకు చేరింది. అంతర్జాతీయంగా ఆర్థిక అనిశ్చితుల నేపథ్యంలో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్)లోకి పెట్టుబడులు భారీగా పెరగడం ఇందుకు కారణమని డబ్ల్యూజీసీ తెలిపింది. అంతేకాదు, సెంట్రల్ బ్యాంకులు కూడా 166 టన్నుల బంగారం కొనుగోలు చేశాయని రిపోర్టులో వెల్లడించింది.

టారిఫ్‌లతో వృద్ధికి గండి

న్యూఢిల్లీ : ట్రంప్ 25% సుంకాల పోటు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావమే చూపనుంది. ప్రభుత్వం పైకి గుంభనంగా ఉన్నా.. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మన జీడీపీ వృద్ధి రేటు పావు శాతం నుంచి అర శాతం వరకు కుంచించుకుపోయే అవకాశం కనిపిస్తోంది. తాజా సుంకాలతో వృద్ధి రేటు 0.3 శాతం వరకు తగ్గే ప్రమాదం ఉందని అంతర్జాతీయ సంస్థ బర్క్‌లీస్ అంచనా.

పెనాల్టీలతో మరింత భారం: రష్యా నుంచి భారత్ అదే పనిగా చమురు, ఆయుధాలు కొంటే, భారత వస్తువులపై 25 శాతం సుంకాలతో పాటు, పెనాల్టీలు తప్పవని ట్రంప్ ప్రకటించారు. అయితే ఈ పెనాల్టీలు ఎంత అనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. ఈ పెనాల్టీల భయంతో రిలయన్స్ సహా భారత ఆయిల్ కంపెనీలు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నాయి. అమెరికా, పశ్చిమాసియా దేశాల నుంచే పెద్ద మొత్తంలో ముడి చమురు, గ్యాస్ దిగుమతులకు చర్చలు జరుపుతున్నాయి.

అసలు ఎత్తుగడ: మన వస్తు ఎగుమతుల్లో అమెరికాదే అగ్రతాంబూలం. గత ఏడాది రెండు దేశాల మధ్య 12,920 కోట్ల డాలర్ల (సుమారు రూ.11.31 లక్షల కోట్లు) ద్వైపాక్షిక వాణిజ్యం జరిగింది. అందులో మన దేశం నుంచి అమెరికాకు 8,740 కోట్ల డాలర్ల విలువైన వస్తు ఎగుమతులు జరిగాయి. మన మొత్తం వస్తు ఎగుమతుల్లో ఇది దాదాపు 20 శాతానికి సమానం. ద్వైపాక్షిక వాణిజ్యంలో గత ఏడాది మన దేశానికి 4,600 కోట్ల డాలర్ల మిగులు ఉంది. ఈ మిగులును దెబ్బ కొట్టడం కూడా ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ సుంకాలు+ పెనాల్టీలతో అమెరికాకు మన దేశం నుంచి జరిగే వస్తు ఎగుమతుల్లో ఎంత లేదన్నా 30 శాతానికి గండి పడుతుందని నిపుణుల అంచనా.

ద్వంద్వ వైఖరి: తమ వ్యవసాయ, పాడి ఉత్పత్తుల దిగుమతులను ఎలాంటి సుంకాలు లేకుండా భారత్ అనుమతించాలని కోరుతున్న అమెరికా, తన మార్కెట్‌ను మాత్రం తెరవడం లేదు. పాడి ఉత్పత్తుల దిగుమతులపై 200 శాతం.. పండ్లు, కూరగాయల దిగుమతులపై 132 శాతం, శుద్ధి చేసిన ఆహార ఉత్పత్తులపై 196 శాతం, నూనె గింజలు, వంట నూనెలపై 164 శాతం దిగుమతి సుంకాలు విధిస్తోంది. మొత్తం మీద ట్రంప్ సుంకాల ప్రభావం, భారత ఎగుమతులకు పెను ముప్పుగా మారింది.

సూచీలకు సుంకాల సెగ
ఆరంభంలో సెన్సెక్స్ 787 పాయింట్లు పతనం
296 పాయింట్ల నష్టంతో ముగింపు

ముంబై: ట్రంప్ సుంకాల సెగతో భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీగా నష్టపోయింది. ఆరంభ ట్రేడింగ్‌లో 787 పాయింట్లు క్షీణించి 81,000 దిగువకు జారిన సెన్సెక్స్.. మధ్యాహ్నం నుంచి మళ్లీ కాస్త తేరుకుంది. చివరికి సూచీ 296.28 పాయింట్ల నష్టంతో 81,185.58 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 86.70 పాయింట్లు కోల్పోయి 24,768.35 వద్ద ముగిసింది. టెక్స్‌టైల్స్, ఆటో, ఫార్మా, ఐటీ రంగ షేర్లు అధిక అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 23 నష్టపోగా.. టాటా స్టీల్ అత్యధికంగా 2.20 శాతం క్షీణించింది. సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎన్‌టీపీసీ షేర్లు ఒక శాతానికి పైగా పతనమయ్యాయి. ఆశాజనక త్రైమాసిక ఫలితాలు ప్రకటించిన హిందుస్థాన్ యూనిలీవర్ షేరు 3.48 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కాగా, బీఎస్ఈలోని స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు 0.85 శాతం వరకు నష్టపోయాయి.

మారుతి లాభం రూ.3,792 కోట్లు

న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల విక్రయ కంపెనీ మారుతి సుజుకీ ఇండియా ఈ జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి రూ.3,792 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాదిలో ఇదే కాలానికి గడించిన రూ.3,760 కోట్ల లాభంతో పోలిస్తే అతి స్వల్పంగా పెరిగింది. దేశీయంగా కంపెనీ వాహన విక్రయాలు 4.5 శాతం తగ్గినప్పటికీ, ఎగుమతులు ఏకంగా 37.4 శాతం పెరగడం కంపెనీ లాభదాయకతకు తోడ్పడింది. కాగా, ఈ జూన్ క్వార్టర్‌లో మారుతి సుజుకీ మొత్తం ఆదాయం రూ.40,493 కోట్లకు చేరింది. మొత్తం వాహన విక్రయాలు 1.1 శాతం పెరుగుదలతో 5,27,861 యూనిట్లకు చేరాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	420	విజయవాడ	475
వరంగల్	422	గోదావరి	460
చిత్తూరు	493	విశాఖపట్నం	460
		దజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	100	విజయవాడ	104
వరంగల్	100	గుంటూరు	109
కరీంనగర్	100	ఒంగోలు	112
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	102
కర్నూలు	100	నెల్లూరు	107
విశాఖపట్నం	92	అనంతపురం	107
గోదావరి	104		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,00,030 ▼	91,700 ▼	1,25,000 ▼
విజయవాడ	1,01,600 ▼	96,000 ▼	1,13,500 ▼
విశాఖపట్నం	1,01,600 ▼	92,100 ▲	1,25,000 ▼
రాజమండ్రి	1,00,040 ▼	91,700 ▼	1,15,000 ▼
ప్రొద్దుటూరు	99,500 ▼	91,540 ▼	1,15,000 ▼
ముంబై	98,530 ▼	90,260 ▼	1,09,950 ▼

స్పోర్ట్స్

తరుణ్ సంచలనం


తరుణ్

- టాప్‌సీడ్‌కు షాక్.. క్వార్టర్స్‌కు చేరిక
- సాత్విక్ జోడీ ముందంజ.. మకావు ఓపెన్

మకావు : మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో తెలుగు షట్లర్ తరుణ్ మన్నేపల్లి సంచలనం సృష్టించాడు. టాప్‌సీడ్ లీ చుక్ యుకి షాక్ ఇచ్చి క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకు పోయాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్‌లో రెండో రౌండ్‌లో తరుణ్ 19-21, 21-14, 22-20తో వరల్డ్ నెం. 15 లీ (హాంకాంగ్)పై విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో లక్ష్యసేన్ 21-14, 14-21, 21-17 వార్డోయోపై నెగ్గి క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ జంట 10-21, 22-20, 21-16తో కుమగాయ్/నిషి (జపాన్) జోడీపై గెలుపొంది రౌండ్-8కి చేరింది. అలాగే సాయిప్రతీక్/కృష్ణమూర్తి రాయ్ జంట 21-18, 21-18తో జునైద్/రాయ్ కింగ్ (మలేసియా) ద్వయంపై నెగ్గి క్వార్టర్‌ఫైనల్లో ప్రవేశించింది. ఆయుష్ షెట్టి 18-21, 16-21తో జస్టిన్ హో (మలేసియా) చేతిలో ఓడాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ఐదో సీడ్ భారత ద్వయం ధ్రువ్ కపిల/తనీషా క్రాస్టో 21-19, 13-21, 18-21తో మలేసియా జోడీ జిమ్మీ వాంగ్/లీ నీ జింగ్ చేతిలో పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

వరల్డ్ చాంపియన్లు రచన, అశ్విని
అండర్-17 రెజ్లింగ్


రచన


అశ్విని

ఏథెన్స్ : భారత్‌కు చెందిన రచన, అశ్వినీ విష్ణోయ్ అండర్-17 వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్లుగా నిలిచారు. గురువారం జరిగిన 43 కి. ఫైనల్లో రచన 3-0తో జిన్ హాంగ్ (చైనా)ను చిత్తు చేసి పసిడి పతకం కైవసం చేసుకుంది. 65కి. తుదిపోరులో అశ్విని కూడా 3-0తోనే ముఖయో (ఉజ్బెకిస్థాన్)పై నెగ్గి స్వర్ణ పతకం దక్కించుకుంది. కజకిస్థాన్ రెజ్లర్ మధ్కియాతో 57 కి. విభాగం తుది పోరులో 5-6తో ఓడిన మోనీ రజత పతకం అందుకుంది. 49కి.లలో కోమల్ వర్మ కాంస్యం సొంతం చేసుకుంది.

నేటి నుంచే జాతీయ జూ.మహిళల హాకీ

కాకినాడ : జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ శుక్రవారం ఇక్కడ ప్రారంభం కానుంది. 30 జట్లు తలపడుతున్న ఈ టోర్నమెంట్ ఆగస్టు 12 వరకు జరగనుంది. కొత్తగా ప్రవేశపెట్టిన డివిజన్ ఆధారిత విధానంలో చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నారు. ఎ,బి,సి డివిజన్లుగా జట్లు పోటీపడతాయి. ఈ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ జట్టు డివిజన్ ఎ నుంచి, తెలంగాణ జట్టు డివిజన్ సి నుంచి తలపడుతున్నాయి.

ఆ టెస్టుల్లో కుల్దీప్‌ను ఆడించాల్సింది: గంగూలీ


లండన్: ఓవల్ టెస్ట్‌లో పేస్ వికెట్ కావడంతో.. కుల్దీప్‌ను పక్కనపెట్టడంలో తప్పులేదని భారత మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ అభిప్రాయపడ్డాడు. కానీ, లార్డ్స్, మాంచెస్టర్ టెస్ట్‌ల్లో కుల్దీప్ మ్యాజిక్‌ను టీమిండియా మిస్ చేసుకొందని చెప్పాడు. 'బర్మింగ్‌హామ్, మాంచెస్టర్, లార్డ్స్ టెస్టుల్లో కుల్దీప్‌ను తీసుకుంటారనుకున్నా. నాణ్యమైన స్పిన్నర్ లేకుండా నాలుగో రోజు, ఐదో రోజు ఆలౌట్ చేయడం కష్టమ'ని అన్నాడు.



హైదరాబాద్ బౌలర్ మహ్మద్ సిరాజ్ ఈ ఆఖరి టెస్టు ఆడడం ద్వారా అరుదైన ఘనతను అందుకున్నాడు. విదేశాల్లో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లోని అన్ని టెస్టులనూ మూడుసార్లు ఆడడమే గాక, ఆడిన ప్రతిసారీ పదేసి వికెట్లను పడగొట్టాడు. ఈ ఘనతను అంతకుముందు కపిల్‌దేవ్, వినూమన్కడ్ మాత్రమే సాధించారు.

టాస్‌లు ఓడడంలో భారత్ సరికొత్త రికార్డు సృష్టించింది. కెప్టెన్‌గా గిల్

టాస్...మరోసారి



వరుసగా ఐదో టాస్ ఓడగా.. గత జనవరి నుంచి అన్ని ఫార్మాట్లలో టీమిండియా వరుసగా 15వ సారి టాస్ చేజార్చుకొంది. 1999 ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య వెస్టిండీస్ వరుసగా 12 టాస్‌లు ఓడింది. ఆ రికార్డును భారత్ అధిగమించింది.

తొలి రోజు

తడబ్యాటు

- అర్ధ శతకంతో ఆదుకొన్న కరుణ్ నాయర్
- వోక్స్‌కు గాయం
- ఇంగ్లండ్‌తో ఐదో టెస్ట్

భారత్ 204/6


కరుణ్ నాయర్ (52 బ్యాటింగ్)

లండన్: గత మ్యాచ్‌లో అద్భుత పోరాటంతో అంచనాలు పెంచిన భారత బ్యాటర్లు అంతలోనే ఉసూరుమనిపించారు. పేసర్లకు సహకరిస్తున్న పిచ్‌పై ఇంగ్లండ్ ద్వితీయ శ్రేణి బౌలర్లను ఎదుర్కోవడంలో టాపార్డర్ బ్యాటర్లు విఫలమైన చోట.. అనూహ్యంగా రీఎంట్రీ ఇచ్చిన కరుణ్ నాయర్ (52 బ్యాటింగ్) అర్ధ శతకంతో జట్టును ఆదుకొన్నాడు. దీంతో గురువారం ఆరంభమైన వర్ష ప్రభావిత ఐదవ, ఆఖరి టెస్ట్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 64 ఓవర్లలో 6 వికెట్లకు 204 పరుగులు చేసింది. రోజు ఆఖరుకు నాయర్‌తోపాటు సుందర్ (19 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. సాయి సుదర్శన్ (38), శుభ్‌మన్ గిల్ (21) భారీ స్కోర్లు చేయలేక పోయారు. అట్కిన్సన్, జోష్ టంగ్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. ఓవరాల్‌గా మొదటి రోజు ఇంగ్లండ్‌దే పైచేయిగా నిలిచింది. కాగా, ప్రధాన పేసర్ వోక్స్ ఫీల్డింగ్ చేస్తూ గాయపడ్డాడు.

జైస్వాల్ మళ్లీ ఫ్లాప్..: పచ్చని పిచ్.. మేఘావృతమైన ఆకాశం. దీంతో మరో ఆలోచన లేకుండా ఇంగ్లండ్ కెప్టెన్ పోప్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకొన్నారు. అతడి అంచనా తప్పుకాదన్నట్టు తొలి సెషన్‌లోనే భారత ఓపెనర్లు జైస్వాల్ (2), రాహుల్ (14)ను అవుట్ చేసి ఇంగ్లండ్ దెబ్బకొట్టినా.. సుదర్శన్ నిలకడగా ఆడుతూ జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశాడు. తన రెండో ఓవర్‌లోనే జైస్వాల్‌ను అట్కిన్సన్ ఎల్బీగా వెనక్కిపంపాడు. అంపైర్ స్పందించక పోవడంతో.. రివ్యూకు వెళ్లిన ఇంగ్లండ్ ఫలితాన్ని సాధించింది. ఇతర పేసర్లు టంగ్, ఓవర్టన్ బౌలింగ్ గతి తప్పడంతో మరో ఓపెనర్ రాహుల్, వన్‌డౌన్‌లో వచ్చిన సాయి సుదర్శన్ క్రీజులో పాతుకుపోయేందుకు ప్రయత్నించారు. వీరిద్దరి భాగస్వామ్యం బలపడుతున్న సమయంలో కీలక రాహుల్‌ను వోక్స్ పెవిలియన్ చేర్చాడు. అయితే, సుదర్శన్, గిల్ ఆచితూచి ఆడుతూ స్కోరు బోర్డును నడిపించారు. టంగ్, వోక్స్ బౌలింగ్‌లో సుదర్శన్ రెండు ఫోర్లు కొట్టగా.. గిల్ కూడా చూడముచ్చటైన షాట్లతో బౌండ్రీలు సాధించాడు. అకస్మాత్తుగా వర్షం కురవడంతో.. ముందుగానే లంచ్‌కు వెళ్లాల్సి వచ్చింది. ఈ సమయానికి భారత్ 72/2తో నిలిచింది.

గిల్ తొందరపాటు..: వర్షం కారణంగా రెండో సెషన్‌లో ఆరు ఓవర్ల ఆట మాత్రమే సాధ్యమైనా.. గిల్ వికెట్ చేజార్చుకోవడం భారత్‌కు కోలుకోలేని దెబ్బ. వరుణుడి కారణంగా రెండో సెషన్ ఆలస్యంగా ఆరంభమైంది. అయితే, 27వ ఓవర్‌లో అట్కిన్సన్ బౌలింగ్‌లో డిఫెన్స్ ఆడిన గిల్.. లేని సింగిల్ కోసం యత్నించి రనౌట్ కావడంతో.. మూడో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. మళ్లీ వర్షం కురవడంతో.. టీ సమయానికి భారత్ 85/3 స్కోరు చేసింది.

భారత్ 119/3: ఆఖరి సెషన్‌లో సుదర్శన్‌తోపాటు ఫామ్‌లో ఉన్న జడేజా (9)ను టంగ్ అవుట్ చేయడంతో.. ఇంగ్లండ్ పైచేయి సాధించింది. అయితే, నాయర్, సుందర్ ఏడో వికెట్‌కు అజేయంగా 51 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పడంతో.. ఈ ఒక్క సెషన్‌లో 3 వికెట్లు కోల్పోయిన భారత్ 119 పరుగులు జోడించింది. వర్షం ఆగడంతో ఈ సెషన్‌ను అరగంటపాటు పొడిగించారు. నాయర్ ఇంగ్లండ్ పేసర్ల సహనాన్ని పరీక్షించగా.. రెండు బౌండ్రీలతో గేర్ మార్చే ప్రయత్నం చేసిన సుదర్శన్ టీమ్ స్కోరును సెంచరీ మార్క్ దాటించాడు. కానీ, టంగ్ అద్భుతమైన అవుట్ స్వింగర్‌తో పెవిలియన్ చేర్చాడు. జడేజాను కూడా టంగ్ అవుట్ చేయడంతో.. భారత్ 123/5తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశ నాయర్‌కు జత కలసిన ధ్రువ్ జురెల్ (19) రక్షణాత్మకంగా ఆడుతూ ఆరో వికెట్‌కు 30 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొనే ప్రయత్నం చేశారు. జురెల్‌ను అట్కిన్సన్ వెనక్కిపంపాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన సుందర్‌తో కలసి నాయర్ పోరాటాన్ని కొనసాగించాడు. వీలుచిక్కినప్పుడల్లా షాట్లు ఆడిన కరుణ్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా.. స్కోరు 200 మార్క్ దాటింది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (ఎల్బీ) అట్కిన్సన్ 2, రాహుల్ (బి) వోక్స్ 14, సుదర్శన్ (సి) స్మిత్ (బి) టంగ్ 38, గిల్ (రనౌట్/అట్కిన్సన్) 21, నాయర్ (బ్యాటింగ్) 52, జడేజా (సి) స్మిత్ (బి) టంగ్ 9, జురెల్ (సి) బ్రూక్ (బి) అట్కిన్సన్ 19, సుందర్ (బ్యాటింగ్) 19; **ఎక్స్‌ట్రాలు: 30; మొత్తం: 64 ఓవర్లలో 204/6; వికెట్ల పతనం:** 1-10, 2-38, 3-83, 4-101, 5-123, 6-153; **బౌలింగ్:** వోక్స్ 14-1-46-1, అట్కిన్సన్ 19-7-31-2, టంగ్ 13-3-47-2, ఓవర్టన్ 16-0-66-0, బెథల్ 2-1-4-0.

నాయర్‌కు మరో అవకాశం..

తొలి మూడు టెస్టుల్లో ఆకట్టుకోలేకపోయిన కరుణ్ నాయర్.. మళ్లీ తుది జట్టులోకి రావడం అందరినీ ఆశ్చర్యపర్చింది. మరోవైపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్, పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ఒక్క మ్యాచ్ కూడా ఆడకుండానే సిరీస్‌ను ముగించారు. ఇక బుమ్రాకు బదులుగా ఆకాశ్‌దీప్, కాంబోజ్ స్థానంలో ప్రసిద్ధ్‌కృష్ణ జట్టులోకొచ్చారు.


ఓ సిరీస్‌లో అత్యధిక పరుగులు సాధించిన కెప్టెన్‌గా 47 ఏళ్ల క్రితంనాటి గవాస్కర్ రికార్డును గిల్ అధిగమించాడు. 1978-79లో వెస్టిండీస్‌తో సిరీస్‌లో గవాస్కర్ 732 రన్స్ సాధించాడు. కాగా, ఈ ఐదో టెస్ట్‌లో చేసిన 21 రన్స్‌తో ఈ సిరీస్‌లో గిల్ మొత్తం 743 పరుగులు స్కోరు చేశాడు.

అంపైర్ ధర్మసేనపై ఫైర్..

ఇంగ్లండ్‌కు లబ్ధి చేకూర్చేలా ఫీల్డ్ అంపైర్ కుమార ధర్మసేన వ్యవహరించాడంటూ నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. టంగ్ విసిరిన ఇన్నింగ్స్13వ ఓవర్ రెండో బంతి సుదర్శన్ ప్యాడ్‌ను తాకింది. ఎల్బీ కోసం ఇంగ్లండ్ అప్పీలు చేసినా.. ధర్మసేన తోసిపుచ్చాడు. అంత వరకు ఆగకుండా...బంతి ప్యాడ్‌కు తాకేముందు బ్యాట్‌కు ఇన్‌సైడ్ ఎడ్జ్ తీసుకుందంటూ వేళ్ల ద్వారా సూచించాడు. దీంతో ఇంగ్లండ్ రివ్యూకు వెళ్లే ఆలోచనను విరమించుకొంది. ఇలా ఆతిథ్య జట్టుకు ధర్మసేన ఒక రివ్యూ మిగిల్చేందుకు సహకరించాడని నెటిజన్లు తప్పుబడుతున్నారు.



విశాఖలో ప్రొ కబడ్డీ లీగ్
వచ్చే 29నుంచి నాలుగు నగరాల్లో పోటీలు



ముంబై: ప్రొ కబడ్డీ సీజన్ 12వ అంచెకు విశాఖపట్నం ఆతిథ్యం ఇవ్వనుంది. 12 జట్లు పాల్గొనే ఈ లీగ్‌ను మొత్తం నాలుగు నగరాల్లో.. విశాఖతో పాటు జైపూర్, చెన్నై, ఢిల్లీలో నిర్వహించనున్నారు. 2018లో పోటీలు జరగ్గా.. మళ్లీ ఏడేళ్ల తర్వాత పీకేఎల్ సాగరతీరానికి తిరిగి రానుందని నిర్వాహకులు తెలిపారు. కాగా మొత్తం 108 మ్యాచ్‌లకుగాను విశాఖలో 28 జరుగుతాయి.

లీగ్ వివరాలు: ఆగస్టు 29-అక్టోబరు 23

- తొలి అంచె-విశాఖపట్నం: ఆగస్టు 29-సెప్టెంబరు 11
- రెండో అంచె-జైపూర్ : సెప్టెంబరు 12-28
- మూడో అంచె-చెన్నై : సెప్టెంబరు 29-అక్టోబరు 12
- నాలుగో అంచె-న్యూఢిల్లీ : అక్టోబరు 13-23

పట్టుబిగించిన కివీస్

బులవాయో : జింబాబ్వేతో తొలి టెస్ట్ రెండోరోజే న్యూజిలాండ్ పట్టుబిగించింది. ఆతిథ్య జట్టును మొదటి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే పరిమితం చేసిన కివీస్..ఓవర్‌నైట్ 92/0తో గురువారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించి 307 పరుగులకు ఆలౌటైంది. కాన్వే (88), మిచెల్ (80), యంగ్ (41) రాణించారు. ఇక.158 పరుగుల తొలి ఇన్నింగ్స్ లోటుతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే రెండో రోజు ఆఖరికి 31/2తో కష్టాల్లో పడింది.

మెకింటోష్ హ్యాట్రిక్
- ప్రపంచ అక్వాటిక్ చాంపియన్‌షిప్



సింగపూర్ : కెనడా సంచలన స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ ప్రపంచ అక్వాటిక్ చాంపియన్‌షిప్స్‌లో అదరగొడుతోంది. ఈ పోటీల్లో ఆమె మూడో స్వర్ణం కొల్లగొట్టింది. గురువారం జరిగిన మహిళల 200 మీ. బటర్‌ఫ్లైలో 18 ఏళ్ల మెకింటోష్ అగ్రస్థానంలో నిలిచింది. కాగా..ప్రపంచ చాంపియన్‌షిప్స్‌లో మెకింటోష్ ఇప్పటికే 400 మీ. ఫ్రీస్టయిల్, 200 మీ. వ్యక్తిగత మెడ్లేలో స్వర్ణాలు నెగ్గింది. ఈక్రమంలో ఐదు స్వర్ణాల మైకేల్ ఫెల్ప్స్ రికార్డుకు ఆమె గురి పెట్టింది.



కానిస్టేబుల్‌పై దాడి చేస్తున్న టీడీపీ నాయకుడు మదన భూపాల్‌రెడ్డి

బూతులు తిట్టి.. చెంప పగలగొట్టి!

- ఏఆర్ కానిస్టేబుల్‌పై టీడీపీ నాయకుడి దాడి
- సదరు నేత మంత్రి జనార్దన్ రెడ్డి బంధువు
- తీవ్రంగా ఖండించిన మంత్రి బీసీ

కొలిమిగుండ్ల, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్‌పై ఓ టీడీపీ నాయకుడు బూతులతో రెచ్చిపోవడమే కాకుండా చెంప చెల్లుమనిపించాడు. ఈ ఘటన నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలంలో చోటుచేసుకుంది. సదరు నేత మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీప బంధువు కావడం గమనార్హం. దాడి ఘటన వీడియోలు ఆలస్యంగా వెలుగులోకి రావడంతో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వివరాల్లోకెళితే... కొలిమిగుండ్ల మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు బుధవారం జరిగాయి. ఈ వేడుకలకు దేవదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు జనార్దన్‌రెడ్డి హాజరయ్యారు. మంత్రులు ఆలయంలో పూజలు నిర్వహిస్తుండగా.. బయట టీడీపీ నాయకుడు, మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సమీప బంధువు (వరసకు సోదరుడు) బీసీ మదన భూపాల్‌రెడ్డి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాడు. అయితే భద్రతా కారణాలు, ప్రొటోకాల్ దృష్ట్యా ఆయన్ను లోపలికి పంపేందుకు పోలీసులు నిరాకరించారు. లోపల రద్దీ ఉందని, మంత్రులు వచ్చాక పంపుతామని చెప్పినా భూపాల్ రెడ్డి వినలేదు. ఈ సమయంలో మాటామాటా పెరిగి గొడవకు దారితీసింది. విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ జశ్వంత్‌కుమార్‌పై భూపాల్ రెడ్డి పచ్చి బూతులతో రెచ్చిపోయాడు. మరింత ఆగ్రహానికి లోనై ఆ కానిస్టేబుల్‌పై చేయి చేసుకున్నాడు. కాగా, కానిస్టేబుల్ జశ్వంత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

ఎవరైనా చర్యలు తీసుకోవాల్సిందే: మంత్రి బీసీ

కానిస్టేబుల్‌పై దాడి ఘటనను మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఖండించారు. ప్రజాప్రభుత్వ పాలనలో ఇలాంటి ఘటనలకు తావులేదన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తి తన తమ్ముడైనా, మరెవరైనా సరే.. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనన్నారు.

అమ్ముడుపోని ప్లాట్లకు వేలం

- స్మార్ట్ టౌన్‌షిప్పులకు కొత్త మార్గదర్శకాలు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేసేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ నూతన మార్గదర్శకాలు రూపొందించింది. గతంలో అమ్ముడుపోని ప్లాట్లను వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయించింది. కొత్త దరఖాస్తులను నిలిపివేసి, అన్ని స్మార్ట్ టౌన్‌షిప్పుల్లో ఇప్పటికే వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి లాటరీ ద్వారా కేటాయింపులు చేయాలని తాజా మార్గదర్శకాల్లో పేర్కొంది. ఈ మేరకు పబ్లిక్‌హెల్త్ ఇంజనీరింగ్ విభాగం అనుమతి లెటర్లు, అగ్రిమెంట్ పొడిగింపులు చేపట్టాలని సూచించింది. .

17 మంది గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్లకు పదోన్నతులు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పలువురు గ్రేడ్-1 మున్సిపల్ కమిషనర్లకు స్పెషల్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి కల్పించేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఆమోదం తెలిపింది. దీంతో ఈ 17 మంది ఇక స్పెషల్‌గ్రేడ్ మున్సిపల్ కమిషనర్లుగా పదోన్నతి పొందనున్నారు. 2024-25కు సంబంధించి సీనియారిటీ ప్యానెల్‌ను డీపీసీ సిఫారసు చేయగా ప్రభుత్వం ఆమోదించింది.

ఫీజు కడితేనే సర్టిఫికెట్!

- విద్యార్థుల జీవితాలతో వర్సిటీల చెలగాటం
- ప్రభుత్వం వద్దే రీయింబర్స్‌మెంట్ పెండింగ్
- రూ.4వేల కోట్లకు పైగా పేరుకున్న బకాయిలు
- అయినా సొంత డబ్బు కట్టి తీసుకోవాలని పట్టు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజుల కోసం విద్యార్థులను వేధించడం సాధారణంగా జరిగేదే. అయితే ప్రభుత్వ పరిధిలో ఉండే విశ్వవిద్యాలయాలు కూడా ఇప్పుడు ఈ జాబితాలోకి చేరిపోయాయి. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయి. డిగ్రీ విద్యార్థులకు సర్టిఫికెట్లు ఆపేయడంతో ఇటీవల జరిగిన ఐసెట్ కౌన్సెలింగ్‌లో వందలాది మంది సీటు పొందే అవకాశం కోల్పోయారు. ఇప్పుడు ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఎంటెక్, ఎం.ఫార్మసీ (పీజీఈసెట్)లో సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. ప్రైవేటు విద్యాసంస్థలు కూడా విద్యార్థులకు సర్టిఫికెట్లు నిలిపివేయకూడదని మంత్రి లోకేశ్ ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేశారు. అయితే విద్యాశాఖ పరిధిలోనే ఉన్న వర్సిటీలే మంత్రి ఆదేశాలను ఖాతరు చేయడం లేదనే విమర్శలొస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 24 యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల్లో 7,700 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వర్సిటీ కాలేజీల్లో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తిస్తుంది. కన్వీనర్ కోటాలో సీటు పొంది 2024-25 విద్యా సంవత్సరంలో ఇంజనీరింగ్ పూర్తిచేసిన విద్యార్థులకు 2023-24లో మూడు క్వార్టర్లు, 2024-25లో మూడు క్వార్టర్లు చొప్పున ఆరు విడతల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. రీయింబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం నుంచి ఒక్కొక్కరికి దాదాపు రూ.64వేల వరకూ విడుదల కావాలి. అంత డబ్బు సొంతగా కట్టలేని విద్యార్థులు ఇప్పుడు ఎంటెక్‌లో చేరే అవకాశం కోల్పోతున్నారు. పీజీఈసెట్ కౌన్సెలింగ్‌లో సర్టిఫికెట్ల పరిశీలనకు ఆగస్టు 2 వరకు గడువు ఉంది. ఆలోగా ఇంజనీరింగ్ సర్టిఫికెట్లు చేతికి వస్తేనే కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. లేకుంటే ఎంటెక్‌లో చేరేందుకు వచ్చే సంవత్సరం వరకూ ఎదురు చూడాలి. దీంతో పలువురు విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం యూనివర్సిటీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

భారీగా ఫీజు బకాయిలు

వైసీపీ ప్రభుత్వంలో ఉన్నత విద్య ఫీజులను తల్లిదండ్రుల ఖాతాలకు జమ చేసేవారు. అయితే వాటిని సకాలంలో విడుదల చేయకుండా 2023-24లో మూడు క్వార్టర్ల ఫీజులు దాదాపు రూ.2,100 కోట్లు బకాయి పెట్టింది. విద్యార్థులను ఇబ్బంది పెట్టకూడదనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం 2024-25 నుంచి నేరుగా కాలేజీల ఖాతాలకే ఫీజులు జమ చేసేలా విధానాన్ని మార్చింది. ఆ విద్యా సంవత్సరంలోనూ మూడు క్వార్టర్ల ఫీజులు పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తంగా ఆరు క్వార్టర్ల ఫీజులు రూ.4వేల కోట్లకుపైగా ప్రభుత్వం వద్ద బకాయిలు ఉండిపోయాయి.

> 'ప్రభుత్వం ఫీజులు విడుదల చేసిందా.. లేదా.. అవే దానితో మాకు సంబంధం లేదు. మాకు కట్టాల్సిన ఫీజు కట్టి మీ సర్టిఫికెట్లు తీసుకెళ్లండి. ఫీజులు కట్టకుండా సర్టిఫికెట్లు ఇవ్వలేం.'
>
> - ఏఎన్‌యూ ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ సీహెచ్ లింగరాజు విద్యార్థులతో కరాఖండిగా చేసిన వ్యాఖ్యలివి

వర్సిటీ ఖాతాకు జమ చేస్తే...

2024-25 విద్యా సంవత్సరం ఫీజులు నేరుగా కాలేజీలు, వర్సిటీలకే వెళ్తాయి. 2023-24 ఫీజులు తల్లిదండ్రుల ఖాతాలకు జమ కావాలి. అయితే ఆ సంవత్సరానికి సంబంధించి ఫీజులను తల్లిదండ్రులకు కాకుండా నేరుగా కాలేజీలు, వర్సిటీలకు ఇచ్చేలా అంగీకారం తెలుపుతున్నట్లు విద్యార్థుల నుంచి అంగీకార పత్రాలు తీసుకున్నారు. దీంతో ఆ రెండు విద్యా సంవత్సరాల ఫీజులు కాలేజీలు, వర్సిటీలకే వెళ్తాయి. ఒకవేళ ఇప్పుడు విద్యార్థులు సొంతంగా ఫీజులు చెల్లిస్తే ఆ తర్వాత ప్రభుత్వం నగదు విడుదల చేసిన తర్వాత తమ డబ్బు వెనక్కి ఇవ్వాలని విద్యార్థులు కాలేజీలు, యూనివర్సిటీల చుట్టూ తిరగాల్సి ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

1467 కోట్ల ఇసుక దోచేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ ప్రభుత్వం తరఫున గనులశాఖ కమిషనర్ ఇసుక తవ్వకాలపై అఫిడవిట్ దాఖలు చేశారు. అందులో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకే ప్రభుత్వం ఇసుక అక్రమ తవ్వకాలపై విచారణ చేపట్టింది. ఏపీ స్పేస్ అప్లికేషన్ సెంటర్‌కు కీలక బాధ్యతలు అప్పగించింది. ఉపగ్రహ చిత్రాల ఆధారంగా కృష్ణా, గోదావరి, వాటి ఉపనదుల పరిధిలో 2021-24 మధ్య ఎక్కడెక్కడ అక్రమ తవ్వకాలు జరిగాయి? ఎంత మేర ఇసుక దోచుకెళ్లారు? నదుల పరిస్థితి ఏంటి? పర్యావరణానికి జరిగిన నష్టం ఎంత? అంశాలపై ఏపీఎస్ఏసీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ఆ నివేదికలోని అంశాలనే సుప్రీం కోర్టుకు అఫిడవిట్ రూపంలో ప్రభుత్వం సమర్పించింది.

నివేదికలోని కీలక అంశాలు

ఏపీఎస్ఏసీ రాష్ట్రవ్యాప్తంగా 794 ఇసుక తవ్విన ప్రాంతాలను ఉపగ్రహ చిత్రాల సాంకేతికత ఆధారంగా పరిశీలించిందని పేర్కొన్నారు. ఇది 2,743 హెక్టార్ల పరిధిలో ఉందని తెలిపారు. అఫిడవిట్ ప్రకారం.. 2.74 కోట్ల క్యూబిక్‌మీటర్ల మేర తవ్వకాలు జరిపి 4.11 కోట్ల టన్నుల ఇసుక తవ్వితీశారు. అయితే, 709 ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు భారీగా జరిగాయి. అక్కడ అనధికారికంగా, అక్రమంగా తవ్వకాలు చేశారు. ఈ ప్రాంతం 2,611 హెక్టార్లలో ఉంది. 2.61 క్యూబిక్‌మీటర్ల లోతున ఇసుక తవ్వి 3.91 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకను అక్రమంగా తవ్వితీశారని తన నివేదికలో ఏపీఎస్ఏసీ తెలిపింది. "ఈ నివేదిక ఆధారంగా గనుల శాఖ జగన్ ప్రభుత్వంలో ఇసుక తవ్వకాలు చేపట్టిన జేపీ వెంచర్స్, జీసీకేసీ, ప్రతిమ కంపెనీలకు 70 షోకాజ్ నోటీసులు జారీచేసింది. 1.22 కోట్ల మెట్రిక్ టన్నుల మేర అక్రమ ఇసుక తవ్వకాలు జరిపినందుకు ఆ కంపెనీలకు 1,467.60 కోట్ల మేర చెల్లించాలని డిమాండ్ నోటీసులు ఇచ్చింది" అని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. అంటే, అక్రమంగా తవ్విన 3.91 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకలో కేవలం 1.22 కోట్ల టన్నుల ఇసుక విలువే రూ.1,467 కోట్లు. వీటికే డిమాండ్ నోటీసులు ఇచ్చారు. ఇంకా 2.69 కోట్ల మెట్రిక్ టన్నుల అక్రమ ఇసుక తవ్వకాలకు కూడా జిల్లాల వారీగా ఏజెన్సీలకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు గనులశాఖ అఫిడవిట్‌లో పేర్కొంది.

స్కామ్ రూ.4వేలకోట్లకంటే ఎక్కువే..

జగన్ ప్రభుత్వంలో ఏజెన్సీలు అక్రమంగా తవ్విన ఇసుక 3.91 కోట్ల మెట్రిక్ టన్నులు. ఇందులో కేవలం 1.22 కోట్ల మెట్రిక్ టన్నుల ఇసుకకే రూ.1,467 కోట్ల డిమాండ్ నోటీసులు ఇచ్చారు. 2.69 కోట్ల టన్నుల అక్రమ ఇసుకకు గాను డిమాండ్‌నోటీసులు ఇవ్వాలి. ఇదే విషయమై జిల్లా కలెక్టర్ నేతృత్వంలోని ఇసుక కమిటీలకు మార్గదర్శకాలు ఇచ్చినట్లు గనుల శాఖ డైరెక్టర్ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. "ఏపీస్పేస్ సెంటర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా జిల్లాల వారీగా అక్రమ తవ్వకాలు జరిగిన ప్రాంతాలను గుర్తించి ఏజెన్సీలకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలి. వాటికి ఏజెన్సీలు ఇచ్చే సమాధానాలను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలి. అక్రమంగా తవ్విన ఇసుక ఆధారంగా జిల్లా స్థాయి ఇసుక కమిటీలను సంప్రదించి సంబంధిత ఏజెన్సీలకు డిమాండ్ నోటీసులు జారీ చేయాలి. అక్రమ తవ్వకాలకు పాల్పడినవారు బాధ్యత వహించేలా కచ్చితమైన చర్యలు తీసుకోవాలి" అని గత రెండు నెలల కాలంలో ఇచ్చిన ఆదేశాల ప్రతులను అఫిడవిట్‌కు జతచేశారు. కాగా, వీటి విలువ ఎంతలేదన్నా మరో రూ.4400 కోట్లపైనే ఉంటుందని గనుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

మూడు నెలల్లోగా తేల్చండి

- 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపుపై నిర్ణయం తీసుకోండి
- హైకోర్టు సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం.. డివిజన్ బెంచ్ తప్పిదం: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో పార్టీ ఫిరాయించిన 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సాధ్యమైనంత త్వరగా లేదా మూడు నెలల్లోపు స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అనర్హత పిటిషన్‌లో పేర్కొన్న ఎమ్మెల్యేలు ఎవరూ విచారణను ఆలస్యం చేయడానికి అనుమతించకూడదని, ఎవరైనా ఆ దిశగా ప్రయత్నిస్తే తీవ్రంగా పరిగణించాలని స్పీకర్‌కు సూచించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పును వెలువరించింది. రాజకీయ ఫిరాయింపుల నిలువరించకపోతే ప్రజాస్వామ్యానికే అవి నష్టం తేగలవని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టే నిర్ణయం తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు చేసిన అభ్యర్థనను ధర్మాసనం తోసిపుచ్చింది. ఆ అధికారం స్పీకర్‌కే ఉందని స్పష్టం చేసింది. అదే సమయంలో అనర్హత పిటిషన్లు సమర్పించి దాదాపు ఏడు నెలలు గడిచినా నోటీసులు జారీ చేయకపోవడం, కోర్టులో కేసు దాఖలు చేసిన తర్వాతే నోటీసులు జారీ చేయడంపై స్పీకర్‌ను తప్పుబట్టింది.

డివిజన్ బెంచ్ జోక్యం ఎందుకు?

ఈ కేసుపై విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. అనర్హత పిటిషన్లపై విచారించేందుకు సమయాన్ని నిర్ణయించమని స్పీకర్‌ను కోరారని, పిటిషన్లపై నిర్ణయం తీసుకోవాలని ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. అయినప్పటికీ.. హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడం ద్వారా డివిజన్ బెంచ్ తప్పిదానికి పాల్పడిందని స్పష్టం చేసింది.

ఇదీ నేపథ్యం...

ఎమ్మెల్యేలు దానంనాగేందర్, తెల్లంవెంకట్రావ్, కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించారని.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద సుప్రీంకోర్టులో జనవరి 15న స్పెషల్ లీవ్ పిటిషన్(సివిల్) దాఖలు చేశారు. ఎమ్మెల్యేలు పరిగి శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, కాలే యాదయ్య, టీ ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, గూడెం మహిపాల్ రెడ్డి, ఎం సంజయ్ కుమార్ కూడా ఇదే విధంగా పార్టీ ఫిరాయించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి, చింత ప్రభాకర్, కల్వకుంట్ల సంజయ్ తదితరులు కూడా జనవరి 15వ తేదీనే సుప్రీంలో రిట్ పిటిషన్(సివిల్) వేశారు. మార్చి 18న బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మరో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. నాగేందర్‌ని ప్రతివాదిగా చేర్చారు. ఈ పిటిషన్లన్నింటినీ కలిపి బెంచ్ విచారించి తాజాగా తీర్పు వెలువరించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు సీ ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు, గండ్ర మోహన్‌రావు, ఏవోఆర్‌మోహిత్‌రావు; ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గి, అభిషేక్ మను సింఘ్వి, రవిశంకర్ జంధ్యాల, గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపించారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

వీరలెవెల్లో...



అడివి శేష్, మృణాల్ ఠాకూర్ జంటగా షానియల్ డియో తెరకెక్కిస్తున్న చిత్రం 'డెకాయిట్'. సుప్రియా యార్లగడ్డ నిర్మాత. గురువారం మృణాల్ పుట్టినరోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఇంటెన్స్ లుక్‌లో గన్ పట్టుకుని ఉన్న ఆమె స్టిల్ విడుదల చేసింది. 'ఇందులో మృణాల్ పాత్ర ఇప్పటి వరకూ చూసిన హీరోయిన్ రోల్స్‌కు భిన్నంగా వీరలెవెల్లో ఉండబోతోంది' అని చిత్రబృందం పేర్కొంది. డిసెంబర్ 25న ఈ చిత్రం విడుదలవుతోంది.

ప్లీజ్ మేడమ్



నారా రోహిత్ హీరోగా వెంకటేశ్ నిమ్మలపూడి తెరకెక్కిస్తున్న చిత్రం 'సుందరకాండ'. వృతి వాఘాని, శ్రీదేవి విజయ్‌కుమార్ కథానాయికలు. సంతోశ్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేశ్ మహంకాళి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి 'ప్లీజ్ మేడమ్' అంటూ సాగే ఓ అందమైన గీతాన్ని విడుదల చేశారు మేకర్స్. శ్రీహర్ష ఇమాని రాసిన ఈ పాటను దీపక్ బ్లూ, అర్జున్ చాందీ, రేష్మా శ్యామ్ ఆలపించారు. లియోన్ జేమ్స్ సంగీతం అందించారు. ఈ నెల 27న చిత్రం విడుదలవుతుంది.

హృదయం నిండిపోయింది

- విజయ్ దేవరకొండ



ఈ విజయంతో నా హృదయం నిండిపోయింది. దాన్ని మాటల్లో ఎలా చెప్పాలో అర్థం కావడం లేదు' అని అన్నారు హీరో విజయ్ దేవరకొండ. ఆయన నటించిన 'కింగ్‌డమ్' సినిమా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "అర్జున్ రెడ్డి', 'గీత గోవిందం' సినిమాల విడుదలకు ముందు చిన్ననాటి స్నేహితులతో కలసి సరదాగా గడిపేవాడిని. నిన్న రాత్రి కూడా వాళ్లు మా ఇంటికి వచ్చారు. చాలా విషయాలు మాట్లాడుకున్నాం. అదే సమయంలో యూఎస్‌లో 'కింగ్‌డమ్' ప్రీమియర్ మొదలైంది. ఎంతో మంది నాకు ఫోన్ చేసి 'అన్నా మనం హిట్ కొట్టినం..' అని ఎమోషనల్‌గా మాట్లాడారు. మీ అందరి ప్రేమ, వేంకటేశ్వర స్వామి ఆశీస్సుల వల్లే ఇది సాధ్యమైంది' అని అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ 'అన్నిఏరియాల్లోనూ 'కింగ్‌డమ్'కు మంచి వసూళ్లు వస్తున్నాయి. సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. దీనికి రెండో భాగం కూడా చేస్తాం. అందులో ఓ పెద్ద హీరో నటిస్తారు. రెండో భాగంలో హీరోయిన్ పాత్రకు స్కోప్ ఎక్కువగా ఉంటుంది' అని అన్నారు.

మనం హిట్ కొట్టాం: రష్మిక

'విజయ్.. 'కింగ్‌డమ్' విజయం నీకూ, నీ అభిమానులకూ ఎంత ముఖ్యమో తెలుసు. మనం హిట్ కొట్టాం' అని రష్మిక మందన్న ఎక్స్‌లో సంతోషాన్ని వెలిబుచ్చారు. విజయ్, రష్మిక మందన్న కొన్నాళ్లుగా ప్రేమలో ఉన్నారంటూ ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ కామెంట్ ప్రాధాన్యం సంతరించుకుంది.

స్నేహితులే ప్రత్యర్థులైతే..

ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో దేవా కట్టా, కిరణ్ జయకుమార్ దర్శకత్వంలో రూపొందిన వెబ్ సిరీస్ 'మయసభ: రైజ్ ఆఫ్ ద టైటాన్స్'. విజయ్ కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఈ నెల 7 నుంచి 'సోని లివ్' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతోంది. గురువారం ట్రైలర్‌ని లాంచ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హీరో సాయి దుర్గాతేజ్ మాట్లాడుతూ 'ఓ మూడు భాగాలకు సరిపడా కథ రాశానని దేవా కట్టా 'మయసభ' గురించి 'రిపబ్లిక్' సినిమా టైంలోనే చెప్పారు. ఈ సిరీస్ అద్భుతాలు సృష్టించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. దేవా కట్టా మాట్లాడుతూ 'ఇద్దరు ప్రాణ స్నేహితుల ప్రయాణమే ఈ కథ. పరిస్థితుల వల్ల వారిద్దరి మధ్య ఏర్పడిన దూరం ఏమిటి? అనే కాన్సెప్ట్‌తో తీశాం' అని చెప్పారు.



నా కుటుంబాన్ని బాధించాయి

-విజయ్ సేతుపతి



తన స్నేహితురాలిని విజయ్ సేతుపతి లైంగికంగా వేధించాడంటూ రమ్య మోహన్ అనే మహిళ ఆరోపించిన సంగతి తెలిసిందే. దీనిపై విజయ్ సేతుపతి స్పందించారు. "నన్ను ఎన్నో ఏళ్లుగా చూస్తున్నవారంతా ఆమె చేసిన ఆరోపణలు చూసి నవ్వుకున్నారు. నేనేంటో నాకు తెలుసు. ఈ తప్పుడు ఆరోపణలు నన్ను బాధించలేవు. కానీ నా కుటుంబం, సన్నిహితులు ఎంతో బాధపడ్డారు. 'ఆమె ఫేమస్ కావడం కోసం అలాంటి ఆరోపణలు చేస్తోంది. ఆమెను కాసేపు హైలైట్ అవ్వనివ్వండి' అని వారికి చెప్పాను. ఆమెపై మా టీమ్ సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేసింది. ఏడేళ్లుగా నాపై ఇలాంటి ప్రచారాలెన్నో జరిగాయి. అన్నిటినీ తట్టుకుని నిలబడ్డాను. ఇవి ఎప్పటికీ నన్ను బాధించలేవు" అని పేర్కొన్నారు.

భావోద్వేగాలతో అలరిస్తుంది



అశ్విన్‌బాబు కథానాయకుడిగా ఎం. ఆర్ కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వచ్చినవాడు గౌతమ్'. రియా సుమన్ కథానాయిక. టి. గణపతిరెడ్డి నిర్మాత. త్వరలోనే విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. నేడు అశ్విన్‌బాబు పుట్టిన రోజు. ఈ సందర్భంగా చిత్రబృందం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. పోరాట ఘట్టాలు, పతాకస్థాయి భావోద్వేగాలతో ఈ చిత్రం అలరిస్తుందని నిర్మాత తెలిపారు.

హ్రీం ప్రారంభం



పవన్ తాత, చమిందా వర్మ జంటగా నటిస్తోన్న నూతన చిత్రం 'హ్రీం'. రాజేశ్ రావూరి దర్శకుడు. శివమ్ మీడియా పతాకంపై సుజాత సమర్పిస్తున్న ఈ చిత్రానికి శివ మల్లాల నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. గురువారం ఈ సినిమా ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హీరో సందీప్ కిషన్ క్లాప్ కొట్టగా, రాజీవ్ కనకాల కెమెరా స్విచ్చాన్ చేశారు.

జూలో కంగారు సందడి



విశాఖ నగరంలోని జంతు ప్రదర్శన శాలలో కంగారు (రెడ్ నెక్‌డ్ వాలీబా) సందడి చేసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్ జంతు ప్రదర్శన శాల నుంచి ఏడాదిన్నర కిందట ఈ కంగారును ఇక్కడికి తీసుకువచ్చారు. ఆరు నెలల కిందట ఇది ఓ పిల్లకు జన్మనిచ్చింది. పుట్టిన పిల్ల ఆరు నెలల వరకు తల్లి కడుపులో ఉన్న సంచిలోనే ఉంటుంది. బుధవారం తల్లితోపాటు పిల్ల కంగారు ఇలా బయటకు కనిపించి, సందర్శకులకు కనువిందు చేసింది.

- ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం

సర్పము చేత చిక్కి గేదె విలవిల



కృష్ణా జిల్లా యనమలకుదురు వద్ద గురువారం వరద ప్రవాహంలో ఈతకొట్టేందుకు ఏడెనిమిది గేదెలు దిగాయి. వీటిలో ఒక గేదె నాగు పాము కాటుకు గురైంది. గేదె కొమ్ములపైకి చేరిన ఆ పాము పడగ విప్పి ఐదారు సార్లు కాటు వేసింది. ఆ గేదెకు రైతు ఇంజక్షన్లు చేయించారు.

బడి దూరం.. భారం కాకుండా... విద్యార్థులకు

ట్రావెలింగ్ అలవెన్స్

- రాష్ట్రంలో 79,860 మంది అర్హులు గుర్తింపు
- నెలకు 600 చొప్పున మూడు నెలలకోసారి 1,800

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాల దూరంగా ఉందనే కారణంతో ఎవరూ చదువు మానేయకూడదనే ఉద్దేశంతో విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ (టీఏ) ఇచ్చే కార్యక్రమాన్ని పాఠశాల విద్యాశాఖ అమలు చేయనుంది. గతంలో ఏడాది మొత్తానికి కలిపి ఒకేసారి నగదు ఇచ్చే విధానం ఉంది. అది కూడా అర్హులందరికీ అందేది కాదు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 79,860 మంది విద్యార్థులను అర్హులుగా గుర్తించి వారికి టీఏ ఇచ్చేందుకు సిద్ధమైంది. విద్యాహక్కు చట్టం కింద బడులు దూరంగా ఉండే విద్యార్థుల కోసం కేంద్ర విద్యాశాఖ రూ.47.91 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ కార్యక్రమాన్ని ఎలా అమలు చేయాలనే దానిపై సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. అందులో వెల్లడించిన మార్గదర్శకాలు, విద్యాహక్కు చట్టం ప్రకారం 1 నుంచి 8వ తరగతి విద్యార్థులు టీఏ పొందడానికి అర్హులు. ప్రాథమిక పాఠశాలలు ఒక కిలోమీటరు, ప్రాథమికోన్నత పాఠశాలలు 3 కిలోమీటర్లు, సెకండరీ పాఠశాలలు 5 కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరంలో ఉన్న విద్యార్థులకు టీఏ వర్తిస్తుంది. విద్యార్థులు బస్సులు, మినీ బస్సులు, ఆటోలు, సైకిళ్లు లాంటివి వినియోగించాలి. ప్రైవేటు పాఠశాలల్లో చదివేవారికి ఈ పథకం వర్తించదు. ఇప్పటికే ఈ నిబంధనల ప్రకారం దూరంలో ఉన్న విద్యార్థులను పాఠశాల విద్యాశాఖ గుర్తించింది. ఆ విద్యార్థుల వివరాలను లీప్ యాప్‌లో నమోదుచేస్తారు. ఎంఈవోల పరిశీలన అనంతరం సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్లు వివరాలను ధ్రువీకరించి ఆగస్టు 10 నాటికి తుది జాబితాకు ఆమోదం తెలుపుతారు. నెలకు రూ.600 చొప్పున ప్రతి మూడు నెలలకోసారి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.1800 టీఏ సొమ్ము జమ అవుతుంది. సంవత్సరంలో బడులు తెరిచి ఉంచే 10 నెలల పాటు టీఏ ఇస్తారు. మారుమూల ప్రాంతాల్లో ఉన్న విద్యార్థులు కూడా చదువుకోవాలన్నదే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఎస్పీడీ ఉత్తర్వుల్లో తెలిపారు.


టీఏ పాఠశాలలకు ఇవ్వాలి: ఏపీటీఎఫ్

విద్యార్థుల తల్లుల ఖాతాలకు జమచేసే టీఏను పాఠశాలలకు ఇవ్వాలని ఏపీటీఎఫ్-అమరావతి అధ్యక్షుడు ప్రసాద్ కోరారు. కొన్ని బడుల్లో ఉపాధ్యాయులే రవాణా సౌకర్యం ఏర్పాటు చేసి విద్యార్థులను పాఠశాలలకు తీసుకొస్తున్నారని, టీఏ తల్లుల ఖాతాలకు వెళ్తే టీచర్లపై భారం పడుతుందని పేర్కొన్నారు.

ముఖం చాటేసిన 'నైరుతి'

సగం ముగిసిపోయిన సీజన్

- రాష్ట్రంలో సాధారణం కంటే 25% తక్కువ వర్షపాతం నమోదు
- సగం మండలాల్లో వర్షాభావం



మ్యాప్‌లో జూన్, జూలైల్లో సాధారణ వర్షపాతం నమోదైన జిల్లాలు, (గ్రీన్ రంగులో), లోటు వర్షపాతం నమోదైన జిల్లాలు (ఎరుపు రంగులో)

విశాఖపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ముఖం చాటేశాయి. ఇప్పటికే నైరుతి సీజన్ సగం ముగిసిపోయింది. అనేక రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నా ఏపీలోని సగం ప్రాంతంలో వర్షాభావం నెలకొంది. ఖరీఫ్‌లో విత్తనాలు నాటేందుకు జూన్, జూలై నెలలు కీలకం. అయితే రుతుపవనాల ప్రారంభం, మధ్యలో కొన్ని రోజులు తప్ప మిగిలిన రోజుల్లో వర్షాలు లేకపోగా తీవ్ర ఎండలతో వాతావరణం కొనసాగింది. రుతుపవనాలు ముందుగానే వచ్చినప్పటికీ జూన్ రెండో వారం వరకూ వర్షాల జాడ లేదు. ఆ తరువాత కూడా ఆశించిన స్థాయిలో వానలు పడలేదు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినప్పుడు కోస్తాలో ఒకటి, రెండు రోజులు వర్షాలు కురిశాయి తప్ప రాయలసీమలో వర్షాభావం కొనసాగింది. జూలైలో రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పంటలు ఎండిపోయాయి. విచిత్రంగా గోదావరి, కృష్ణా బేసిన్‌లో విస్తారంగా వర్షాలు కురవడంతో తుంగభద్ర, శ్రీశైలం, సాగర్, పులిచింతల ప్రాజెక్టులు నిండిపోయాయి. గోదావరి డెల్టాలో పుష్కలంగా నీరు అందుతోంది. నాగావళి, వంశధార నదులకూ వరద వచ్చింది.

రాయలసీమ అన్నదాతల్లో గుబులు

జూన్ 1 నుంచి గురువారం నాటికి ఏపీలో 255.7 మి.మీ.కు గాను 191.4 మి.మీ. వర్షపాతం (సాధారణం కంటే 25.1% తక్కువ) నమోదైంది. మొత్తం 670 మండలాల్లో 55 మండలాల్లో సాధారణం కంటే ఎక్కువ, 255 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 296 మండలాల్లో సాధారణం కంటే తక్కువ, మరో 64 మండలాల్లో సాధారణం కంటే చాలా తక్కువ వర్షపాతం నమోదైంది. కోస్తాలోని 174 మండలాల్లో సాధారణం కంటే తక్కువ, మరో 4 మండలాల్లో చాలా తక్కువ, రాయలసీమలో 116 మండలాల్లో తక్కువ, 46 మండలాల్లో చాలా తక్కువగా వర్షపాతం నమోదైంది. కడప, అన్నమయ్య, సత్యసాయి, చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో వర్షాలు పడకపోవడంతో పంటల పరిస్థితి ఆందోళనకరంగా మారింది.

గత పదేళ్లలో ఇప్పుడే తక్కువ వర్షం

జూన్, జూలైల్లో రాష్ట్రంలో మంచి వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ అంచనాలు తప్పాయి. నైరుతి సీజన్ తొలి రెండునెలల్లో ఈ ఏడాది పడినంత తక్కువ వర్షాలు గత పదేళ్లలో లేవని గుర్తుచేస్తున్నారు. తొలి 2నెలల లెక్కల ప్రకారం 2015లో సాధారణం కంటే 41% ఎక్కువ (రాయలసీమలో వర్షాభావం), 2016లో 34%, 2017లో 7%, 2018లో 8% (రాయలసీమలో తక్కువ వర్షాలు), 2019లో 16% (కోస్తా, రాయలసీమలోని పలు మండలాల్లో వర్షాభావం), 2020లో 55%, 2021లో 34%, 2022లో 17%, 2024లో 34% ఎక్కువ వర్షపాతం నమోదైంది. అయితే 2023లో మాత్రం 6% తగ్గింది. ఈ ఏడాది ఏకంగా 25% తక్కువగా నమోదైంది. నైరుతి సీజన్ ద్వితీయార్థం ఆగస్టు, సెప్టెంబరుల్లో మంచి వర్షాలు కురుస్తాయని రైతులు ఆశతో ఉన్నారు. రుతుపవనాల తీరులోనే మార్పులు చోటుచేసుకుంటున్నట్టు విశ్రాంత వాతావరణ అధికారి కృష్ణభగవానుడు వ్యాఖ్యానించారు. ఒక ప్రాంతంలో వరదలు, మరోచోట వర్షాభావం కొనసాగుతున్నాయని చెప్పారు. వాతావరణంలో మార్పులు, ప్రకృతి విధ్వంసంతో ఐఎండీ అంచనాలు ఒక్కోసారి తప్పుతుంటాయని తెలిపారు. భవిష్యత్తులో వర్షం తీరు మరింత మారుతుందని ఆయన విశ్లేషించారు.

ఉత్తర కోస్తాలో తక్కువ వర్షపాతం

ఆగస్టులో ఉత్తర కోస్తాలో అనేక ప్రాంతాల్లో వర్షాభావం కొనసాగనుంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, ఉభయ గోదావరి జిల్లాలు దానికి ఆనుకుని కృష్ణా జిల్లా వరకు సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదవుతుందని ఐఎండీ తాజా బులెటిన్‌లో తెలిపింది. ఈ నెలలో ఉత్తర కోస్తాలోని అనేక ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని పేర్కొంది.

నైరుతి ద్వితీయార్థంలో మంచి వర్షాలు

నైరుతి సీజన్‌లో శుక్రవారం నుంచి ద్వితీయార్థం (ఆగస్టు, సెప్టెంబరు) ప్రారంభం కానుంది. ఈ భాగంలో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. ఈశాన్య రాష్ట్రాలు, కేరళ, కర్ణాటక, ఏపీలోని ఉత్తర కోస్తాలోని పలు ప్రాంతాలు, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లో కొన్నిచోట్ల సాధారణం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఆగస్టు, సెప్టెంబరుల్లో దేశవ్యాప్తంగా 422.8 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉండగా, దీర్ఘకాలిక సగటులో 106శాతం కంటే ఎక్కువగా పడతాయని తెలిపింది. జూన్, జూలైల్లో దేశవ్యాప్తంగా 445.8 మి.మీ.కు గాను 474.3 మి.మీ. (సాధారణం కంటే 6.5% ఎక్కువ) వర్షపాతం నమోదైంది.

ఎస్‌ఎస్‌సీ బోర్డు పునర్వ్యవస్థీకరణ

- బోర్డు సమావేశంలో కీలక నిర్ణయాలు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డు(ఎస్‌ఎస్‌సీ)ను పునర్‌వ్యవస్థీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. గురువారం మంగళగిరిలోని విద్యా భవన్‌లో బోర్డు సన్నాహక సమావేశం జరిగింది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు, సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు, పరీక్షల విభాగం డైరెక్టర్ కె.వి.శ్రీనివాసులురెడ్డి, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎం.వి. కృష్ణారెడ్డి, ఓపెన్ స్కూల్ డైరెక్టర్ ఆర్.నరసింహారావు ఇందులో పాల్గొన్నారు. సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డును పాఠశాల ప్రమాణాల అథారిటీగా మార్చే ప్రతిపాదనపై ఇందులో చర్చించారు. అలాగే ఎన్‌సీవీఈటీ కింద మూల్యాంకనంపైనా చర్చ జరిగింది.

20 మంది దాటితే రెండో టీచర్

- ప్రాథమిక పాఠశాలలకు టీచర్ల కేటాయింపులో సవరణ

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలకు టీచర్ల కేటాయింపుపై మే నెలలో జారీచేసిన జీవో 21కు కొన్ని సవరణలు చేస్తూ పాఠశాల విద్యాశాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ప్రాథమిక పాఠశాలల్లోని ఫౌండేషనల్ స్కూల్‌కు విద్యార్థులు, టీచర్ల నిష్పత్తిని మార్చింది. పాత జీవో ప్రకారం 1 నుంచి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను కేటాయించగా, ఇప్పుడు 20 మంది విద్యార్థులకు ఒక టీచర్‌గా సవరణ చేసింది. 60 మంది విద్యార్థులకు రెండో టీచర్‌ను ఇస్తారని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా అదనంగా 1901 మంది టీచర్లు అవసరమవుతారని తెలిపింది.

ఏపీ, జర్మనీ మధ్య నైపుణ్య అభివృద్ధి చర్చలు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఏపీ, జర్మనీలోని లోయర్ సాక్సోనీ రాష్ట్రం మధ్య నైపుణ్య అభివృద్ధి సంబంధాల మెరుగుదల కోసం చర్చలు ప్రారంభమయ్యాయి. ఆ రాష్ట్ర నైపుణ్య ఉద్యోగుల నియామక అధిపతి డాక్టర్ బాలసుబ్రయణియన్ రమణి గురువారం తాడేపల్లిలోని నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఎండీ గణేష్ కుమార్ సమావేశంలో పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): పలు సమస్యలపై కలెక్టరేట్ల ఎదుట శనివారం ధర్నాలు చేపట్టనున్నట్లు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య చైర్మన్ ఎల్.సాయిశ్రీనివాస్, సెక్రటరీ జనరల్ ఎస్.చిరంజీవి ఓ ప్రకటనలో తెలిపారు.

ఎవ్వరినీ ఒత్తిడి చేయొద్దు

- స్వచ్ఛందంగానే మార్గదర్శులు ముందుకొచ్చేలా చూడాలి: సీఎస్

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర పీ4 అమలుకు మార్గదర్శులను గుర్తించే విషయంలో ఎలాంటి విమర్శలు, వివాదాలకూ తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్లను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ఆయన జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎస్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపుతో స్వచ్ఛందంగా ముందుకు వచ్చే మార్గదర్శులకే బంగారు కుటుంబాలను దత్తత ఇవ్వాలన్నారు. ఆగస్టు 16న పీ4 కార్యక్రమం భారీ స్థాయిలో ప్రారంభించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నందున 15వ తేదీలోగా నిర్ణీత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

హైవేల పనులు వేగంగా పూర్తి చేయండి

- కేంద్ర మంత్రి గడ్కరీకి శ్రీనివాసవర్మ విజ్ఞప్తి



కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన భూపతిరాజు శ్రీనివాస వర్మ

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రోడ్లు, రవాణా మంత్రి నితిన్ గడ్కరీకి కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పలు హైవే ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల్లో శనివారం గడ్కరీ పాల్గొననున్న నేపథ్యంలో గురువారం ఆయనతో శ్రీనివాసవర్మ భేటీ అయ్యారు. ఎన్‌హెచ్-165లో దిగమర్రు-ఆకివీడు- భీమవరం బైపాస్ రహదారి, ఎన్‌హెచ్-216లో భాగంగా నర్సాపురం బైపాస్ రహదారి (కత్తిపూడి-ఒంగోలు జాతీయ రహదారి) నిర్మాణ పనులను చేపట్టాలని కోరారు. గత కొంతకాలంగా నిలిచిపోయిన నర్సాపురం బైపాస్ పనులను పునఃప్రారంభించాల్సిన ఆవశ్యకతను శ్రీనివాసవర్మ తెలియజేశారు.

రాజమండ్రి జైలుపై డ్రోన్.. టెన్త్ విద్యార్థిపై కేసు

రాజమహేంద్రవరం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తండ్రి తీసుకొచ్చిన డ్రోన్‌ను సరదాగా గాల్లోకి ఎగరేసిన పదో తరగతి విద్యార్థి చిక్కుల్లో పడ్డాడు. ఆ డ్రోన్ రాజమండ్రి సెంట్రల్ జైలు ఆవరణపై ఎగరడంతో.. ఆ బాలుడిపై ఎఫ్ఐఆర్ నమోదైంది. రాజమండ్రి సెంట్రల్ జైలు వెనుక భాగంలోని నివాస భవనాల మీదుగా మంగళవారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో సెంట్రల్ జైలు ఆవరణపైకి ఓ డ్రోన్ ఎగిరింది. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ఇక్కడే రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సీఎం చంద్రబాబును గతంలో ఇక్కడ రిమాండ్‌లో పెట్టినప్పుడు కూడా డ్రోన్‌ను ప్రయోగించడం వివాదాస్పదమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ రాహుల్ డ్రోన్ వ్యవహారంపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. రంగంలోకి దిగిన పోలీసులు విచారణలో విద్యార్థి డ్రోన్‌ను సరదాగా ఆపరేట్ చేశాడని గుర్తించారు.

మోహన్‌బాబుకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినిమా నటుడు, నిర్మాత మంచు మోహన్‌బాబుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. 2019లో ఆయన ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ నమోదైన కేసును సుప్రీం కోర్టు గురువారం కొట్టివేసింది. తన విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిపై విద్యార్థులతోపాటు మంచు కుటుంబం ధర్నాకు దిగింది. అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో ఆయనతో పాటు కుమారులు విష్ణు, మనోజ్, మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రొసీడింగ్స్ అన్నింటినీ కొట్టివేస్తున్నట్లు సుప్రీం కోర్టు వెల్లడించింది.

బసవతారకం ఆస్పత్రి విస్తరణకు సహకరించండి

- కేంద్ర మంత్రులకు నందమూరి బాలకృష్ణ విన్నపం

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధుల ద్వారా బసవతారకం ఆస్పత్రిని విస్తరించేందుకు మద్దతు అందించాలని పలువురు కేంద్ర మంత్రులకు ప్రముఖ సినీనటుడు, టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ విజ్ఞప్తి చేశారు. గురువారం పార్లమెంటులో టీడీపీ ఎంపీలతో కలిసి ఆయన కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, మనోహర్‌లాల్ ఖట్టర్, హర్దీప్‌సింగ్ పూరి, మన్‌సుఖ్ మాండవీయతో వేర్వేరుగా భేటీ అయ్యారు. హిందూపురంలో ఈఎస్ఐ ఆస్పత్రిని స్థాపించాలని కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రికి విన్నవించారు. హిందూపురం రింగ్ రోడ్ నిర్మాణాన్ని చేపట్టాలంటూ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. కాగా, అంతకుముందు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పార్టీ ఎంపీలతో కలిసి లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో బాలకృష్ణ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. క్యాన్సర్ ఆస్పత్రి ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. బాలకృష్ణ వెంట టీడీపీ ఎంపీలు లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రసాదరావు, కలిశెట్టి, తెన్నేటి కృష్ణప్రసాద్, జీఎం హరీశ్, బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణ, శ్రీభరత్, కేశినేని చిన్ని ఉన్నారు. పార్లమెంటు ప్రాంగణంలో కలిశెట్టి అప్పలనాయుడుకు చెందిన సైకిల్ ఎక్కి బాలకృష్ణ సందడి చేశారు. సరదాగా ఆ సైకిల్‌పై కూర్చుని, ఫొటోలు దిగారు.



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, చిత్రంలో టీడీపీ ఎంపీలు భరత్, హరీశ్ తదితరులు

నేడు కొత్తగా లక్ష మందికి వితంతు పింఛన్లు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జీవిత భాగస్వామి విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 1,09,155 మంది వితంతువులకు కొత్తగా పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ గురువారం తెలిపారు. ఆగస్టు 1న పెన్షన్లు చెల్లించేందుకు రూ.2750 కోట్లను గ్రామ, వార్డ్ సచివాలయాల ఖాతాల్లో జమ చేసినట్లు పేర్కొన్నారు. గతేడాది నవంబరు 1న సీఎం చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా పర్యటన సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పింఛను తీసుకుంటూ చనిపోయిన వారి భార్యలకు మరుసటి నెల నుంచి పెన్షన్ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే 2019 మే నెల నుంచి 2024 అక్టోబరు మధ్య కాలంలో పెన్షన్ తీసుకుంటున్న భర్తను కోల్పోయిన మహిళలకు పెన్షన్ మంజూరు కాలేదన్నారు. అలా మిగిలిపోయిన వారిని గుర్తించి ఈ నెల నుంచి వారికి స్పౌజ్ కేటగిరీ కింద పింఛను మంజూరు చేసినట్టు చెప్పారు.

నీటి పన్ను బకాయిలపై 85 కోట్ల వడ్డీ మాఫీ

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నీటిపన్ను బకాయిలపై వడ్డీని మాఫీ చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నీటితీరువా బకాయిలు ఇప్పటివరకు రూ.450 కోట్లపైనే ఉంటాయి. వీటిని రైతులు ఏటేటా చెల్లింస్తుండాలి. కొన్నేళ్లుగా వసూళ్లు సజావుగా సాగడం లేదు. 2024-25 నాటికి రైతులు చెల్లించాల్సిన వడ్డీ రూ.85.81 కోట్లు ఉంది. అయితే దీన్ని మాఫీ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ నేపథ్యంలో రెవెన్యూశాఖ చేసిన వడ్డీ మాఫీ ప్రతిపాదనను మంత్రివర్గ భేటీలో ఆమోదించారు. ఆ మాఫీని అమల్లోకి తీసుకొస్తూ రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులిచ్చారు.

కోర్టు ప్రాంగణం శుభ్రం చేయండి

- మందుబాబులకు న్యాయాధికారి వినూత్న తీర్పు

చీరాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): బాపట్ల జిల్లా చీరాల జూనియర్ సివిల్ జడ్జి కాత్యాయని గురువారం వినూత్న తీర్పు చెప్పారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 10 మందికి తొలుత జైలు శిక్ష, జరిమానా విధించారు. అయితే వారి అభ్యర్థన మేరకు కమ్యూనిటీ సర్వీసెస్‌లో భాగంగా మూడు రోజులు కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేయాలని, చెత్తను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు.



కోర్టు ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న మందుబాబులు

రూ. 17.46 కోట్లు కట్టండి

విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి జరిమానా

- భీమిలి బీచ్‌లో అక్రమ నిర్మాణాల వ్యవహారంలో విధింపు
- 1,455 రోజులు.. రోజుకు రూ.1.2 లక్షలు చొప్పున లెక్కింపు
- నిర్మాణాల కోసం తవ్విన ప్రాంతంలో పునరుద్ధరణ పనులు
- అవి పూర్తయ్యే వరకూ రోజుకు 1.2 లక్షలు అదనంగా వసూలు
- మూడు నెలల్లో పనులు పూర్తి చేయకుంటే జరిమానా రెట్టింపు



సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి భీమిలి బీచ్‌లో చేపట్టిన నిర్మాణాల తొలగింపు (ఫైల్ ఫొటో)

విశాఖపట్నం, జూలై 31(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం భీమిలి బీచ్‌లో కోస్తా నియంత్రణ మండలి(సీఆర్‌జెడ్) నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టి పర్యావరణానికి నష్టం కలిగించినందుకు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డికి జాయింట్ కమిటీ రూ.17.46 కోట్ల జరిమానా విధించింది. ఆమె నుంచి ఆ మొత్తం వసూలు చేయాలని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. హైకోర్టు ఆదేశాల మేరకు కమిటీ సభ్యులు వారం క్రితం భీమిలి వచ్చి పరిశీలించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం పర్యావరణ నష్టాన్ని అంచనా వేశారు. గూగుల్ ఎర్త్, గత కమిటీ సర్వే నివేదిక ఆధారంగా 2021 ఆగస్టు 1న అక్కడ నిర్మాణాలు ప్రారంభమైనట్టు తేల్చారు. అప్పటి నుంచి సర్వే జరిగిన రోజు అంటే 2025 జూలై 26 వరకూ (1,455 రోజులు) పర్యావరణ నష్టాన్ని లెక్కించారు. ఈ ప్రాజెక్టు కింద 16,914 చ.మీ. విస్తీర్ణంలో పనులు చేపట్టారని, ఆ కాలుష్యం రెడ్ కేటగిరీలోకి వస్తుందని, అక్కడ పర్యావరణ నష్టం రోజుకు రూ.1.2 లక్షలుగా లెక్క తేల్చారు. ఆ మేరకు 1,455 రోజులకు రూ.17.46 కోట్లు జరిమానా విధించారు. బీచ్‌లో నిర్మాణాలను పూర్తిగా తొలగించలేదని, కూలగొట్టిన వాటి వ్యర్థాలు అక్కడే ఉన్నాయని పేర్కొన్నారు. భూమి లోపలి వరకు నిర్మించిన ప్రహరీని తొలగించాలని, డెబ్రిస్‌ను అక్కడి నుంచి తరలించాలని ఆదేశించారు. తవ్వేసిన ప్రాంతంలో మళ్లీ ఇసుక వేయాలని, ఆ ప్రాంతంలో కొబ్బరి చెట్లు పెంచాలని సూచించారు. ఈ పనులన్నీ మూడు నెలల్లో పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ పనులు పూర్తిచేసే వరకూ రోజుకు రూ.1.2 లక్షల చొప్పున జూలై 27 నుంచి అదనంగా జరిమానా వసూలు చేయాలని పేర్కొన్నారు. బీచ్ పునరుద్ధరణ పనులు మూడు నెలల్లోగా చేయకపోతే ముందుగా విధించిన జరిమానాకు రెట్టింపు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పునరుద్ధరణ పనులను ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ) పర్యవేక్షించాలని జాయింట్ కమిటీ నివేదికలో పేర్కొంది. బీచ్‌లో ప్రహరీని కింది నుంచి తొలగించాల్సి ఉందని, దానికి రూ.73.6 లక్షలు ఖర్చు అవుతుందని జీవీఎంసీ అంచనా ఇచ్చిందని, ఆ మొత్తాన్ని నేహారెడ్డి ముందుగా డిపాజిట్ చేయాలని ఆదేశించింది. బీచ్ పునరుద్ధరణ పూర్తయిన తరువాత ఏపీసీజెడ్ఎంఏ హైకోర్టుకు సమగ్ర నివేదికను ఇవ్వాలని కమిటీ సూచించింది.


మోదీ నాయకత్వంలో ఆర్థిక వృద్ధి బలోపేతం

ఎన్డీయేకు, ప్రధానికి జనసేన పూర్తి మద్దతిస్తుంది: పవన్



అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): భారత ఆర్థిక వ్యవస్థ గత 11 ఏళ్లుగా మరింత బలోపేతమైందని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపాంతరం చెందిందని చెప్పారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఎంఎస్ఎంఈ, ఫార్మా, ఐటీతో పాటు వ్యవసాయ రంగాల్లో దేశం మంచి ప్రగతి సాధించిందన్నారు. ప్రపంచదేశాలకు భారత్ పోటీగా నిలిచిందని చెప్పారు. అంతర్జాతీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా దేశ ప్రజలు, వ్యాపారాలు, రైతులతో పాటు జాతీయ ప్రయోజనాలు కాపాడటానికి ఎన్డీయే ప్రభుత్వం స్థిరంగా వ్యవహరించిందన్నారు. ఇండో-యూఎస్ వాణిజ్య చర్చల సందర్భంలో కూడా దేశ ఆర్థిక ప్రాధాన్యతలను కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం దృఢంగా నిలిచిందన్నారు. దేశ సుదీర్ఘ ప్రయోజనాల కోసం ఇలాంటి కీలకమైన సమయంలో, ప్రతి పౌరుడు ప్రధాని మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి మద్దతుగా నిలవడం చాలా ముఖ్యమన్నారు. దురదృష్టవశాత్తు కొంత మంది ప్రతిపక్ష నాయకులు భారత ఆర్థిక వ్యవస్థపై నిర్లక్ష్యపూరిత వ్యాఖ్యలు చేశారని, ఇవి దేశ ఖ్యాతిని దెబ్బతీసే విధంగా, అమెరికా ప్రయోజనాలకు ఉపయోగపడేలా ఉన్నాయన్నారు. భారత దేశ గౌరవాన్ని పణంగా పెట్టి, రాజకీయలాభం కోసం ఇటువంటి ప్రకటనలు చేయడం బాధ్యతారహితమన్నారు. ఇది నూతన భారతం అని, ఇకపై తలవంచుకునే దేశం కాదని, దేశ ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. దేశ ఆర్థిక పురోగతిలో భాగంగా ఎన్డీయే ప్రభుత్వం ప్రపంచ వాణిజ్య భాగస్వామ్యాలను పెంచుకోవడంతో పాటు ఒక దేశంపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించిందన్నారు. దేశం ఆర్థిక బలోపేతం కావడానికి, సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ఎన్డీయే ప్రభుత్వానికి, ప్రధాని మోదీ నాయకత్వానికి జనసేన పార్టీ తరఫున తాను పూర్తి మద్దతు అందిస్తున్నట్లు తెలిపారు.

వైసీపీ ఐదేళ్లలో చేయని అభివృద్ధిని ఏడాదిలోనే చేశాం: నాగబాబు



కొత్తూరు(అనకాపల్లి), జూలై 31(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో చేయలేని అభివృద్ధిని ఏడాదిలోనే చేసి చూపించిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు అన్నారు. గురువారం అనకాపల్లిలో కార్యకర్తలతో సమావేశంలో ఆయన మాట్లాడుతూ మరో పదిహేనేళ్లపాటు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ 'పొత్తు'కు కట్టుబడి ఉండాలని కార్యకర్తలకు సూచించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే క్రమంలో కొన్ని సమస్యలు ఎదురైనప్పటికీ, సర్దుకొని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. రాక్షస పాలన, దుర్మార్గపు పాలన చేసిన వైసీపీని మరోసారి గద్దెనెక్కించకూడదన్నారు. ఐదేళ్లలో లిక్కర్, భూములు, మట్టి తవ్వకాలు తదితరాల్లో వైసీపీ అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. వైసీపీ నేతలకు ప్రజల్లో తిరిగే అర్హత లేదన్నారు. వచ్చే నాలుగేళ్లలో రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్-బ్లూ మాస్టర్ ప్లాన్‌పై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు

హరిత అమరావతి

అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్-బ్లూ మాస్టర్‌ప్లాన్‌పై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నగరాన్ని ప్రకృతితో మమేకమయ్యేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అతిపెద్ద లంగ్‌స్పేస్ నగరంగా, అమరావతి ఇన్ నేచర్ అనే కాన్సెప్ట్‌తో హరిత ప్రణాళికల్ని అమలు చేయాలని సూచించారు. గురువారం సచివాలయంలో అమరావతి బ్యూటిఫికేషన్, గ్రీన్-బ్లూ మాస్టర్ ప్లాన్‌పై సీఎం సమీక్ష నిర్వహించారు. రాజధానిలో రోడ్లు, బఫర్ జోన్లు, గ్రీన్ జోన్లు, ముఖ్యమైన కూడళ్లు అత్యంత ఆహ్లాదకరంగా ఉండేలా పచ్చదనాన్ని పెంపొందించాలని, అవెన్యూ ప్లాంటేషన్ చేయాలని అధికారులకు నిర్దేశం చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పార్కులు, హరిత ప్రాంతం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఔషధ మొక్కల పెంపకంపై యోగా గురువు బాబారామ్‌దేవ్ సలహాలు తీసుకోవాలన్నారు. రివర్‌ఫ్రంట్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దాలని అన్నారు. గ్రీన్, బ్లూ నగరంగా అమరావతిని తీర్చిదిద్దడంతో పాటు ప్రజలను ఆకర్షించేలా ఏడాది పొడవునా వివిధ కాలాల్లో వికసించే పుష్ప జాతులు, ఫలాల మొక్కలు నాటాలని సీఎం పేర్కొన్నారు. సుందరంగా తీర్చిదిద్దేందుకు బెంగుళూరుతో పాటు సింగపూర్ సహా వివిధ ప్రాంతాలను కూడా పరిశీలించాలని చెప్పారు.

అందరికీ అందుబాటులో గృహనిర్మాణం

రాజధాని అమరావతిలో అత్యంత నాణ్యమైన, అందరికీ అందుబాటులో గృహ నిర్మాణం ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సింగపూర్‌లోని బిడదారి హౌసింగ్ ప్రాజెక్టు తరహాలో రాజధాని నగరంలో గృహ నిర్మాణ ప్రాజెక్టుల వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చెట్లు, పార్కులు నిర్మించాలని చెప్పారు. 250 ఎకరాలల్లో 10 వేల మంది నివశించేలా బిడదారి ఎస్టేట్‌ను నిర్మించారన్నారు. పార్కులకు వివిధ దేశాల పేర్లను పెట్టడంతో పాటు ఆయా దేశాల్లో పెరిగే పుష్ప జాతి మొక్కలు ఉండేలా చూడాలన్నారు. కృష్ణా తీరం ఇరువైపులా ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, సైక్లింగ్ ట్రాక్లు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు.

ప్రతి నీటి బొట్టూ సద్వినియోగం కావాలి: సీఎం

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సముద్రంలోకి వృథాగా పోతున్న నీటితో రిజర్వాయర్లు నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. ప్రత్యేకించి రాయలసీమ ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువులకు ఈ నీటిని తరలించాలన్నారు. గురువారం సచివాలయంలో సాగునీటి ప్రాజెక్టులపై ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టుల్లో నీటి నిల్వలపై ఆరా తీశారు. ప్రతినీటి బొట్టూ సద్వినియోగం కావాలని ఆదేశించారు. ప్రస్తుతం కృష్ణా, గోదావరి నదుల్లో వరద ప్రవాహం కొనసాగుతోందని.. సోమశిల, కండలేరు, గండికోట, బ్రహ్మంసాగర్, పైడిపాలెం తదితర రిజర్వాయర్లన్నీ నింపాలని స్పష్టంచేశారు. సీమ రిజర్వాయర్లు, చెరువులు నింపాలంటే ఇంకా 132 టీఎంసీల జలాలు అవసరమని అధికారులు చెప్పారు. వీలైనంతవరకూ వ్యయం లేకుండా గ్రావిటీ ద్వారా నీటిని తరలించేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం అన్నారు. చెరువులు నింపడంతో పాటు భూగర్భ జలాల మట్టాలు పెరిగేలా చర్యలు చేపట్టాలని చంద్రబాబు ఆదేశించారు. భూగర్భ జలాలు ఒక మీటరు పెరిగితే.. 120 టీఎంసీల నీటిని నిల్వ చేసినట్లని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సగటున 9.8 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయని.. దాన్ని 5 మీటర్లకు తీసుకు వచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సమీక్షలో మంత్రి నిమ్మల రామానాయుడు, జలవనరులశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, సలహాదారు వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

జగన్‌ది జైళ్ల యాత్ర: అనిత


అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోని యువతకు ఉపాధి కల్పించేందుకు సీఎం చంద్రబాబు సింగపూర్ వెళ్లి పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులను కలిస్తే.. జగన్ మాత్రం జైళ్లకు వెళ్లి ఖైదీలు, దోపిడీదారులు, ఖూనీకోర్లను కలుస్తున్నారని హోంమంత్రి అనిత అన్నారు. అమరావతి సచివాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. తీర్థయాత్రలు, జైత్రయాత్రలు, దండయాత్రలు, ఓదార్పు యాత్రలు చూశాం.. ఇప్పుడు జగన్ జైలు యాత్రలు చూస్తున్నామని ఎద్దేవా చేశారు. 'మీ పర్యటనలో ఓ కానిస్టేబుల్ చేయి విరిగితే.. పోలీసుల వైఫల్యమంటూ మాట్లాడతారా? చంద్రబాబు, లోకేష్‌ను తిడుతున్న జగన్ మానసిక స్థితిపై చర్చ జరగాలి' అని అనిత పేర్కొన్నారు. ఏపీ పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక ఫలితాలను ఒకటి, రెండు రోజుల్లో ప్రకటిస్తామని హోంమంత్రి వెల్లడించారు.

భయం నీడలో జగన్: సత్యకుమార్

ఐదేళ్లు సీఎంగా ఉన్న జగన్ నేడు గుర్తింపు లేని విపక్ష నాయకుడిగా మిగిలిపోయారని మంత్రి సత్యకుమార్ అన్నారు. మద్యం కుంభకోణం సూత్రధారి వెల్లడయ్యే తరుణంలో జగన్ అనుచిత వ్యాఖ్యల్ని ప్రజలు అర్థం చేసుకోవాలని సూచించారు. రూ.11కోట్లు సిట్‌కు దొరకడంతో జగన్‌లో వణుకు ప్రారంభమైనట్లుగా తెలుస్తోందన్నారు. ఆ భయం, వణుకుతోనే ప్రజల సానుభూతి కోసం నానా పాట్లు పడుతున్నారని మంత్రి అన్నారు.

అమరావతి నిర్మాణాల కోసం అధ్యయనం

- సింగపూర్‌లో మంత్రి నారాయణ బృందం పర్యటన



సింగపూర్‌లో ఘన వ్యర్థాల నిర్వహణను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, కమిషనర్ కన్నబాబు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణానికి సంబంధించిన పలు అంశాలపై అధ్యయనం చేసేందుకు మంత్రి నారాయణ బృందం సింగపూర్‌లో పర్యటిస్తోంది. సింగపూర్‌లో వేస్ట్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను బృందం పరిశీలించింది. పట్టణాభివృద్ధి అథారిటీ, రోడ్ల అభివృద్ధి అథారిటీ, సింగపూర్ ల్యాండ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు.

నేడు జమ్మలమడుగుకు సీఎం

కడప కలెక్టరేట్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జమ్మలమడుగు మండలంలో పర్యటించనున్నారు. గూడెంచెరువు గ్రామంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్ పంపిణీ చేస్తారు. అనంతరం ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. తర్వాత గండికోటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం శంకుస్థాపన చేస్తారు. గూడెంచెరువుకు వెళ్లి 12.45 వరకు లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందజేస్తారు.

బనకచర్లపై మళ్లీ ప్రతిపాదనలు పంపాలన్నాం

- రాజ్యసభలో కేంద్ర మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ వెల్లడి

న్యూఢిల్లీ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు కోసం పర్యావరణ మదింపు అంచనా(ఈఐఏ) అధ్యయనం చేపట్టడానికి టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్) మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని కేంద్ర పర్యావరణ, అటవీ సహాయ మంత్రి కీర్తివర్ధన్‌సింగ్ తెలిపారు. అయితే కేంద్ర జలసంఘం అనుమతులన్నీ తీసుకున్నాక టీవోఆర్ రూపకల్పనకు మళ్లీ ప్రతిపాదనలు సమర్పించాలని రాష్ట్రప్రభుత్వానికి సూచించినట్లు గురువారం రాజ్యసభలో చెప్పారు.

ఫిరాయింపుల చట్టంలోనే లొసుగులు: యనమల

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్పీకర్ ముందున్న అనర్హత పిటిషన్లను 3నెలల్లోగా పరిష్కరించాలన్న సుప్రీంకోర్టు తీర్పును టీడీపీ నేత యనమల రామకృష్ణుడు స్వాగతించారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టంలోనే అనేక లొసుగులు ఉన్నాయని, వీటిని సమీక్షించి చట్టసవరణ ద్వారా సరిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. స్పీకర్ ముందు దాఖలైన పిటిషన్లను పరిష్కరించడానికి ఎటువంటి కాలపరిమితీ లేదని, సభాపతి నిర్ణయం వెలువడే వరకు కోర్టులు జోక్యం చేసుకోలేవని తెలిపారు.

ఏపీ బ్రాండ్‌ను నాశనం చేశారు



(మొదటి పేజీ తరువాయి)

జగన్ నాడు ఏకపక్షంగా రద్దు చేశారు. దానివల్ల ఆంధ్ర రాష్ట్రం నష్టపోయింది. సింగపూర్ ప్రభుత్వం ముందుకొచ్చి తమ దేశ సంస్థలతో కలసి ఏపీని, అమరావతిని అభివృద్ధి చేస్తామంటే.. వాళ్లతో కనీసం చర్చించకుండా ఒప్పందాలు రద్దుచేయడంతో రాష్ట్రం బ్రాండ్ పోయింది. రాష్ట్రానికి అత్యధికంగా పన్నులు చెల్లించే అమరరాజా కంపెనీపై దాడులు చేసి జగన్ తెలంగాణకు తరిమేశారు. లులూ గ్రూప్ టెండర్లలో పాల్గొని విశాఖలో భూములు పొందితే.. వాటి కేటాయింపుల రద్దుతో రాష్ట్ర బ్రాండ్ పోయింది' అని విరుచుకుపడ్డారు. అందుకే ప్రజలు 2024 ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో 164 స్థానాలతో 94 శాతం స్ట్రయిక్ రేటుతో టీడీపీని గెలిపించారని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో సింగపూర్ ప్రభుత్వ కంపెనీల నుంచి రూ.45 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని లోకేశ్ తెలిపారు. ఇది జగన్‌కు బ్యాడ్ న్యూస్.. రాష్ట్ర యువతకు గుడ్‌న్యూస్‌గా అభివర్ణించారు. సింగపూర్ ప్రభుత్వ కంపెనీల నుంచి పెట్టుబడులు రాకుండా జగన్ కుట్ర చేశారని మండిపడ్డారు. 'మేం అక్కడ ఉండగానే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ కంపెనీకి చెందిన మురళీకృష్ణ అనే వ్యక్తితో.. రాష్ట్రంలో ప్రభుత్వం అస్థిరంగా ఉందంటూ సింగపూర్ ప్రభుత్వానికి, మంత్రులకు ఈ-మెయిల్ చేయించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెడితే నష్టపోతారంటూ అందులో హెచ్చరించారు. తప్పుడు ఈ-మెయిల్స్ పంపిన మురళీ కృష్ణపై కఠిన చర్యలు ఉంటాయి. ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుని.. చర్యలకు ఉపక్రమించాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలో స్పీడ్ ఆఫ్ యాక్షన్ కూడా ఉంటుంది' అని హెచ్చరించారు. సీఎం చంద్రబాబు ఉదయం 8 నుంచి రాత్రి 11 వరకూ రాష్ట్రం కోసం పనిచేస్తుంటే.. జగన్ రాష్ట్రాన్ని నాశనం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లోకేశ్ ఇంకా ఏమన్నారంటే..

సుస్థిర ప్రభుత్వాలు కొనసాగాలి..

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే సుస్థిర ప్రభుత్వం కొనసాగాలి. సింగపూర్‌లో ప్రభుత్వం సుస్థిరంగా కొనసాగుతూ ఉండడం వల్లే అభివృద్ధి సాధ్యమైంది. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కొనసాగుతున్నందునే వికసిత్ భారత్ సాధ్యమవుతోంది. 2019లో టీడీపీ ఓటమి వల్లే రాష్ట్రం సర్వనాశనమైంది. ఒక రాష్ట్రం.. ఒక రాజధాని.. అభివృద్ధి వికేంద్రీకరణ.. కూటమి నినాదం.

కాలు బయటపెట్టగలరా..?

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన ఉందని జగన్ అంటున్నారు. నిజంగా అదే ఉంటే ఆయన జగన్ కాలు బయటపెట్టి తిరగగలిగేవారా? జగన్‌కు మేం పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తున్నాం. జగన్‌కు మేం పూర్తి స్థాయిలో భద్రత కల్పిస్తున్నాం. పోలీసు భద్రత కల్పిస్తే నిర్బంధిస్తున్నామంటారు. వదిలేస్తే భద్రత కల్పించడం లేదని గగ్గోలు పెడుతున్నారు. అభివృద్ధిని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారు. విశాఖలో టీసీఎస్‌కు ఎకరా 99 పైసలకే కేటాయించేందుకు ప్రధాని మోదీ మా ప్రభుత్వానికి ఆదర్శం. పశ్చిమ బెంగాల్‌లో టాటా నానో కార్ల తయారీ యూనిట్ స్థాపించేందుకు సిద్ధపడిన సమయంలో అల్లర్లు జరిగితే.. గుజరాత్ సీఎంగా మోదీ.. టాటా గ్రూప్‌నకు ఎకరా రూపాయికే కేటాయించారు.

పట్టుదలతో పరిశ్రమలను రప్పిస్తున్నాం..

రాష్ట్రానికి పట్టుదలతో పరిశ్రమలను రప్పిస్తున్నాం. 2024లో గెలిచిన వెంటనే ఆదిత్య మిట్టల్‌తో జూమ్‌కాల్‌లో మాట్లాడితే.. ఆయన వెంటనే రాష్ట్రంలో స్టీల్ ప్లాంట్ స్థాపనకు ముందుకొచ్చారు. సెప్టెంబరులో విశాఖకు టీసీఎస్ వస్తోంది 4,500 మందికి ఉద్యోగాలు కల్పించనుంది. దేశంలోనే అతి పెద్ద టాటా డేటా సెంటర్ విశాఖలో రాబోతోంది. యువతకు ఉద్యోగాల కోసమే కంపెనీలకు రాయితీపై భూములు ఇస్తున్నాం. మేమేమీ భారతీ సిమెంట్స్‌కో.. హెరిటేజ్ సంస్థకో భూములు ఇవ్వలేదు. 2029కల్లా 20 లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నాం.

తప్పులు దిద్దడానికే సింగపూర్‌కు..

ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో నాలుగు రోజుల సింగపూర్ పర్యటన విజయవంతమైంది. జగన్ హయాంలో జరిగిన తప్పుల రికార్డులను సరిచేసేందుకే మంత్రులు నారాయణ, టీజీ భరత్, నేను, అధికారుల బృందం అక్కడకు వెళ్లాం. గతంలో అమరావతి నగరం, రాష్ట్ర అభివృద్ధి కోసం సింగపూర్ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలను వారితో కనీసం చర్చించకుండానే జగన్ రద్దుచేసి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేశారు. సింగపూర్ అధ్యక్షుడు థర్మన్ షణ్ముగరత్నం, మంత్రి టాన్ సె లింగ్ సహా అక్కడి ప్రభుత్వ పెద్దలందరితో చర్చలు జరిపాం. నాలుగు రోజుల్లో చంద్రబాబు 26 ముఖాముఖి సమావేశాల్లో పాల్గొన్నారు. నేను 19 ముఖాముఖి చర్చల్లో పాలుపంచుకున్నాను. టువాస్ పోర్టు, జురాంగ్ పెట్రో కెమికల్స్, ఐటీ ఎలక్ట్రానిక్స్, రియల్ ఎస్టేట్, స్పోర్ట్స్ కంపెనీలతో భేటీ అయ్యాం. పెట్టుబడుల కోసం పలు కంపెనీల ప్రతినిధులు, యాజమాన్యాల నుంచి కమిట్‌మెంట్స్ తీసుకున్నాం. రాష్ట్రాభివృద్ధికి సింగపూర్ ప్రభుత్వం రోడ్ మ్యాప్ ఇచ్చింది.

అనుమతులు తీసుకునే కాళేశ్వరాన్ని కట్టారా?

సముద్రంలోకి వృథాగా వెళ్లే వరద జలాలనే తాము బనకచర్ల కోసం వాడుకుంటామని.. అందులో తప్పేముందని మంత్రి లోకేశ్ ప్రశ్నించారు. తెలంగాణను దాటి దిగువన సముద్రంలో కలిసిపోయే గోదావరి జలాలను వాడుకుంటే ఆ రాష్ట్రానికి వచ్చే నష్టమేమిటని అడిగారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతులు తీసుకునే తెలంగాణ కట్టిందా అని ప్రశ్నించారు. 'స్టడీ చేసే దానిని కట్టారా? అక్కడో రూలు .. ఇక్కడో రూలా? తెలంగాణకో నీతి.. ఆంధ్రాకో నీతా? ఇది ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం కాదా? బనకచర్ల పథకంలో తప్పెక్కడుంది? తెలంగాణ నుంచి నీటిని ఎత్తిపోసి దానికి వాడుకోవడం లేదు కదా! కాళేశ్వరం ప్రాజెక్టుకు చిల్లుపెట్టి తోడేయడం లేదు కదా! ఒకవేళ ఒక ఏడాది వరద రాకపోతే మిగులు జలాలను బనకచర్ల కోసం వాడుకోం' అని స్పష్టం చేశారు. బనకచర్లపై చర్చ జరగాలని కోరుకుంటున్నానని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏపీ ఎప్పుడూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని గుర్తుచేశారు. టీడీపీ తెలంగాణకు వ్యతిరేకంగా పనిచేయదన్నారు. తెలుగు ప్రజలందరి కోసం తాము మాట్లాడతామని తెలిపారు.

హద్దు దాటొద్దు!

- పారిశ్రామిక అనుకూల వాతావరణం చెడగొట్టొద్దు
- మంత్రి సవితపై లోకేశ్ సీరియస్
- నంద్యాల ఘటనపైనా ఆరా

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పెనుగొండ మండలంలోని కియా పరిశ్రమ వద్ద బీసీ సంక్షేమ మంత్రి సవిత అనుచరులు కాంట్రాక్టుల కోసం హడావుడి చేయడాన్ని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తీవ్రంగా పరిగణించారు. ఇలాంటి చర్యలతో రాష్ట్రంలో ఉన్న పారిశ్రామిక అనుకూల వాతావరణానికి విఘాతం ఏర్పడుతుందని, ఇలాంటివి పునరావృతమైతే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలను ఎవరు భయపెట్టాలని చూసినా కఠిన చర్యలు తప్పవన్నారు. అలాగే.. నంద్యాల జిల్లాలో కొలిమిగుండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బంధువు దాడి చేసిన వ్యవహారంపైనా లోకేశ్ ఆరా తీశారు. మంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తులు, వారి బంధువులు బాధ్యతగా మెలగాలని.. సంయమనం కోల్పోయి వ్యవహరిస్తే ఇబ్బందులు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

పెట్టుబడులను అడ్డుకునేలా వైసీపీ కుట్రలు: పల్లా

రాష్ట్ర ప్రతిష్ఠను తుడిచిపెట్టేలా వైసీపీ కుట్రలకు తెరలేపిందని, దానిలో భాగంగానే సీఎం సింగపూర్ పర్యటనలో ఉండగానే రాష్ట్ర ప్రతిష్ఠను దిగజార్చేలా వందల మెయిళ్లు పంపారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు చంద్రబాబు, మంత్రి లోకేశ్ శ్రమిస్తుంటే.. అభివృద్ధి నిరోధకులుగా మారిన వైసీపీ నేతలు పెట్టుబడులను అడ్డుకునేలా కుట్రలు పన్నుతున్నారని ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. రాష్ట్రానికి మేలు జరిగితే తట్టుకోలేని ఆ పార్టీ కుట్రలతో రంగంలోకి దిగిందన్నారు.

ఇంకెన్ని బాక్సులు బయటపడతాయో!

లిక్కర్ స్కాంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని లోకేశ్ అన్నారు. ఈ వ్యవహారంలో జగన్‌ను అరెస్టు చేస్తారా అని మీడియా అడుగగా.. పై విధంగా స్పందించారు. 'ఫాంహౌస్‌లో పట్టుబడిన రూ.11 కోట్లు తనవి కావని రాజ్ కసిరెడ్డి చెబుతున్నాడంటే.. అవి జగన్‌వేనని పరోక్షంగా అంగీకరించినట్లుగానే భావించాల్సి ఉంటుంది. ఈ డబ్బు తమదంటూ ఇంతవరకూ ఎవరూ ఎందుకు క్లెయిమ్ చేయలేదు? దర్యాప్తులో ఇంకెన్ని బాక్సులు బయటపడతాయో! ఎంత డబ్బులు చేతులు మారాయో జగన్‌కే తెలుసు. ఆయన్నడిగితే లెక్కలు చెబుతారు. ఏ పెట్టెలో ఎంత డబ్బుందో ఆయనకే బాగా తెలుసు. అదాన్ డిస్టలరీ నుంచి పాపాల పెద్దిరెడ్డి కంపెనీ(పీఎల్ఆర్)కి డబ్బులు వెళ్లాయో లేదో పెద్దిరెడ్డి చెప్పాలి. కన్‌స్ట్రక్షన్ కంపెనీకి.. లిక్కర్ కంపెనీకి ఏం సంబంధమో, ఏయే ఆర్థిక లావాదేవీలు జరిగాయో వెల్లడించాలి. ఈ డబ్బు పీఎల్ఆర్ నుంచి జగన్‌కు వెళ్లింది. లిక్కర్ కంపెనీ రూ.400 కోట్ల బంగారం ఎందుకు కొన్నదో అర్థం కావడం లేదు. తక్కువ ధర ఉన్నప్పుడు జగన్ బంగారం కొన్నారు. ఇప్పుడు ధర అమాంతం పెరిగింది. ఆయన అద్భుతమైన ఇన్వెస్ట్‌మెంట్‌కూ.. క్రిమినల్ మైండ్‌కు ఇదో ప్రత్యక్ష ఉదాహరణ' అని తెలిపారు. జగన్ వల్లే తాను రాజకీయంగా రాటుదేలానని లోకేశ్ అన్నారు. జీవో నం.1తో ప్రతిపక్షాన్ని నిర్బంధించడంతో తమలో కసి పెరిగిందన్నారు. ఉండవల్లి నివాసం వద్ద ప్రజాదర్బార్‌కు అనుమతి ఇవ్వలేదని.. చంద్రబాబు బయటకు రాకుండా గేట్లకు తాళ్లు కట్టారని.. జిల్లాల పర్యటనలకూ అనుమతులు ఇవ్వకుండా నిరోధించారని.. వీటిన్నింటివల్లే తాను రాటు దేలానని చెప్పారు. ఇంతకాలం నల్లని గడ్డంతో కనిపించిన జగన్ ఒక్కసారిగా తెల్లటి గడ్డంతో కనిపించడం ఆశ్చర్యమేనని ఆయన వ్యాఖ్యానించారు.

విచిత్రాల జగన్!

నెల్లూరులో కట్టుకథలు.. వింత వ్యాఖ్యలు!

పెద్దిరెడ్డిపై పగతోనే మిథున్ అరెస్టట!

చంద్రగిరి చేజారిందని చెవిరెడ్డిపై కేసులట

అసలు కేసులు చెప్పకుండా అమాయకత్వం

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

'వామ్మో.. ఇవేం మాటలు! ఇవెక్కడి కథలు! ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఇలా కూడా మాట్లాడతారా?' అని జనం ముక్కున వేలేసుకునేలా జగన్ వ్యవహరించారు. గురువారం నెల్లూరు జిల్లా పర్యటనలో ఆయన చెప్పిన మాటలు విని విస్తుపోయారు. పోలీసులు, సిట్ అధికారులు నమోదు చేసిన కేసులకు కొత్త భాష్యం చెప్పారు. మద్యం కుంభకోణం కేసులో మిథున్ రెడ్డి ప్రమేయం, పాత్రపై ఆధారాలు సేకరించిన తర్వాతే 'సిట్' ఆయనను అరెస్టు చేసింది. కానీ... దీనికి జగన్ 53 ఏళ్లకిందట ఎప్పుడో కాలేజీ గొడవల్లో చంద్రబాబును పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెప్పుతో కొట్టారని... ఆ కక్ష తీర్చుకోవడానికే ఇప్పుడు మిథున్ రెడ్డిని అరెస్టు చేశారని వింత కథ చెప్పారు. చంద్రబాబు, పెద్దిరెడ్డి 1972లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలో వేర్వేరు గ్రూపులకు నాయకత్వం వహించేవారు. రెండు యూనియన్ల విద్యార్థుల మధ్య తరచూ గొడవలు జరిగేవి. అది నిజమే! కానీ... చంద్రబాబు విద్యార్థి నాయకుడిగా ఉండేవారే కానీ, ఎప్పుడూ ప్రత్యక్షంగా గొడవల్లోకి వెళ్లలేదు, కొట్టుకోలేదు, కొట్టలేదు. ఆ తర్వాత చిత్తూరు జిల్లా రాజకీయాల్లో వేగంగా ఎదిగారు. దీంతో... అక్కసు అవుకోలేక చంద్రబాబును పెద్దిరెడ్డి కొట్టారంటూ 1978 తర్వాత తప్పుడు ప్రచారం చేశారు. దానిని జనం అప్పుడే పట్టించుకోలేదు. ఇప్పుడు... జగన్ మళ్లీ అదే కట్టుకథ చెప్పడం విని నాటి స్టూడెంట్ యూనియన్ల గొడవల గురించి తెలిసిన పెద్దలు నవ్వుకుంటున్నారు. చంద్రబాబు సీఎం కావడం ఇది నాలుగోసారి. పెద్దిరెడ్డిపై కక్ష సాధించాలనుకుంటే... 1995లో తొలిసారి సీఎం అయినప్పుడే ఆ పని చేసేవారు కదా అన్నది జనం ప్రశ్న!

చంద్రగిరిపైనా చెత్త కథ

'నారావారిపల్లె ఉన్న చంద్రగిరి నియోజకవర్గంపై పట్టు సాధించినందుకే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మీద తప్పుడు కేసులు పెట్టి లోపల వేయించారు" అనేది జగన్ చెప్పిన మరో వింత కథ. 1983 ఎన్నికల ఫలితాలతోనే చంద్రబాబు చంద్రగిరిని వదిలేశారు. ఆయన జిల్లా మీద, రాష్ట్రం మీద దృష్టి సారించారే తప్ప చంద్రగిరికి మాత్రమే పరిమితం కాలేదు. కుప్పం నుంచే వరుసగా పోటీ చేసి గెలుస్తున్నారు. ఇక చెవిరెడ్డి చంద్రగిరి నుంచి 2014, 2019లో రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో టీడీపీ అధికారంలో ఉంది. చెవిరెడ్డి మీద తప్పుడు కేసులు పెట్టాలనే ఉద్దేశమే ఉంటే అప్పుడే పెట్టేవారు కదా!



మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డి ఇంటివద్ద మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

కాకాణిపై చిన్న కేసులా?

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని సచ్ఛీలుడిగా అభివర్ణించేందుకు జగన్ నానా తంటాలు పడ్డారు. 'ఇంత చిన్న కేసులకు అరెస్టు చేసి 64 రోజుల పాటు జైల్లో పెడతారా?' అని అమాయకంగా ప్రశ్నిస్తూ ఏడు కేసులను చదివి వినిపించారు. నిజంగానే అవి చిన్న కేసులు. అయితే... కాకాణిని అరెస్టు చేసింది ఆ కేసుల్లో కాదు. రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ కొల్లగొట్టడం, కృష్ణపట్నం పోర్టుకు వెళ్లే దారిలో అనధికారిక టోల్‌గేట్ పెట్టి అక్రమ వసూళ్లు, ఫోర్జరీ సంతకాలతో గ్రావెల్ అక్రమ రవాణా ఇలాంటి తీవ్రమైన అభియోగాలతో నమోదైన కేసుల్లో కాకాణిని అరెస్టు చేశారు. జగన్ మాత్రం 'చాలా తెలివిగా' ఆ కేసుల గురించి కాకుండా, చిన్నచిన్న కేసుల చిట్టా మాత్రం చదివి, 'ఈ మాత్రానికే అరెస్టు చేస్తారా?' అని అమాయకత్వం ప్రదర్శించారు.

కక్షతోనే తప్పుడు కేసులు!

ప్రశ్నించే గొంతులను నొక్కేస్తున్నారు: జగన్

నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని... ప్రశ్నించే గొంతులను నొక్కేసే ప్రయత్నంలో భాగంగా వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని జగన్ విమర్శించారు. క్వార్ట్జ్ అక్రమ రవాణా కేసులో నెల్లూరు కేంద్ర కారాగారంలో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేసి ప్రజాగ్రహానికి గురైన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న కుమార్‌రెడ్డిని పరామర్శించడానికి జగన్ గురువారం నెల్లూరు పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ నాయకులపై పెట్టినవన్నీ తప్పుడు కేసులని, కక్షపూరితంగా పెట్టినవేనని ఒక్కో కేసుకు ఒక్కో కొత్త కారణాన్ని వివరించారు. ఏం తప్పు చేశాడని కాకాణిని జైల్లో పెట్టారని ప్రశ్నించారు. చదువుకునే రోజుల్లో చంద్రబాబును పెద్దిరెడ్డి చెప్పుతో కొట్టారని, "అది ఎంతగా చంద్రబాబు మనసులో నాటుకొని పోయిందంటే ఏకంగా పెద్దిరెడ్డన్న కొడుకును ఎట్లయినా జైల్లో పెట్టించాలా, పెద్దిరెడ్డికి మానసిక క్షోభ కలిగించాల అని ఆయన కుమారుడు మిథున్ రెడ్డిని అరెస్టు చేయించారు" అని వింత వాదన తెరపైకి తెచ్చారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతివిమర్శలు సహజమని... అంతమాత్రాన ప్రసన్న కుమార్ రెడ్డి ఇంటిపై దాడికి దిగి హత్యాయత్నం చేస్తారా అని ప్రశ్నించారు. చంద్రబాబు సొంత ఊరు నారావారిపల్లె ఉన్న చంద్రగిరి చెవిరెడ్డి చేతుల్లోకి పోయిందని ఆయనపై కేసు పెట్టారన్నారు. మూడేళ్ల తరువాత వైసీపీ అధికారంలోకి వస్తుందని... అప్పుడు చంద్రబాబును, ఆయన అడుగులకు మడుగులొత్తిన అవినీతి అధికారులను చట్టం ముందు నిలబెడతామని జగన్ హెచ్చరించారు.

జనం తక్కువ.. ఆర్భాటం ఎక్కువ!

- జగన్ నెల్లూరు పర్యటనలో హడావుడి
- భారీగా జన సమీకరణకు ప్రయత్నాలు అయినా కదిలిరాని పార్టీ శ్రేణులు
- రోడ్డుపై బైఠాయించి ప్రసన్న హంగామా
- బారికేడ్లను, పోలీసులను తోసేసి ముందుకు
- హెడ్‌కానిస్టేబుల్‌కు గాయాలు

నెల్లూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి): 'జగనన్న పర్యటనకు వేలాదిగా తరలిరండి' అంటూ వైసీపీ నేతలు ఇచ్చిన పిలుపును జనం పట్టించుకోలేదు. భారీ జన సమీకరణకు సొమ్ములు ఖర్చు పెట్టినా ఫలితం కనిపించలేదు. చివరికి... గురువారం జగన్ నెల్లూరు పర్యటన 'జనం తక్కువ. ఆర్భాటం ఎక్కువ' అన్నట్లుగా సాగింది. పోలీసుల ఆంక్షలను లెక్కచేయకుండా... జిల్లావ్యాప్తంగా 70వేల నుంచి లక్ష మందిని జగన్ పర్యటనకు తరలించాలని వైసీపీ నేతలు భావించారు. అయితే, పోలీసు ఆంక్షల నేపథ్యంలో ఎందుకొచ్చిన గొడవ అనుకుని ఇతర ప్రాంతాల నుంచి ఎవరూ కదిలి రాలేదు. నెల్లూరు నగరం చుట్టుపక్కల ఉన్న నియోజకవర్గాల నుంచి జన సమీకరణకు నగదు పంపకాలు జరిగినా ఆశించిన స్థాయిలో జనం రాలేదు. గురువారం ఉదయం 11 గంటలకు హెలిప్యాడ్ వద్ద దిగిన జగన్ నేరుగా సెంట్రల్ జైలుకు వెళ్లి కాకాణితో ములాఖత్ అయ్యారు. అక్కడి నుంచి బయలుదేరి ట్రంక్ రోడ్డు మీదుగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఆరంభం నుంచి ఆఖరు వరకు ఒక గుంపు మాత్రం జగన్ కాన్వాయ్ ముందు పరుగులు తీస్తూ హడావుడి సృష్టించింది. జీజీహెచ్ సెంటర్ వద్ద జనాన్ని పోగేయడం కోసం అన్నట్లుగా ప్రసన్న కుమార్‌రెడ్డి రోడ్డుపై బైఠాయించి హంగామా చేశారు. పోలీసు నిబంధనల ప్రకారం ప్రసన్న తన ఇంటి వద్దనే ఉండి జగన్‌కు స్వాగతం పలకాలి. కానీ జగన్ నెల్లూరుకు చేరుకోకముందే ఆయన అనుచరులతో కలిసి ట్రంక్‌రోడ్డుపైకి చేరుకున్నారు. దీంతో పోలీసులు ఈ గుంపును చెదరగొట్టడానికి లాఠీలకు పని చెప్పాల్సి వచ్చింది. జగన్ పర్యటన మొత్తంలో ఈ ఒక్క చోట మాత్రమే సుమారు ఐదు వేల మంది జనం కనిపించారు. జగన్ సొంత మీడియాలో ఈ గుంపును మాత్రమే ఫోకస్ చేస్తూ భారీగా జనం తరలి వచ్చినట్లు 'కవరేజ్' ఇచ్చుకుంది.

పోలీసులను నెట్టేసి.. బారికేడ్లు తొక్కుకుంటూ..

తమ కార్యకర్తలపై, తనపై పోలీసులు లాఠీచార్జ్ చేశారంటూ ప్రసన్న రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు ఎంత చెప్పినా వినకుండా నినాదాలు చేస్తూ ఉండిపోయారు. ఇంతలో జగన్ కాన్వాయ్ అక్కడకు చేరుకుంది. కార్యకర్తలను నిలువరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తుండగా... జగన్ మాత్రం 'రండి, రండి' అంటూ చేతులు ఊపారు. దీంతో కార్యకర్తలు రెచ్చిపోయారు. ప్రసన్న కుమార్ రెడ్డి తన అనుచరులతో కలిసి పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్లను తోసిపడేసి ముందుకు వెళ్లారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులనూ తోసేశారు. అక్కడే ఉన్న ఎస్‌బీ హెడ్‌కానిస్టేబుల్ మాలకొండయ్య కిందపడటంతో ఆయన కుడి చేయి విరిగిపోయింది. ఒక పోలీసు అధికారి కూడా కిందపడ్డారు.



నెల్లూరు కేంద్ర కారాగారంలో మాజీ మంత్రి కాకాణితో ములాఖత్ ముగిశాక నెల్లూరులోకి వెళుతూ మార్గమధ్యంలో అతి పలుచగా ఉన్న అభిమానులకు అభివాదం చేస్తున్న మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి

ఇంటి భోజనాన్ని అనుమతించండి

- కోర్టులో మరోసారి చెవిరెడ్డి పిటిషన్
- మూడోసారి సజ్జల శ్రీధర్‌రెడ్డి బెయిల్ పిటిషన్

విజయవాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి): విజయవాడ జిల్లా జైల్లో ఉన్న తనకు ఇంటి నుంచి భోజనాన్ని అనుమతించాలని కోరుతూ చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఏసీబీ కోర్టులో మరోసారి పిటిషన్ దాఖలు చేశారు. ఆ భోజనాన్ని తన సతీమణి లక్ష్మీకాంతమ్మ తీసుకువస్తారని కోర్టుకు తెలిపారు. ఇంతకుముందు ఇంటి భోజనం కోసం చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. ఇప్పుడు గురువారం రెండోసారి పిటిషన్‌ను దాఖలు చేశారు. మద్యం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న సజ్జల శ్రీధర్‌రెడ్డి మూడోసారి బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ఇప్పటికే రెండుసార్లు ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను కోర్టు కొట్టేసింది. దీనిపై కోర్టు స్పందిస్తూ.. ప్రాసిక్యూషన్‌కు నోటీసులివ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణను నాలుగో తేదీకి వాయిదా వేసింది. అదేవిధంగా ఈ కేసులో ఏ2, ఏ3 నిందితులుగా ఉన్న డి.వాసుదేవరెడ్డి, డి.సత్యప్రసాద్ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లపై విచారణ శుక్రవారానికి వాయిదా పడింది.

తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు కొమ్మినేని



పోలీసు స్టేషన్‌లో సంతకం చేస్తున్న కొమ్మినేని శ్రీనివాసరావు

తాడేపల్లి టౌన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై టీవీ డిబేట్‌లో అసభ్య వాఖ్యలు చేయడంతో నమోదైన కేసులో కోర్టు ఉత్తర్వులు మేరకు జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు గురువారం తాడేపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి సంతకం చేశారు. అయితే ఆయన నెలకు ఒకసారి తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు వెళ్లి సంతకం పెట్టాలని కోర్టు మొదట ఆదేశించింది. తుళ్లూరు వెళ్లేందుకు ఇబ్బందులున్నాయని తాడేపల్లి స్టేషన్‌కు వెళ్లి సంతకం చేసేందుకు అనుమతించాలని కొమ్మినేని కోర్టును అభ్యర్థించారు. కోర్టు అనుమతి ఇవ్వడంతో ఆయన తాడేపల్లి స్టేషన్‌కు వచ్చారు.

మొదటి నుంచీ దర్యాప్తు చేయొద్దు

- డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో దర్యాప్తు అధికారికి హైకోర్టు స్పష్టీకరణ

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వ్యవహారంలో తదుపరి దర్యాప్తు చేసే స్వేచ్ఛ దర్యాప్తు అధికారి(ఐవో)కి ఉంటుందని హైకోర్టు తేల్చిచెప్పింది. అయితే నిష్పాక్షికంగా దర్యాప్తు నిర్వహించాలని కోరే హక్కు నిందితుడికి ఉంటుందని పేర్కొంది. ఈ నేపథ్యంలో కేసును మొదటి నుంచీ తిరిగి దర్యాప్తు చేయడానికి వీల్లేదని ఐవోకు స్పష్టత ఇచ్చింది. రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు హత్య విషయంలో తదుపరి దర్యాప్తు జరుపవచ్చని పేర్కొంది. వ్యాజ్యాన్ని పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు గురువారం నిర్ణయం వెలువరించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 మే 19న కాకినాడకు చెందిన తన డ్రైవర్ సుబ్రహ్మణ్యాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు హత్య చేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన విషయం తెలిసిందే. తన కుమారుడి మృతదేహంపై 33 గాయాలు ఉన్నాయని.. ఈ కేసులో అనంతబాబును మాత్రమే నిందితుడిగా చేర్చారని, హత్యలో మరికొందరి పాత్ర కూడా ఉందని సుబ్రహ్మణ్యం తల్లి నూకరత్నం డీజీపీకి వినతిపత్రం ఇచ్చారు. దీనిపై విచారణ జరిపిన న్యాయాధికారి.. కేసులో తదుపరి దర్యాప్తు జరిపేందుకు అనుమతిస్తూ జూలై 22న ఉత్తర్వులిచ్చారు. ఆ ఉత్తర్వులను రద్దు చేయాలని అనంతబాబు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన కోర్టు.. హత్య కేసు తదుపరి దర్యాప్తునకు అనుమతిస్తూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ఆ ఉత్తర్వులపై స్టే విధించలేమని తేల్చిచెప్పింది. తదుపరి దర్యాప్తు పేరుతో పోలీసులు కేసును పునర్విచారణ చేయబోతున్నారని అనంతబాబు తరపు సీనియర్ న్యాయవాది ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ విషయంపై స్పష్టతనిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించింది. ఆ మేరకు గురువారం స్పష్టత ఇచ్చింది.

తప్పిపోయిన బాలికల కోసం 'ఆపరేషన్ ట్రేస్'

- వారిని గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగిస్తాం
- ఈనెల రోజులు రాష్ట్ర వ్యాప్తంగా అమలు: డీజీపీ

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలికల్ని గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు నెలరోజుల పాటు రాష్ట్రంలో 'ఆపరేషన్ ట్రేస్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. తల్లిదండ్రుల వద్దకు ఆడబిడ్డల్ని చేర్చడమే లక్ష్యంగా ఉమెన్ సేఫ్టీ విభాగం ఆగస్టు 1 నుంచి 31 వరకూ ఈ కార్యక్రమాన్ని చేపడుతోందన్నారు. క్షేత్రస్థాయి పోలీసులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో సీసీటీఎన్ఎస్, వత్సలా పోర్టల్, ఫేషియల్ రికగ్నిజేషన్ ద్వారా గుర్తిస్తామని చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, రెడ్ లైట్ ఏరియాల్లో తనిఖీలు చేసి గుర్తించిన బాలికల్ని మహిళా పోలీసుల ద్వారా చైల్డ్ వెల్ఫేర్ కమిటీల సహకారంతో కుటుంబ సభ్యుల వద్దకు చేరుస్తామన్నారు. కేసులు నమోదు చేయాల్సి వస్తే చేస్తామన్నారు. మిస్సింగ్‌కు కారణాలు తెలుసుకుని కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు విద్యాభ్యాసం, నైపుణ్య శిక్షణ, ప్రభుత్వ పథకాల ద్వారా భవిష్యత్తుకు భరోసా కల్పిస్తామని డీజీపీ వివరించారు. ఎవరి కుటుంబాల్లోనైనా బాలికలు తప్పిపోయి ఉంటే ఆ కుటుంబసభ్యులు 112 లేదా 1098 హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. శక్తి వాట్సాప్(7993485111) ద్వారా బాలిక ఫొటోతో సంప్రదించవచ్చని సూచించారు. ప్రతి పాఠశాలలో ఐదుగురు బాలికల్ని శక్తి వారియర్స్‌గా ఎంపిక చేసి గుడ్ టచ్, బ్యాడ్ టచ్, ఆత్మరక్షణపై అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతల ఏడీజీ మధుసూదన్ రెడ్డి, ఐజీ రాజకుమారితో కలిసి 'ఆపరేషన్ ట్రేస్' పోస్టర్‌ను డీజీపీ గుప్తా విడుదల చేశారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా

మూడు వారాల్లోగా లొంగిపోండి

- ఐపీఎస్ సంజయ్‌కు సుప్రీం షాక్

న్యూఢిల్లీ, అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): సీఐడీ మాజీ చీఫ్ సంజయ్‌కు సుప్రీంకోర్టులో షాక్ తగిలింది. ఆయనకు గతంలో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. కోర్టు ముందు లొంగిపోవడానికి మూడువారాల సమయం ఇచ్చింది. ఈలోపు సంజయ్‌ను కస్టడీకి తీసుకోవాలనుకుంటే మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలుచేయాలని ఏసీబీ దర్యాప్తు అధికారులకు సూచించింది. వైసీపీ హయాంలో అగ్నిమాపక శాఖ చీఫ్‌గాను, సీఐడీ అధిపతిగాను సంజయ్ అవినీతికి పాల్పడ్డారంటూ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కూటమి ప్రభుత్వానికి రెండు వేర్వేరు నివేదికలు సమర్పించింది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై దళితులకు, గిరిజనులకు అవగాహన సదస్సుల పేరిట రూ.కోట్లు దోచేశారని తెలిపింది. ఈ మేరకు సంజయ్‌ను ప్రధాన నిందితునిగా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదుచేసింది. ఆ కేసులో ఏపీ హైకోర్టు సంజయ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. హైకోర్టు తీర్పును ఈ ఏడాది మార్చి 5న ఏపీ ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌పై గురువారం జస్టిస్ అమానుల్లా, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టిలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మరోసారి విచారణ చేపట్టింది. తొలుత.. సంజయ్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు ప్రారంభించారు. కొద్దిసేపటి తర్వాత.. ముందు ప్రభుత్వం తరఫున ఏఎస్ రాజు వాదనలు వినిపిస్తారని, ఆలోపు మరోసారి ఫైళ్లు సరిచూసుకోవాలని సిబల్‌కు ధర్మాసనం సూచించింది. ఏఎస్ రాజు వాదనలు వినిపిస్తూ.. దళితులు, గిరిజనులకు అవగాహన సదస్సుల పేరుతో నిబంధనలకు వ్యతిరేకంగా నిధులు కాజేశారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 25 ప్రాంతాల్లో అవగాహన సదస్సులు జరిగితే, అందులో 24 ప్రభుత్వ ఆతిథ్యంలోనే జరిగాయని, కేవలం ఒక సదస్సు మాత్రమే ప్రైవేట్ ఆతిథ్యంలో జరిగిందని తెలిపారు. 25 ప్రాంతాల్లోనూ సదస్సుల సందర్భంగా స్థానిక అధికారులే వసతులన్నీ కల్పించారన్నారు. అయితే, ఒక ప్రైవేటు సంస్థతో కలిసి సంజయ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ సమర్పించిన నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకుంటున్నాం" అని తెలిపారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి స్పష్టమైన ఆధారాలున్నాయని, కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని ఏఎస్ రాజు ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బెయిల్‌ను రద్దు చేయడం అవసరమని తెలిపారు.

> "విశాఖపట్నంలో 350 మందికి అవగాహన సదస్సు. రాజమండ్రిలోనూ అంతేమందికి అవగాహన...ఇలా అన్ని కేంద్రాల్లో 350 మంది హాజరు ఎలా సాధ్యం.? 350 మందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని భావిస్తే, చివరి నిమిషంలో అనివార్య కారణాల వల్ల కొంతమందైనా గైర్హాజరు అవుతారు కదా? కానీ, ప్రతి కేంద్రంలోనూ 350 మందికి భోజనాలు, ఇతర వసతులు కల్పించినట్టు ఇన్‌వాయిస్‌లు ఉన్నాయి. ఆ మేరకే బిల్లులు డ్రా చేశారు. ఇదెలా సాధ్యం?. కీలక బాధ్యతల్లో ఉండే వ్యక్తులు అన్నీ చూసుకోవాలి కదా?. మా ఇష్టానుసారంగా చేస్తామంటే ఎలా?." -సుప్రీంకోర్టు ఆగ్రహం

బాధ్యత ఉండాలి కదా?

ప్రజాధనం వినియోగించేటప్పుడు బాధ్యత ఉండాలి కదా? అని సంజయ్ తరఫున న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. "విశాఖపట్నంలో 350 మందికి అవగాహన సదస్సు. రాజమండ్రిలో 350 మందికి అవగాహన సదస్సు. ఇలా.. అన్ని కేంద్రాల్లో 350 మంది హాజరు ఎలా సాధ్యం.? 350 మందికి అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని భావిస్తే.. చివరి నిమిషంలో అనివార్య కారణాల వల్ల కొంతమందైనా గైర్హాజరవుతారు కదా? ప్రతికేంద్రంలో 350 మందికి భోజనాలు, ఇతర వసతులు కల్పించినట్టు ఇన్‌వాయిస్‌లు ఉన్నాయి. ఆ మేరకే బిల్లులు డ్రా చేశారు. ఇదెలా సాధ్యం.." అంటూ జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. పైగా.. ఒకేరోజు, ఒకే సమయంలో అన్ని కేంద్రాల్లో సదస్సులు జరిగినట్టు తెలపడంపైనా సందేహం వ్యక్తం చేశారు. ఇంతలోనే మరో సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు ప్రయత్నించగా, ఎవరైనా ఒకరే కౌన్సిల్ వాదనలు వినిపించాలని ధర్మాసనం సూచించింది. ఈ నేపథ్యంలో రాజు మళ్లీ వాదనలు కొనసాగించారు. ప్రతి సదస్సులోనూ వీడియోలు, ఫొటోల కోసం డబ్బులు వెచ్చించినట్టు ఇన్‌వాయిస్‌లో పేర్కొన్నారని, కానీ ప్రతిచోటా సిబ్బందే తమ ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీశారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఇంతలోనే.. కపిల్ సిబల్ కలుగజేసుకుని.. ఆయనో ప్రభుత్వ ఉన్నతాధికారి అని, కింది స్థాయి అధికారులు అన్నీ సిద్ధం చేసిన తర్వాత నిబంధనల మేరకే ఆయన సంతకాలు చేశారని తెలిపారు. సిబల్ వాదనలపై జస్టిస్ భట్టి తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేశారు. "మీరు నాకంటే ఎంతో సీనియర్. ఇటువంటి ఎన్నో కేసులను వాదించి ఉంటారు. మనం ఏ కార్యక్రమం చేసినా 350 మంది అనుకుంటే.. కనీసం ఒకరిద్దరు అయినా తక్కువగా హాజరవుతారు. ఇది ఏ చిన్న పిల్లవాడిని అడిగినా చెబుతారు కదా? మరి.. అలాంటప్పుడు అన్ని సదస్సులకు 350 మంది ఎలా హాజరయ్యారు? అనే దానికి సమాధానం చెప్పండి" అని సిబల్‌ను ప్రశ్నించారు. తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయని, కొంత సమయం ఇస్తే వివరంగా చెబుతానని సిబల్ అన్నారు. దీనిపై బెంచ్ స్పందిస్తూ... "కీలక బాధ్యతల్లో ఉండే వ్యక్తులు అన్నీ చూసుకోవాలి కదా? మా ఇష్టానుసారంగా చేస్తామంటే ఎలా?" అని ప్రశ్నించించి. ఇప్పటికే చాలా సమయం ఇచ్చామని, ఇక అవకాశం లేదని తేల్చిచెప్పింది. సంజయ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడంపై ఇప్పటికే సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తంచేసింది. ఆ ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు వెల్లడించింది. అయితే.. సంజయ్ కోర్టులో లొంగిపోవడానికి సమయం ఇవ్వాలని కపిల్ కోరగా.. ధర్మాసనం, మూడు వారాల సమయం ఇచ్చింది. అదే సమయంలో సంజయ్‌ను కస్టడీలోకి తీసుకుని విచారించాలని భావిస్తే, దర్యాప్తు సంస్థ పిటిషన్ దాఖలు చేయవచ్చని పేర్కొంది.





దళితుల సొమ్మును దోచేశారు

వైసీపీ హయాంలో సంజయ్ దళితుల పేరిట అడ్డంగా దోచేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై వారికి అవగాహన కల్పించడం పేరిట ప్రభుత్వ నిధులను సీఐడీ ఏడీజీ హోదాలో ఆయన దుర్వినియోగం చేశారు. అగ్నిమాపక శాఖలో ఎన్‌వోసీలు ఆన్‌లైన్‌లో జారీ చేసేందుకు మొబైల్ యాప్ అభివృద్ధి, నిర్వహణ, ట్యాబ్‌ల కొనుగోళ్ల విషయంలో ఆ శాఖ అధిపతిగా ఆయన భారీ అవినీతికి పాల్పడినట్లు తేలింది. దీనికోసం నియమించుకున్న ప్రైవేటు సంస్థ ఏ పనులు చేయలేదు. కానీ, ఆ సంస్థకు రూ.59.93 లక్షల విలువైన బిల్లులు చెల్లించారు. దీంతో సంజయ్‌పై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జరిపిన విచారణలో సంజయ్ అవినీతి బాగోతం బయట పడింది. ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించేందుకు పలు కల్యాణ మండపాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో రూ.1.19కోట్లు ఖర్చు చేసినట్టు, క్రిత్వాప్ టెక్నాలజీస్ అనే సంస్థకు బిల్లులు చెల్లించినట్లు సంజయ్ చూపారు. అయితే ఎక్కడా కల్యాణ మండపాల్లో సమావేశాలు నిర్వహించలేదు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నిర్వహించారు. టీ, బిస్కట్లు ఇచ్చి భోజనాలు పెట్టినట్లు చూపించి కోటి రూపాయలకు పైగా నిధులు కాజేశారంటూ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీని ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది.

మరో 5 కోట్ల గుట్టు రట్టు

- రాజ్ కసిరెడ్డి డైరెక్షన్‌లో ముడుపుల పంపిణీ
- హైదరాబాద్‌లో లిక్కర్ స్కామ్ బాగోతం
- ఇచ్చింది పంకజ్.. చేరింది సైమన్, వేణుకు
- 25, 30 లక్షల చొప్పున పలుమార్లు అందజేత
- సిట్ దర్యాప్తులో వరుణ్ సమాచారం
- అదాన్ అకౌంటెంట్ శ్రీకాంత్ విచారణ
- డొల్ల కంపెనీల గుట్టు తేల్చేందుకు ముంబైకి సిట్
- చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కూ బృందాలు

అమరావతి, జూలై 31(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో రోజుకో గుట్టు బయటకు వస్తోంది. అదాన్ డిస్టిలరీస్‌లో అకౌంటెంట్‌గా పనిచేసిన శ్రీకాంత్ ఐదు కోట్ల రూపాయల రహస్య లావాదేవీల సమాచారాన్ని తాజాగా సిట్ అధికారులకు వివరించాడు. దుబాయ్ నుంచి తిరిగి వస్తుండగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అరెస్టయిన ఏ-40 వరుణ్ పురుషోత్తం ఇచ్చిన సమాచారం ఆధారంగా శ్రీకాంత్‌ను గురువారం విజయవాడలో సిట్ ప్రశ్నించింది. హైదరాబాద్ శివారులో దాచిన రూ.11 కోట్ల నగదు డెన్ గురించి వరుణ్ వెల్లడించిన సంగతి తెలిసిందే. రూ.5కోట్ల మరో లావాదేవీ గురించి ఇప్పుడు శ్రీకాంత్ వెల్లడించాడు. హైదరాబాద్‌లో ముడుపులు చేతులు మారిన విషయం గురించి అధికారులకు వివరించాడు. మూడున్నర వేల కోట్ల రూపాయల లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడు రాజ్ కసిరెడ్డి(ఏ-1)కి అదాన్ డిస్టిలరీస్ బినామీ సంస్థ. మొదట తోడల్లుడు ముప్పిడి అవినాశ్ రెడ్డి, ఆ తర్వాత కాశీచయనుల శ్రీనివాస్ డైరెక్టర్లుగా అదాన్ డిస్టిలరీస్‌ను నడిపించాడు. అదాన్‌లో అకౌంటెంట్‌గా శ్రీకాంత్, ఆపరేషన్ మేనేజర్‌గా వరుణ్ పురుషోత్తం పని చేశారు. లీలా డిస్టిలరీస్ ప్రారంభించిన వెంటనే దాని పూర్తిస్థాయి బాధ్యతలు వరుణ్ పురుషోత్తంకు అప్పగించారు. ఈ రెండు డిస్టిలరీస్ నుంచి క్రమం తప్పకుండా ముడుపులు చెల్లించేందుకు ఏర్పాటు చేసుకున్న వ్యవస్థలో లీలా తరఫున ముడుపులు ఇచ్చే బాధ్యత పంకజ్‌కు అప్పగించారు. శ్రీకాంత్ తరచూ వరుణ్‌కు ఫోన్ చేసి 'నువ్వు హైదరాబాద్‌లోని వెంగళరావు పార్క్ వద్దకు, అయ్యప్ప సొసైటీలోని కార్ల షోరూం వద్దకు వెళ్లు.. అక్కడికి పంకజ్ వచ్చి డబ్బులిస్తాడు. తీసుకున్న వెంటనే కాశీచయనుల శ్రీనివాస్‌కు ఫోన్ చెయ్యి.. ఆయన చెప్పిన వారికి అప్పగించు' అని చెప్పేవాడు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిసారి పాతిక, ముప్పై లక్షల చొప్పున పలుమార్లు వరుణ్ డబ్బులు తీసుకుని శ్రీనివాస్ చెప్పిన వారికి అందజేసేవాడు. ఎక్కువ సార్లు సైమన్ ప్రసన్(ఏ-41), వేణు(నిందితుడు కాదు)కు అందజేసినట్లు సిట్ విచారణలో వరుణ్ వెల్లడించాడు. ఈ వాంగ్మూలం ఆధారంగా శ్రీకాంత్‌ను పిలిపించి సిట్ అధికారులు విచారించారు. 'రాజ్ కసిరెడ్డి చెప్పినట్లు అదాన్ డైరెక్టర్ కాశీచయనుల శ్రీనివాస్ చేసేవాడు. శ్రీనివాస్ ఆదేశాల మేరకు డబ్బులిచ్చే వ్యక్తి పేరు వరుణ్‌కు చెప్పి, తీసుకున్న తర్వాత శ్రీనివాస్‌కు ఫోన్ చేయమని చెప్పేవాడిని. ఆ డబ్బులు వైసీపీ పెద్దలకు చేరుతున్నట్లు అర్థమైంది' అని శ్రీకాంత్ చెప్పినట్లు సమాచారం. దుబాయ్‌లో ఉంటున్న సైమన్ ప్రసన్, ఇప్పటి వరకూ ఈ కేసులో పేరు బయటపడని వేణును త్వరలో విచారించి, ఈ బాగోతాన్ని పూర్తిగా వెలికి తీసేందుకు సిట్ అధికారులు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

విచారణకు ఐదు సిట్ బృందాలు

లిక్కర్ స్కామ్‌ను టెక్నాలజీ సాయంతో వెలికితీస్తున్న సిట్ అధికారులు డొల్ల కంపెనీల గుట్టు తేల్చేందుకు ముంబైకి వెళ్లారు. మద్యం ముడుపులను 'వైట్'గా మార్చుకోవడానికి ముంబైలో పలు డొల్ల సంస్థలు పుట్టించిన మద్యం ముఠా హవాలాకు పాల్పడిన వైనాన్ని వెలికితీసే ప్రయత్నంలో భాగంగా రెండు ప్రత్యేక బృందాలు ముంబైకి చేరుకున్నాయి. బంగారం బిల్లులు, దుస్తుల బిల్లులు, జీఎస్టీ వ్యవహారాలు, హవాలా గుట్టు తేల్చబోతున్నట్లు తెలిసింది. బెంగళూరు, హైదరాబాద్, చెన్నైలకూ మరో మూడు సిట్ బృందాలు వెళ్లాయి.

లిక్కర్ సొమ్ములో నొక్కేశారు

- మహంకాళి ఆలయ పునఃనిర్మాణానికి కోట్ల విరాళమిచ్చిన వాసుదేవరెడ్డి
- అప్పటి ఆలయ ఈవో, మధ్యవర్తి దోపిడీ
- కుంభకోణం వెలుగు చూడడంతో విదేశాలకు పారిపోయిన ఈవో

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వంలో జరిగిన మద్యం కుంభకోణంలో దోచుకున్న సొమ్ములో కొంతమొత్తాన్ని దేవదాయ శాఖ అధికారి నొక్కేశారు. ఈ వ్యవహారంలో ఓ మధ్యవర్తి పాత్ర కూడా ఉంది. అక్రమ మద్యం వ్యాపారంలో కీలకపాత్ర పోషించిన నాటి బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి తన పాపాన్ని కడిగేసుకునేందుకు దేవాలయాన్ని పునర్నిర్మించాలని భావించారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి కోట్లలో విరాళం ఇచ్చారు. తన సామాజికవర్గానికి చెందిన ఈవో వెంకటరెడ్డికి అర్హత లేకపోయినా తనకున్న పవర్‌తో ఆ గుడి ఈవోగా బాధ్యతలు అప్పగింపచేశారు. ఆయనకు నిర్మాణ పనుల్లో సహకరించేందుకు అదే గ్రామానికి చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తికి కూడా బాధ్యతలు అప్పగించారు. వీరిద్దరు రూ.5-6 కోట్లు వాసుదేవరెడ్డి నుంచి తరలించుకొచ్చినట్లు ప్రచారం జరిగింది. అంతేగాక గత ప్రభుత్వంలో తనకున్న పలుకుబడి ద్వారా వాసుదేవరెడ్డి సీజీఎఫ్ గ్రాంట్ నుంచి కూడా రూ.కోటి మంజూరు చేయించారు. ఈవో వెంకటరెడ్డి, నాగేశ్వరరావు కుమ్మక్కై అందులో కొంత సొమ్ముతో నిర్మాణం చేపట్టి, రెండొంతులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రజల వద్ద నుంచి కూడా భారీ ఎత్తున విరాళాలు వచ్చాయి. ఎవరు ఎంత ఇచ్చారు? ఎన్ని కోట్ల అభివృద్ధి పనులు జరిగాయో వివరాలేవీ లేవు. గత ప్రభుత్వంలో వెంకటరెడ్డికి మహంకాళి అమ్మవారి ఆలయంతో పాటు మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని దుగ్గిరాల, సీతానగరం, నూతక్కి గ్రూప్ దేవాలయాలకు అదనపు బాధ్యతలు అప్పగించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లిక్కర్ స్కామ్‌పై సిట్ దర్యాప్తు చేపట్టడంతో ఎక్కడ ఈ కుంభకోణం వెలుగులోకి వస్తుందోనని ఆలయ పాత ఈవో వెంక టరెడ్డి ఇటీవల సెలవు పెట్టి విదేశాలకు వెళ్లిపోయారు.

ఆస్తులు కొన్న వాసుదేవరెడ్డి

మహంకాళి దేవాలయానికి వాసుదేవరెడ్డి రూ.2 కోట్లు విరాళంగా ఇచ్చిన వైనంపై 'ఆంధ్రజ్యోతి' గత ఏడాది ఆగస్టు 9న 'వామ్మో వాసుదేవా' అనే శీర్షికన కథనం ప్రచురించింది. ఆయన దుగ్గిరాలలో రూ.14 కోట్లు ఖరీదు చేసే పొలం కొనుగోలు చేశారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో బినామీల పేరుతో 50 ఎకరాలు సొంతం చేసుకున్నారు.

ఆ 11 కోట్లను ఎస్‌బీఐలో డిపాజిట్ చేయండి

విజయవాడ, జూలై 31(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో హైదరాబాద్ శివారు ప్రాంతం శంషాబాద్‌లోని కాచారంలో ఉన్న సులోచన ఫామ్ హౌస్ నుంచి స్వాధీనం చేసుకున్న రూ.11 కోట్లను బ్యాంకులో డిపాజిట్ చేయాలని ఏసీబీ కోర్టు సిట్ అధికారులను ఆదేశించింది. విజయవాడ మాచవరంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో డిపాజిట్ చేయాలని సూచించింది. ఈ డబ్బును కోర్టులో భద్రపరచడం గానీ లేదా బ్యాంకులో డిపాజిట్ గానీ చేయాలని కోరుతూ సిట్ దాఖలు చేసిన మెమోపై గురువారం ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ ఆదేశాలు ఇచ్చారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.